

కొత్తపట్నంలో బియ్యం బస్తాతో కూలీ

వైసీపీ ప్రభుత్వం సాగించిన ఐదేళ్ల ప్రజాకంటక పాలనతో సీఎం జగన్‌రెడ్డి, ఆపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు తీవ్ర ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారు. చేసిన అభివృద్ధిని జనానికి వివరించి ఓట్లు అభ్యర్థించలేని దుస్థితి వారికి దాపురించింది. దీంతో ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రలోభాలు, బెదిరింపులకు దిగుతున్నారు. మండలం, గ్రామాల వారీ టీడీపీలో ముఖ్యనాయకులను గుర్తించి వారిని తమవైపు తిప్పుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వలంటీర్ల ద్వారా ఓటు బ్యాంకుల వివరాలను సేకరించుకుని వారికి గాలం వేస్తున్నారు. 'మీకు కొంత మొత్తం ఇస్తాం. ఎన్నికల్లో మాకు అనుకూలంగా పనిచేయండి' అని ప్రలోభపెడుతున్నారు. అందుకు ససేమిరా అన్న వారిని రకరకాలుగా బెదిరిస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యవహారం జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ నడుస్తోంది. అదేసమయంలో ఒంగోలులో ఇప్పటి వరకూ పార్టీనే నమ్ముకున్న వైసీపీ నేతలపై స్వపక్షం వారే నిఘా ఏర్పాటు చేశారు. ఇది తమను అవమానించడమేనని కొందరు వాపోతున్నారు.

ప్రలోభాలు.. బెదిరింపులు..



ముండ్లమూరు మండలంలో వైసీపీ నేతల ఇళ్లలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం కేసులు (ఫైల్)

- వైసీపీ నేతల బరితెగింపు
- ప్రతిపక్ష నేతలు, ఓటు బ్యాంకులపై గురి
- వారిని తమవైపు తిప్పుకునేందుకు అడ్డదారులు
- ఇదేమని ప్రశ్నించిన వారిపై దాడులు
- యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన
- చోద్యంచూస్తున్న అధికారులు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 21 : జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంలోనే వైసీపీ నేతలు బరితెగిస్తున్నారు. యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తున్నారు. ఇప్పటికే ప్రలోభాల పర్వం ముమ్మరం చేసిన వారు ఇప్పుడు బెదిరింపు రాజకీయం ప్రారంభించారు. ఓటు బ్యాంకులుగా ఉండే ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలను, ఆయా సామాజికవర్గాల వారీ ముఖ్యులను టార్గెట్‌గా చేసుకొని వారిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు సామ, దాన, భేద దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. అందుకు లొంగని వారిని బెదిరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారాలను కట్టడి చేయాల్సిన ఎన్నికల అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఓటు బ్యాంకులపై గురి

గ్రామాల్లో టీడీపీకి చెందిన ముఖ్యనేతలు, ఇతరత్రా ఓటు బ్యాంకులుగా ఉన్న వారిపై వైసీపీ నేతలు దృష్టి సారించారు. వారిని తమవైపు తిప్పుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కొందరికి డబ్బులు ఎరగా చూపి వల విసురుతున్నారు. మరికొందరికి వివిధ రకాల ఆశలు చూపుతున్నారు. వ్యాపారాలు, ఇతరత్రా ఆర్థిక వనరుల గురించి వివరించి మా మాట వినకపోతే మీ సంగతి చూస్తామంటూ హెచ్చరిస్తున్నారు. సొంత పార్టీకి చెందిన ఎవరైనా ప్రతిపక్ష పార్టీ వైపు చూస్తున్నారని తెలిస్తే వెంటనే వారికి ఫోన్ చేసి బుజ్జగిస్తున్నారు. తాయిలాలు ఆశ చూపుతు న్నారు. అప్పటికీ వినకపోతే బెదిరిస్తున్నారు. అదేసమయంలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తున్నారు. దీన్ని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఒంగోలు సమతానగర్‌లో చోటుచేసుకున్న ఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రచారంలో వలంటీర్ పాల్గొనడాన్ని ప్రశ్నించిన ఓ కుటుంబంపై వైసీపీ మూకలు దాష్టీకానికి దిగాయి. అక్కడికి వెళ్లిన టీడీపీ నేతలపైనా దాడులకు తెగబడ్డాయి. ఈ విషయంలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా వ్యవహరించినట్లు విమర్శలు వచ్చాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో బాధిత కుటుంబ పెద్ద అయిన కానిస్టేబుల్‌పైనే చర్యలు తీసుకొని స్వామిభక్తిని చాటుకున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

విచ్చలవిడిగా తాయిలాల పంపిణీ

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వైసీపీ నాయకులు విచ్చలవిడిగా తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలుకు ముందే ఒంగోలు, కొండపిల్లో ప్రారంభమైన ఈ ప్రలోభాలపర్వం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా జోరందుకుంది. కొత్తపట్నం మండలంలో ఇంటింటికీ ఒక బస్తా బియ్యంతోపాటు రెండు కిలోల నూనె ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. కనిగిరి, సంతనూతలపాడు, మార్కాపురం, గిద్దలూరు, కొండపి నియోజకవర్గాల్లో నిత్యం ఇలాంటి వ్యవహారాలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల కులపెద్దలు, ఓటర్లపై ప్రభావం చూపగలిగిన వారు, ఇతరత్రా ఓటు బ్యాంకులను గుర్తించి వారికి పెద్దమొత్తంలో డబ్బులు కూడా ఇస్తున్నారు. ఇకసొంత పార్టీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ముఖ్య నేతలకు కూడా పెద్దఎత్తున నగదు ముట్టజెప్పారు. మున్ముందు ఈ ప్రలోభాల పర్వం మరింత ముమ్మరం చేసేందుకు సిద్ధమయ్యారు.

మందుచూపు

నామినేషన్ల ప్రక్రియకు ముందే వైసీపీ నాయకులు పెద్దఎత్తున మద్యం నిల్వ చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ వైన్‌షాపుల నుంచే భారీగా తరలించినట్లు తెలుస్తోంది. ఐదు రోజుల క్రితం దర్శి నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన నేతల ఇళ్లలో సుమారు రూ.20 లక్షల విలువైన మద్యం పట్టుబడటం ఇందుకు నిదర్శనం. మిగిలిన నియోజకవర్గాల్లోని గ్రామాలకు ఇప్పటికే మద్యం చేరినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలకు చెందిన నాయకులు పది మంది కలిసి ఒకచోటకు వెళితే వెంటనే రంగంలోకి దిగుతున్న ఎన్నికల అధికారులు, ఎలాంటి అనుమతులు లేకుండా భారీ సంఖ్యలో ప్రచారం, ప్రలోభాలకు గురిచేస్తున్నా వైసీపీ వారి వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



బీఫాంలు అందుకున్న అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబుతో ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీల అభ్యర్థులు

గెలుపే లక్ష్యం

- టీడీపీ అధినేత చంద్రబాబు
- పార్టీ అభ్యర్థులకు ఉండవల్లిలో బీఫాంలు

ఒంగోలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికలకు మరో ఇరవై రోజులు మాత్రమే సమయం ఉన్నందున పార్టీ నుంచి పోటీచేస్తున్న ప్రతి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు అధికార మార్పిడి కోసం కాకుండా రాష్ట్ర పురోభివృద్ధికి అత్యంత కీలకమైనవని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థులంతా ఎమ్మెల్యేలుగా గెలిచి వచ్చి అందులో భాగస్వామ్యం కావాలని సూచించారు. అలాగే ఎంపీ అభ్యర్థులంతా విజయం సాధించి పార్లమెంట్‌లో రాష్ట్రం కోసం గళం విప్పాలన్నారు. వచ్చేనెల 13న జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు జిల్లాలో టీడీపీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులను ఇది వరకే ప్రకటించిన చంద్రబాబు.. వారికి ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో బీఫాంలను అందజేశారు. జిల్లా నుంచి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థులు దామచర్ల జనార్దన్ (ఒంగోలు), డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి (కొండపి), బీఎన్ విజయ్‌కుమార్ (సంతనూతలపాడు), డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి (కనిగిరి), డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి (దర్శి), ఎం.అశోక్‌రెడ్డి (గిద్దలూరు), కందుల నారాయణరెడ్డి (మార్కాపురం), గుదూరి ఎరిక్షన్‌బాబు (వైపాలెం)లు అధినేత చంద్రబాబు నుంచి బీఫాంలను అందుకున్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో చంద్రబాబు ప్రత్యేకంగా గ్రూపు ఫొటోలు దిగి వారిని మరింత ఉత్సాహపరిచారు. ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి గెలిచి తీరాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసిన ఆయన అందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా వివరించారు. ప్రత్యేకించి రాక్షసుడు వంటి జగన్‌తో జరుగుతున్న యుద్ధం, రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఎక్కడా లోటుపాట్లు లేకుండా వ్యవహరించాలని ఉద్బోధించారు.



బీఫాంలు అందుకున్న అనంతరం చంద్రబాబుతో బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్, ఆ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీల అభ్యర్థులు

నమ్ముకున్న వారిపైనే నిఘా..!

- టీడీపీలోకి వరుస చేరికలతో వైసీపీలో అంతర్మథనం
- డివిజన్‌లలో నేతల పనితీరుపై ఇన్‌చార్జిల నియామకం
- వారితో రోజువారీ నివేదికలు
- ఒంగోలులో పార్టీ కార్పొరేటర్లతో ముఖ్యనేత సమావేశం
- కొత్తవారిని తేలేరు.. ఉన్నవారిని ఆపలేరంటూ అసహనం
- మేయర్ డివిజన్‌పై రెడ్డి సామాజికవర్గానికి పెత్తనం
- నియోజకవర్గంలోని ఇతర చోట్లా ఇదే పరిస్థితి

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 21 : ఒంగోలు నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలస జోరు కొనసాగుతోంది. దీంతో అధికార పార్టీ నేతలు అంతర్మథనంలో పడ్డారు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి బలంగా ఉంటారనుకున్న పలువురు వైసీపీలో ఉండలేమంటూ తెగేసిచెప్తున్నారు. వివిధ కారణాలు చెప్పి టీడీపీలోకి క్యూకడుతున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు వైసీపీ ముఖ్యనేతలు సొంత పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇతర ముఖ్యుల కదలికలపై నిఘా ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆయా డివిజన్‌లు, మండల, గ్రామ స్థాయిలో ఇప్పటి వరకు పెత్తనం చేసిన వారిపైనే ఇన్‌చార్జిలుగా కొంతమందిని నియమించినట్లు తెలిసింది. నగర మేయర్ గంగాడ సుజాత ప్రాతినిధ్యం వహిస్తున్న చెరువుకొమ్ముపాలెం, వెంగముక్కలపాలెంలో డివిజన్ ఇన్‌చార్జి బాధ్యతలను కృష్ణారెడ్డి, అంజిరెడ్డిలకు అప్పగించారు. దీంతో కొద్దిరోజులుగా మేయర్ డివిజన్‌కు దూరమయ్యారు.

వలసలను ఆపలేరు... కొత్తవారిని తేలేరు

ఒంగోలు నియోజకవర్గంలో టీడీపీ బలం రోజురోజుకూ మరింత పెరుగుతోంది. వైసీపీ నుంచి తెలుగుదేశంలో చేరేవారితో అధికార పార్టీకి భారీ షాక్‌లు తగులుతున్నాయి. దీంతో వైసీపీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. ఈనేపథ్యంలో ఈనెల 17న వైసీపీ ముఖ్యనేత ఆపార్టీ కార్పొరేటర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..



'కార్పొరేషన్ ఎన్నికల సమయంలో మీ గెలుపు కోసం ప్రతిపక్షాల వారిని సైతం పలుకరించి వరీ కలుపుకుపోయారు. సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం దూరంగా ఉంటూ ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు?' అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. వైసీపీ నుంచి టీడీపీలోకి వెళుతున్న వారిని ఎందుకు ఆపలేకపోతున్నారు? టీడీపీ నుంచి వైసీపీలోకి కొత్తగా నాయకులను ఎందుకు తీసుకురాలేకపోతున్నారు? అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడగాలంటే అసలు అక్కడ ఏస్థాయిలో అభివృద్ధి పనులు జరిగాయో కూడా తెలియని పరిస్థితి ఉందని ఆయన అన్నట్లు తెలిసింది.

డివిజన్‌లపైఇన్‌చార్జిలకు పెత్తనం

ఎన్నికల్లో ఓటమి భయం వైసీపీని వెంటాడుతోంది. దీంతో గెలుపు కోసం ఆపార్టీ నాయకులు నానాఅగచాట్లు పడుతున్నారు. కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులపై అదనంగా ఇన్‌చార్జిలను నియమించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇన్‌చార్జిలు ప్రతిరోజూ డివిజన్‌లలో పర్యటించి కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుడి పనితీరుతోపాటు, లోటుపాట్లు, గెలుపు అవకాశాల గురించి నివేదిక అందించాల్సి ఉంది. ఈప్రక్రియ వారం రోజులుగా ఊపందుకొంది. పలు డివిజన్‌లలో అధికార పార్టీ కార్పొరేటర్లు, నేతల పనితీరుపై ప్రజల్లో విమర్శలు ఉన్నాయని ఇన్‌చార్జిలు నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో డివిజన్‌ల వారీ ఎదురవుతున్న సమస్యలు, ఇతరత్రా అంశాలపై ముఖ్యనేతలు సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే మేయర్ గంగాడ సుజాతను ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న 18వ డివిజన్‌కు దూరంగా ఉంచినట్లు సమాచారం. నమ్ముకున్న పార్టీ శ్రేణులపైనే నిఘా పెంచి అనుమానించడంపై కొందరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సమస్యపై కంట్రోల్ రూం

- కలెక్టరేట్‌లో ఏర్పాటు
- సెల్ నెంబరు 91001 21605 కేటాయింపు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 21 : జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఒంగోలు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దానికి సెల్ నెంబర్ 91001 21605 కేటాయించినట్లు తెలిపారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా ప్రజలు ఆ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడే పదోతరగతి ఫలితాలు

ఉదయం 11 గంటలకు విడుదల

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 21 : ఈఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు ప్రకటిస్తారు. గతనెల 30వతేదీతో పరీక్షలు ముగిశాయి. ఈనెల 1 నుంచి 8వతేదీ వరకు జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. అది ముగిసిన 14 రోజులకే ఫలితాలు ప్రకటిస్తున్నారు. ఇంత తక్కువ సమయంలోనే మొత్తం ప్రక్రియ పూర్తి చేసి ఫలితాలు విడుదల చేయడం ప్రభుత్వ పరీక్షల బోర్డు చరిత్రలో ఇదే ప్రథమం.

వైసీపీకి తాళ్లూరు ఎంపీపీ గుడ్‌బై



- విలువలు లేని పార్టీలో ఉండలేకే రాజీనామా
- టీడీపీలో చేరుతున్నట్లు వెల్లడి
- చంద్రబాబు బీసీలకు న్యాయం చేస్తారన్న నమ్మకం ఉందని ప్రకటన

తాళ్లూరు, ఏప్రిల్ 21 : తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేశారు. త్వరలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కూటమి దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి బంధువు కడియాల రమేష్‌తో కలిసి శ్రీనివాసరావు ఆదివారం తాళ్లూరులోని టీడీపీ కార్యాలయానికి వచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీసీలంటే వైసీపీకి గౌరవం లేదన్నారు. బడుగు, బలహీనవర్గాలకు వెన్నెముకగా ఉన్నామని సీఎం జగన్ చెబుతున్నా దర్శి నియోజవర్గ నాయకుల్లో అది ఎక్కడా కన్పించడం లేదని చెప్పారు. విలువలు లేని వైసీపీలో ఉండలేక ఆపార్టీని వీడుతున్నానని చెప్పారు. చంద్రబాబు బీసీలకు న్యాయం చేస్తారన్న నమ్మకంతో తాను త్వరలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. విలేకరుల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గుమ్మడి సాయి, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, షేక్ కాలేషావలి, షేక్ ఖాసింసైద్ తదితరులు పాల్గొన్నారు. వైసీపీకి చెందిన దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మద్దతుతో బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాసరావు ఎంపీపీ పదవిని దక్కించుకున్నారు. అప్పటి నుంచి మద్దిశెట్టికి ప్రధాన అనుచరునిగా కొనసాగుతున్నారు. వైసీపీ దర్శి అభ్యర్థిగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని నియమించిన నాటి నుంచి ఆపార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు గుడ్‌బై చెప్పారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బ్రహ్మంను పరామర్శిస్తున్న దామచర్ల, బీఎన్, కందుల

టీడీపీ దర్శి సమన్వయకర్త బ్రహ్మం చౌదరికి రోడ్డు ప్రమాదం

- తీవ్ర గాయాలు.. ఒంగోలు రిమ్స్‌కు తరలింపు

దర్శి ఏప్రిల్ 21 : టీడీపీ దర్శి నియోజకవర్గ సమన్వయకర్త నాదెండ్ల బ్రహ్మం చౌదరి శనివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన దర్శిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని కారులో తిరిగి విజయవాడ బయల్దేరారు. అద్దంకి- రేణంగివరం మధ్యలో ఎదురుగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఆయన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బ్రహ్మం చౌదరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఆయన్ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, దర్శి అసెంబ్లీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్ తదితరులు పరామర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఫోన్‌లో పరామర్శించారు.

24న ఒంగోలులో దామచర్ల నామినేషన్

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 21 : టీడీపీ కూటమి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఈనెల 24వతేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆరోజు ఉదయం 9గంటలకు ఆయన నగరంలోని మినీ స్టేడియం నుంచి భారీ ర్యాలీగా బయల్దేరి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఒంగోలు రూరల్, కొత్తపట్నం, నగర పరిధిలోని పార్టీశ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

తెలుగుదేశంలో చేరికల జోరు !



38వ డివిజన్‌లో దామచర్ల, విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



ఎంపీ మాగుంట, దామచర్ల, రియాజ్ సమక్షంలో పార్టీలో చేరిన త్రోవగుంటవాసులు

- నగరంలో వైసీపీకి వరుస షాక్‌లు..
- చేరికలతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 21: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసేందుకు పలువురు ముఖ్యులు ఆపార్టీని వీడి సైకిలెక్కుతున్నారు. ఇప్పటికే వైసీపీ నుంచి టీడీపీలోకి వరుస చేరికలతో ఆ పార్టీకి భారీ షాక్‌లు తగులుతుండగా, రోజురోజుకు చేరే వారి సంఖ్య వందలు దాటిపోతోంది. దీంతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తుండగా, పార్టీలో చేరికలతో పసుపు పండగ ముందే వచ్చినట్లు కనిపిస్తున్నది. గడిచిన కొద్ది రోజుల వరకు వైసీపీలో కీలకంగా వ్యవహరించిన పలువురు ప్రస్తుతం టీడీపీలో చేరారు. ఆదివారం నగరంలోని 38, 44 డివిజన్లకు చెందిన వైసీపీ నాయకులు, ముఖ్యులు టీడీపీ కూటమి ఒంగోలు, సంతనూతలపాడు అభ్యర్థులు దామచర్ల జనార్దన్, బీఎస్.విజయ్‌కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపి నుంచి టీడీపీలో చేరేవారితో పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత ఉంటుందని, తాము అన్ని వేళలా అండగా ఉంటామని చెప్పారు. ప్రగతి, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోరే పార్టీ తెలుగుదేశం అన్నారు. అందుకే అభివృద్ధి వైపు అందరి అడుగులు వేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమికి ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం బీఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ వ్యతిరేక విధానాలపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు వైసీపీలో కొనసాగిన సాయన అంజయ్య, చెన్నంశెట్టి రాంబాబు, జిల్లెలమూడి లక్ష్మీనారాయణ, వడ్డెళ్ళ అంజయ్య, మోతడిక హరికృష్ణ, సాయన బుజ్జి, సాయిన కోటయ్య, పొత్తూరి సాయి, తీగల శ్రీనివాసులుతోపాటు మరో 100మంది టీడీపీలో చేరారు. ఈసందర్భంగా బీఎస్, దామచర్ల జనార్దన్‌ను వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, పబ్బిశెట్టి శ్రీను, కందుకూరి బాబు, 38వ డివిజన్ అధ్యక్షులు పగడి రాములు, గుప్త, పల్లపోతు వెంకటేశ్వర్లు, 44వ డివిజన్ అధ్యక్షులు మాదాల కృష్ణమూర్తి, ఆవుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

త్రోవగుంటలో భారీగా టీడీపీలోకి..

వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరడం సంతోషంగా ఉందని టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, దామచర్ల జనార్దన్ ఎ. ఆదివారం నగర పరిధిలోని త్రోవగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమం పీడీసీసీబీ మాజీ చైర్మన్ కండే శ్రీనివాసరావు నేతృత్వంలో వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కండే వెంకట్రావు, బొచ్చు సూరిబాబు, కండే మురళీ, కండే అశోక్, కొట్టు ప్రభుదాస్‌తోపాటు మరో 50మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాగుంట, దామచర్ల వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో సైకో పాలనకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికలలో టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలని వారు కోరారు. రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, నావూరి కుమార్, శశికాంత్ భూషణ్, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

మండిన భానుడు!

ఎండ తీవ్రతతో తల్లడిల్లిన ప్రజానీకం

మార్కాపురంలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

అనేక మండలాల్లో 40 డిగ్రీలకు పైగానే..



ఒంగోలులో ఆకులను టోపీలా పెట్టుకున్న చిరువ్యాపారి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 21 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఎండ తీవ్రత మండిపోయింది. ఉదయం నుంచే ఎండ తీవ్రతతో ఉక్కపోతతో ప్రజానీకం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఒక వైపు ఎండ, మరో వైపు ఉక్కపోతతో ప్రజానీకం బయటకు రావాలంటే బయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వారం పది రోజుల నుంచి ఎండ తీవ్రంగా ఉండటంతో పాటు ఉక్కపోతతో ఇంటిలో కూడా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం ఉదయం 9గంటల నుంచే ఎండ అధికంగా ఉండటంతో ఒంగోలు నగరంలోని ప్రధాన రోడ్లతో పాటు ముఖ్య కూడళ్ళలో జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ఇక చిరు వ్యాపారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చెట్లకింద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. ప్రజానీకం ఎండ తీవ్రతతో దాహార్తిని తీర్చుకునేందుకు చల్లటిపానియాల కోసం పరుగులు తీశారు. కాగా జిల్లాలో అత్యధికంగా మార్కాపురంలో 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మర్రిపూడి 44.6, మద్దిపాడు 44.0, కనిగిరి 43.2, దొనకొండ 43.6, దర్శి 43.0, గిద్దలూరు 42.4, దోర్నాల 42.4, కొమరోలు 42.5, కొనకనమిటత్ల 42.3, ముండ్లమూరు 42.4, పెద్దారవీడు 42.4, పిసిపల్లి 42.9, పుల్లలచెరువు 42.9, వెలిగండ్ల 42.8, అర్ధవీడు 42.4, చీమకుర్తి 42.7, కంభం 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనేక మండలాల్లో 40 నుంచి 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా జిల్లా కేంద్రమైన ఒంగోలులో 38.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యాయి.

ప్రచార ప్రకటనలకు
అనుమతి తప్పనిసరి : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 21 : సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వారి ప్రచార ప్రకటనలకు తప్పని సరిగా మీడియా సర్టిఫికేషన్‌అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికలకు సంబంధించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే రాజకీయ ప్రకటనలను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందన్నారు. అనుమతి లేకుండా ఏదైనా రాజకీయ ప్రకటనలు ఇస్తే సంబంధిత అభ్యర్థులకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ద్వారా నోటీసులు ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా ఈదా

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 21 : కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజవర్గ అభ్యర్థిగా ఈదా సుధాకర్‌రెడ్డిని ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ.వేణుగోపాల్ 11మందితో ఓ జాబితా ప్రకటించారు. దానిలో 9మంది రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారు. ఈదా సుధాకర్‌రెడ్డి ప్రస్తుతం ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల్లో ఒంగోలు అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డిని నాయకులు అభినందించారు.

నేడు చీమకుర్తిలో షర్మిల పర్యటన



మాట్లాడుతున్న పాలపర్తి డేవిడ్‌రాజు, విజేష్‌రాజ్

చీమకుర్తి, ఏప్రిల్21 : రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల సోమవారం సాయంత్రం చీమకుర్తి పట్టణంలో పర్యటించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు, ఆయన తనయుడు సంతనూతలపాడు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి విజేష్‌రాజ్ ఆదివారం చీమకుర్తిలో జరిగిన ప్రెస్‌మీట్‌లో తెలిపారు. స్థానిక బస్టాండ్‌సెంటర్‌లో సోమవారం సాయంత్రం జరిగే భారీ బహిరంగసభలో అధ్యక్షురాలు షర్మిల పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా జరిగే సభను వైఎస్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల సుబ్బారావు, వేపూరి వెంకటేశ్వర్లు, మద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా షర్మిల చీమకుర్తి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ట్రాఫిక్ మళ్లింపును చేపట్టారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

పీసీపల్లి, ఏప్రిల్ 21: అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో తమ్ముడు గాయపడ్డ సంఘటన మండలంలోని లక్ష్మక్కపల్లిలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు మాలకొండయ్య, మాల్యాద్రిలు అన్నదమ్ములు. వీరిమధ్య కొద్దిరోజులుగా భూమిలో పైపులు వేసుకునే విషయమై వివాదం ఉంది. ఆదివారం పైపులు వేసే సమయంలో ఇద్దరూ ఘర్షణపడి దాడి చేసుకున్నారు. దీంతో మాల్యాద్రి తీవ్రంగా గాయపడగా చికిత్సకోసం వైద్యశాలకు తరలించారు. వీరిరువురి దాడిపై పీసీపల్లి పోలీసులను వివరాలు అడగగా.. తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఎన్నికల్లో సైకో పాలనకు గుణపాఠం చెప్పాలి

- టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల
- 12వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



ఓటర్లకు నమస్కరిస్తున్న దామచర్ల జనార్దన్, రియాజ్

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 21: వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురి చేసిన సైకో పాలనకు తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపు కాంక్షిస్తూ ఆదివారం ఒంగోలు నగరంలోని 12వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మిరాయాలపాలెం సెంటర్ నుంచి ఆశా సప్లయ్ కంపెనీ వరకు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. గత టీడీపీ హయాంలో ఒంగోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై దామచర్లకు హారతులతో స్వాగతం పలికారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని నినదించారు. కార్యక్రమంలో షేక్ కపిల్‌బాషా, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ నంబూరి శ్రీనివాసరావు, నండూరి చంద్ర, కాకా శ్రీను పాల్గొన్నారు.

జనసైనికులకు అన్నివేళలా కాపుకాస్తా..!

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎస్ • పేర్నమిట్టలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



సభలో ప్రసంగిస్తున్న విజయ్‌కుమార్



కూటమి మద్దతుదారులతో బీఎస్, కందుకూరి బాబు

చీమకుర్తి, ఏప్రిల్ 21 : జనసేన పార్టీ కార్యకర్తలకు అన్నివేళలా అండగా నిలుస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయి జనసేన పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం సాయంత్రం ఆనందోత్సాహల మధ్య పేర్నమిట్టలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బీఎస్ గ్రామంలో ఓపెన్‌టాప్ జీప్‌లో జనసైనికులు, టీడీపీ శ్రేణులతో కలిసి ర్యాలీగా తిరిగారు. తదుపరి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కందుకూరి బాబు అధ్యక్షతన జరిగిన సభలో విజయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రుద్రయ్య, రమేష్, శ్యాంశెట్టి మోహన్, ఫణీంద్ర, నున్న బాలు, పల్లపు శివప్రసాద్, ధనుష్, కోటేశ్వరరావు, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, వివరం గోవిందు, కరిచేటి శ్రీనివాసరావు, శివకృష్ణ, శ్రీనివాసరావు, వాసు, పవన్, శ్రీమన్నారాయణ, కృష్ణ, మధురాముడు సుమతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

- తెలుగుదేశం నేత అనిల్



అమ్మనబ్రోలులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అనిల్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 21: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందుతారని ఆ పార్టీ నేత, సంతనూతలపాడు టీడీపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ సోదరుడు అనిల్ పేర్కొన్నారు. ఆదివారం అమ్మనబ్రోలులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీఎస్.విజయ్‌కుమార్ అందరివాడన్నారు. నియోజకవర్గంతో బీఎస్‌కు విడదీయలేని అనుబంధం ఉందని, ఆయను ఎమ్మెల్యేగా చేసుకుందామని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అలాంటి మంచి మనిషిని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. అనంతరం ఈదుముడి ఎస్సీ కాలనీ వాసులతో అనిల్ ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం హయాంలోనే ఎస్సీల అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, నాయకులు ఈదర వెంకటకృష్ణారావు, వలేటి పాండురంగారావు, మహమ్మద్‌బేగ్, ఇస్మాయేల్‌బేగ్, స్వర్ణ కిషోర్, మెట్టు సుబ్బయ్యనాయుడు, తేళ్ల ఏలియా, కొమ్మూరి యాకోబు, కొమ్మూరి అనిల్, కొమ్మూరి సైమన్, చీలి కోటేశ్వరావు, చీలి పారస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాగా కండ్లగుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పాలపర్తి తిమోతి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అనిల్, తేళ్ళ మనోజ్‌కుమార్ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మున్నంగి పన్నారెడ్డి, పాలపర్తి ఆనంద్, కొమ్ము క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తిగీతాలను ఆలపిస్తున్న గాయకులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 21: ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్నచెన్నకేశవ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన భక్తి సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు మాగంటి మూర్తి ఆధ్వర్యంలో గాయకులు పలు అన్నమాచార్య కీర్తనలతో పాటు తెలుగు చిత్రాలలోని భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో గాయకులు ఐ.మురళీకృష్ణ, మొవ్వా నాగేశ్వరరావు, కనకారావు, పబ్బిశెట్టి రంగనాథం, డి.ఉషారాణి, నెల్లూరుకు చెందిన పి.శ్రావ్య, వింజమూరు పి.సుమతి, కందుకూరుకు చెందిన డి.భవానీ పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీకుమారి కళాకారులను ఘనంగా సత్కరించారు. ఇక నళినీప్రియ కూచిపూడి అకాడమీ చిన్నారుల నృత్యాలు సైతం కనువిందు చేశాయి. అదేవిధంగా బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం స్వామివారికి కుంభారాధన, హనుమంతవాహన సేవ నిర్వహించారు.

అవీ..ఇవీ..

టీచర్ల డిప్యుటేషన్ ఉత్తర్వులు రద్దు : డీఈవో

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 21: జిల్లాలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు, పని సర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి డిసుభద్ర ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు తమ పరిధిలో డిప్యుటేషన్లు, పని సర్దుబాటుతో పనిచేస్తున్న వారి ఉత్తర్వులను రద్దు చేసి వారిని వారి మాతృ పాఠశాలలకు పంపించాలని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం చివరి పనిదినమైన ఈనెల 23న వారందరూ జీతాలు డ్రా చేస్తున్న పాఠశాలల్లో చేరాలన్నారు. వీరందరూ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న పాఠశాలల నుంచి సోమవారం సాయంత్రం రిలీవ్ అయ్యి మంగళవారం తమ మాతృపాఠశాలల్లో చేరాలి. చివరి పనిదినం నాడు తమ మాతృపాఠశాలల్లో హాజరు నమోదు చేయాలని డీఈవో స్పష్టం చేశారు.

నేటి నుంచి రెండో సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 21: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధిలోని ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 88 డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు యూనివర్శిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి బి.పద్మజ ఆదవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా మొత్తం 39 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు 48 మంది పరిశీలకులను నియమించారు. పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు ప్రత్యేకంగా రెండు తనిఖీ బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా, సక్రమంగా నిర్వహించేందుకు కళాశాలల ప్రధానాచార్యులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, యజమాన్యాలు సహకరించాలని పద్మజ కోరారు.

బుచ్చయ్య సేవలు ఆదర్శనీయం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 21: పోరాటయోధుడు, ఆదర్శ కమ్యూనిస్టు, సీపీఐ (ఎంఎల్)న్యూడె మోక్రసి నేత తొండెపు బుచ్చయ్య సేవలు ఆదర్శనీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక మాదాల నారాయణస్వామిభవన్‌లో ఆదివారం బుచ్చయ్య మూడో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.రాజశేఖర్, సిసింద్రీబాబు, చొప్పర జాలన్న, నాగరాజు, పద్మ, మహేశ్వరి, అమ్మాజి, రంగారావు, నారాయణ, నాతాని హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రలోభాల నివారణపై దృష్టి సారించండి : జేసీ

మద్దిపాడు, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల నామినేషన్లు మొదలైన నేపథ్యంలో ఎన్నికల ర్యాలీ, ప్రచారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. ఆదివారం మద్దిపాడులో మండల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ స్టాటికల్ సర్వైలెన్స్ బృందాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అభ్యర్థుల నామినేషన్ దాఖలు సమయంలో ర్యాలీలను వీడియో తీయాలన్నారు. ఎక్సైజ్, పోలీస్‌శాఖలు సమన్వయంతో పనిచేసి మద్యం, నగదు నిల్వలను గుర్తించి సీజ్ చేయాలని సూచించారు. ఓటర్లు ప్రలోభాలకు గురిచేసే విధంగా వివిధ వస్తువుల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. రాత్రి వేళలో కూడా తనిఖీలు ముమ్మరం చేయాలని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా నిరంతరం కొనసాగేలా చూడాలని ఆదేశించారు.

రైజ్‌లో సివిల్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



వేడుకలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 21: ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ప్రకాశంగ్రూపు విద్యాసంస్థల్లో సివిల్ ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎన్నో అద్భుత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విభాగాధిపతి కె.మల్లికార్జునరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మహిళా కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 21: ఒంగోలులోని దిశా పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ వరలక్ష్మి తన అన్నను వేధింపులకు గురిచేస్తోందని ఆమె ఆడపడుచు నవీన ఆరోపించారు. ఆదివారం స్థానిక ఎంసీఏ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నవీన మాట్లాడుతూ కారుమంచి గ్రామనికి చెందిన తన అన్న ప్రవీణ్‌కుమార్, వరలక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని తెలిపారు. అనంతరం ఆయన కష్టంతో చదువుకున్న వరలక్ష్మికి కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చిందని, అయితే ఉద్యోగం వచ్చిన తరువాత తన అన్నను లెక్క చేయకుండా వేధింపులకు గురి చేస్తోందని ఆరోపించారు. గత నెల 21న ప్రవీణ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడితే కనీసం వరలక్ష్మి చూడటానికి కూడా రాలేదన్నారు. అయితే అది ప్రమాదం కాదని, కొట్టిన గాయాలు ఉన్నాయని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. అంతేగాకుండా తాను కానిస్టేబుల్ అని, పోలీసుల అంతా తన పక్షమేనని బెదిరింపులకు పాల్పడుతోందని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో ప్రవీణ్‌కుమార్ తల్లి అరుణ, కుమార్తె నిత్యశ్రీ పాల్గొన్నారు.

నరసం ఆధ్వర్యంలో 'తెలుగుబడి'

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 21: చిన్నారులకు తెలుగు భాషను స్పష్టంగా నేర్పించేందుకు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో తెలుగుబడి కార్యక్రమాన్ని రూపొందించినట్లు రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాయటం, పలకటంలో ఉచ్చారణ దోషాలు లేకుండా మాతృభాషను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో 30 రోజుల ప్రత్యేక శిక్షణగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. దాదాపు మూడు దశాబ్దాల ఉపాధ్యాయ అనుభవం కలిగిన ప్రముఖ రచయిత్రి, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని నరసం కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణనిస్తారని అరుణ తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు 9866014619 నెంబరులో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 12 : మనఊరు-మన ఈదుముడి సేవా సంస్థ వ్యవస్థాపకులు కావూరి వాసు ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ మల్టీస్పెషాలిటీ సహకారంతో ఆదివారం ఈదుముడిలో నిర్వహించి న వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 127 మందికి పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ధీరజ్, పల్లవ్, సంస్థ సభ్యులు మేడా బ్రమ్మయ్య, ఉప్పల వెంకట్రామయ్య, ప్రసాదు, కుర్రా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'వసంతకోకిల గానం'

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 21: ఉపాధ్యాయుడు, ప్రముఖ గాయకుడు డి.వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి 12 గంటల పాటు నిర్విరామంగా కొనసాగిన వసంతకోకిల గానం మెగా ఈవెంట్ అత్యంత ఘనంగా సాగింది. స్థానిక శాంకరీ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 40 మంది గాయకులు తమ గానమాధుర్యంతో అలరించారు. గాయినీ రోజాలక్ష్మి వ్యాఖ్యానంతో కొనసాగిన కార్యక్రమంలో చిన్నారి తేజస్వి ఆలపించిన విధానం ప్రేక్షకుల కరతాళధ్వనులను అందుకుంది. వివిధ ప్రాంతాలకు చెందిన గాయకులు వి.వి.రమణారావు, లక్ష్మణరావు, గుమ్మడి శ్రీను, మోహన్ కృష్ణ, కనిగిరి రామయ్య, పి.హరిబాబు, చంద్ర, భారతి, స్వర్ణలత, సుహాసిని, దయామణి, అంజుస్వామి, చాందినీ తదితరులు తమ పాటలతో అలరించారు. అనంతరం గాయకులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



నిర్మానుష్యంగా మారిన టంగుటూరు రోడ్డు

మండుటెండలతో నిర్మానుష్యం

కొండపి, ఏప్రిల్21: భానుడి ప్రతాపం గడచిన పక్షం రోజులుగా ఏరోజుకారోజు చండప్రచండంగా మారుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పగటి వేళల్లో పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి లేదు. ఉదయం పది గంటల నుంచి రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆదివారం నామినేషన్లకు కూడా విరామం కావడంతో టంగుటూరు రోడ్డులో జనసంచారం పూర్తిగా కనుమరుగైంది. కొండపిలోని టంగుటూరు రోడ్డులోని ప్రధాన రోడ్డులో మధ్యాహ్నం రోడ్డుపై ఒక్కరు కూడా కనిపించలేదు. సాయంత్రం 5 గంటల వరకు ఎండతీవ్రత తగ్గడం లేదు. ఏప్రిల్ నెలలోనే ఇలా ఉంటే ముందు,ముందు ఎండ తీవ్రత ఎలాఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ఉపాధి పనిలో ఉన్న మైనర్ పిల్లలు (వృత్తంలో)

ఉపాధి పనుల్లో మైనర్లు

పొన్నలూరు (కొండపి), ఏప్రిల్21: ఎన్నికల హడావుడి వేళ పొన్నలూరు మండలంలో ఉపాధి పనులు సందట్లో సడేమియాగా సాగిపోతున్నాయి. ఇప్పటికీ వ్యవసాయ పనులు ముమ్మరంగా గ్రామాల్లో సాగుతున్నాయి. ప్రధానంగా పొగాకు ఎండాకుకి ఈ ఏడాది డిమాండ్ ఉండటంతో పనిచేయగలిగిన మధ్యవయస్కులు ఎండాకు ఏరుకోవడానికి వెళుతున్నారు. అయితే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉన్నతాధికారులు ఉపాధి పనులు మొదలు పెట్టాలని మండల స్థాయి అధికారులను, క్షేత్ర స్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెడుతుండటంతో వారు ఎలాగోలా పనులు కానిచ్చేస్తున్నారు. పెద్దలకు బదులుగా మైనర్లు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. మండల కేంద్రమైన పొన్నలూరు ఉపాధి పనిలో శనివారంనాడు మైనర్లు పాల్గొన్న దృశ్యాలివి. వీరితోపాటు వయసు పైబడిన వారు కూడా ఉపాధి పనిలో కనిపిస్తున్నారు. మస్టర్లు వేసేస్తున్నారు.

నేడు దేవాలయ పునఃప్రతిష్ఠ

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 21 : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో సోమవారం శ్రీ గంగా పార్వతీ సమేత భోగ మల్లేశ్వర స్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 18వ తేదీ నుంచి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, వ్రతాలు, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం పునఃప్రతిష్ఠ కార్యక్రమం ముగిసిన తర్వాత భారీగా అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు వి శేషంగా తరలిరావాలని వారు కోరారు.

నవ్యాంధ్ర పునర్నిర్మాణం చంద్రబాబుకే సాధ్యం

కూచిపూడి ప్రచారంలో ఎమ్మెల్యే స్వామి



కూచిపూడిలో కదం తొక్కిన టీడీపీ శ్రేణులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి స్వామి

మర్రిపూడి, ఏప్రిల్ 21 : నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడికే సాధ్యమని కొండపి శాసన సభ్యులు, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా కూచిపూడిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైయిందని విమర్శించారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ దేశ చరిత్రలో నిలిపిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. వైసీపీ అరాచక పాలనతో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని చెప్పారు. దీంతో పల్లెసీమల్లో ప్రజలు వలసబాట పట్టడంతో కళావిహీనంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పనుల కోసం బెంగళూరు, హైదరాబాదు వంటి నగరాలకు ప్రజలు వలస బాట పట్టారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పుడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా ప్రతిష్ఠాత్మకమైన పరిశ్రమలు సహితం రాష్ట్రం నుంచి తరలిపోవాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరుస్తామని హామి ఇచ్చారు. ఉపాధి అవకాశాలు కల్పించే వరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించనున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు నెలకు రూ.6000 పించను ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యంగా మారిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో టంగుటూరు, పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారి అభివృద్ధికి రూ.39 కోట్ల నిధులు మంజూరు చేయిస్తే పనులు చేపట్టలేని అసమసర్థ ప్రభుత్వమని మండిపడ్డారు. కూచిపూడి- గార్లపేట రహదారి నిర్మాణానికి రూ. 7 కోట్ల నిధులు మంజూరు అయినప్పటికి గత ఐదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. ఒకసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలుపుతానని మంత్రి సురేష్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకున్న మంత్రి కొండపి నియోజకవర్గంలో ఏదో సాధిస్తానని చెప్పడం అవివేకం అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామికి మహిళలు, టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. మేళతాళాలతో, బాణసంచా కాలుస్తూ పూల వర్షం కురిపించారు. టీడీపీ శ్రేణులు ప్రచార పర్వంలో జెండాలు చేబూని కదం తొక్కారు. అనంతరం చెంచు రెడ్డి పల్లెల్లో ఓటర్లను కలుసుకొని శాసన సభ్యులుగా తనతో పాటు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, టీడీపీ సమన్వయ కర్త రేగుల వీరనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహారావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు హనుమారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఎర్రంరెడ్డి వెంకటరెడ్డి, చిలకల కొండారెడ్డి, కర్నాటి రమణారెడ్డి, భూమిరెడ్డి రమణారెడ్డి, గూడలి గౌరీశంకర శర్మ, చిరుపల్లి నరసింహం, మందా ఆనంద్, అంకమరావు, గడ్డం చిన్నయ్య, కొండలరావు, కే మోహన్‌రావు, ఎం. ఏడుకొండలు, బూదాల యేసుదాస్, గురుబ్రహ్మం పాల్గొన్నారు.

మహిళాభ్యుదయం టీడీపీకే సాధ్యం

● టంగుటూరులో మహిళలు ఇంటింటి ప్రచారం



టంగుటూరులో ఇంటింటికీ తెలుగుదేశం శంఖారావంలో మహిళలు

టంగుటూరు, ఏప్రిల్ 21 : మహిళాభ్యుదయం తెలుగుదేశం పార్టీకే సాధ్యమని టంగుటూరులో ఆదివారం జరిగిన ఇంటింటికీ తెలుగుదేశం శంఖారావంలో పలువురు టీడీపీ నాయకులు అన్నారు. వీరంతా ఇంటింటికీ తిరుగుతూ వైసీపీ ప్రభుత్వ వెనుకబాటును ప్రజలకు వివరించారు. దేశంలోనే మహిళలను గుర్తించిన రాజకీయ పార్టీ తెలుగుదేశమని, వంటింటికే పరిమితమైన మహిళలను పురుషులతో సమాన స్థాయికి తీసుకొచ్చింది టీడీపీయేనని అన్నారు. డ్వాక్రా సంఘాలను పెట్టి వారికి ఆర్థికంగా చేయూతనందించి వారంతా నేడు కుటుంబ బాధ్యతలను స్వీకరించే స్థాయికి ఎదిగారని చెప్పారు. నేడు డ్వాక్రా సంఘాల ఆధారంగా బ్యాంకు రుణాలు అందుకొని చిరువ్యాపారులుగా ఎదుగుతూ మహిళలు లక్షాధికారులు అయ్యారని, నేడు వారు స్వతంత్రంగా జీవించే స్థాయికి ఎదిగారని అన్నారు. మహిళలకు ప్రత్యేక హక్కులు కల్పించి వారికి కుటుంబంలో పురుషులతో సమానంగా ఆస్తిహక్కు కల్పించింది టీడీపీయేనన్నారు.

బ్యాంకులు సైతం డ్వాక్రా సంఘాలకు రుణాల కల్పనలో ఉదారంగా వ్యవహరిస్తున్నారని, రుణాలు సక్రమంగా చెల్లించే లబ్ధిదారులకు తిరిగి రుణాలు కల్పిస్తున్నారని వివరించారు. మహిళల ఉన్నతికి తిరిగి టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వారన్నారు. అందుకు వీలుగా కొండపి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓట్లేసి అధిక మెజార్టీతో గెలిపించాలని వారంతా కోరారు.

ఈకార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల మండల అధ్యక్షులు కామని విజయకుమార్, రాంబాబు, బెల్లం కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నేత బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు తోకల భారతి, ఉన్నం వెంకటేశ్వర్లు(పెద్దోడు) యజమాని, జక్కుల శ్రీను, భానుచందర్, దయానందం, మొలకలపల్లి శ్రీనివాసరావు, కుందేటి వెంకట్రావు పాల్గొన్నారు.

సైకిలెక్కిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లా

- ఆయనతోపాటు నాగులపాలెంలో పలువురి చేరిక
- ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి
- అరాచక పాలనకు ఇక ముగింపు
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సాంబశివరావు



సుభాష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 21: పర్చూరు తొలి ఎమ్మెల్యే కొల్లా రామయ్య తనయుడు జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లా సుభాష్ సైకిల్ ఎక్కారు. ఏలూరి క్యాంపు కార్యాలయంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలోకి చేరారు. సుభాష్‌కు ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సుభాష్‌తోపాటు గ్రామానికి పలువురు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర పరిస్థితి గాడిన పడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కలసి కట్టుగా పనిచేసి అరాచక వైసీపీని ఇంటికి సాగనంపాలని ఏలూరి వారికి పిలుపునిచ్చారు. అలాగే పర్చూరు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన వైసీపీ శ్రేణులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

నాగులపాలెంలో..

కొల్లా సుభాష్‌తోపాటు, పలువురు పర్చూరు మండలానికి చెందిన వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వారిలో వైదన ఆదినారాయణ, పోట్రు వెంకటనారాయణ, షేక్ షుకూర్, మహ్మద్ ఫయాజ్, దాసరి శివనారాయణ, దాసరి ప్రశాంత్, కాల్వ హరిబాబు, దామచర్ల లింగేశ్వరరావు, పులిపాటి ఎలీషా, యాటగిరి శ్రీనివాసరావు, రావూరి నాగరాజు, రావూరి ఏడుకొండలు, పఠాన్ కాలేషా, జయంపూర్ రామయ్య, దామచర్ల నాగరాజు, అమ్మా తిరుపతయ్య ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దూళిపల్లి వెంకటస్వామి, కొల్లా శ్రీనివాసరావు(ఫ్యాక్టరీ) ఉన్నారు.

వలపర్ల ద్వారకాపాడులో..

మార్టూరు మండలం వలపలర్ల ద్వారకాపాడుకు చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిలో దేవకొండ రామాంజనేయులు, దేవరకొండ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, దేవరకొండ ఏడుకొండలు, అంజయ్య కార్తీక్, సూర్యనారాయణ, పాలపర్తి తిరుపతయ్య, పాలపర్తి సుబ్బారావు, దుర్గ, గోవింద్, ఆదినారాయణ, అంజయ్య, వెంకట్రావు, వనపర్తి వెంకట కోటేశ్వరరావు ఉన్నారు.

మార్టూరులో..

మార్టూరు నుంచి వల్లెపు శ్రీనివాసరావు, ఉప్పు అంకమ్మ, పల్లపు సాంబశివరావు, పల్లపు వెంకటేశ్వర్లు, రామిశెట్టి ఆంజనేయులు, వేముల అంజనేయులు, వేముల రమేష్, తన్నీరు సాంబశివరావు, డేరంగుల వెంకట్రావు, గుంజి కొండలు, చిన్నకుర్రే మణికుమార్, కుంచాల పున్నారావు, కోపూరు అంకమ్మరావు, ధర్మవరపు గురవయ్య, కొప్పూరి కృష్ణారావు, కొప్పూరి లక్ష్మణ్, చిన్నకర్రి మోషే, డేరంగుల నాగేశ్వరరావు, వల్లపు బంగారు బాబు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

గంగవరంలో..

ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. వారిలో వలేరు వెంకటేశ్వర్లు, కవల జెమేష్, కవల కృష్ణ, బొనిగల చిట్టిబాబు, నూకతోటి వేణుబాబు, కొమరబత్తిన మరియమ్మ, కొమరబత్తిన శ్రీనివాసరావు, నూకతోటి ప్రసంగరావు, నూకతోటి నాగేశ్వరరావు, ఏసుదాసు, శ్యాంబాబు, కంచర్ల కాలేబు, ప్రభుదాసు, చావా గోపి, గంగవరపు పోలీష్ ఉన్నారు.

టీడీపీలో చేరిన గంగవరం ఎస్సీలు

ఇంకొల్లు : ఇంకొల్లు మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన ఎస్సీలు ఆదివారం టీడీపీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు ఆధ్వర్యంలో ఏలూరి సాంబశివరావు సమక్షంలో చేరగా వారికి కండువాలు వేసి ఏలూరి ఆహ్వానించారు. వలేరు వెంకటేశ్వర్లు, కొణిగల చిట్టిబాబు, నూకతోటి ప్రసంగిరావు, వేణు, నాగేశ్వరరావు, ఏసుదాసు, చావా గోపీ, కవల కృష్ణ, కంచర్ల కాలేబు, ప్రభుదాసు, కవల జేమ్స్, లుధియా, శ్రీనివాసరావు, శ్యాంబాబు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కరి వీరాంజనేయులు, వీరగంధం ఆంజనేయులు, నాగేంద్రమ్మ, మాజీ సర్పంచ్ ఆడె విజయలక్ష్మి, భవనం విద్యాసాగర్‌రెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

టీడీలో చేరిన సొసైటీ అధ్యక్షుడు పోపూరి

సైకిల్ ఎక్కిన వలపర్ల, జాగర్లమూడి, మార్టూరు, బొల్లాపల్లి వాసులు



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సొసైటీ అధ్యక్షుడు పోపూరి

పర్చూరు, ఏప్రిల్ 21: తెలుగుదేశం పార్టీలోకి వలసల జోరు కొనసాగుతూనే ఉంది. యద్దనపూడి మండలం పెద్ద జాగర్లమూడి, మార్టూరు, మండలం వలపర్ల, బొల్లాపల్లి, మార్టూరు హనుమంతురావు కాలనీకి చెందిన పలు కుటుంబాలు ఏలూరి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. బొల్లాపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నేత, సొసైటీ అధ్యక్షుడు పోపూరి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో పలువురు సైకిల్ ఎక్కారు. వారిలో వల్లపు సుబ్బారావు, రామాంజనేయులు, గోరంట్ల వెంకట్రావు, వల్లపు అంకారావు, వల్లపు అంకమ్మరావు, గోగులపాటి శ్రీనివాసరావు, కోపూరు వెంకట్రావు తదితరులు ఉన్నారు. అలాగే వలపర్లలో వైసీపీకి పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారిలో బూరగ శ్యామ్ కుమార్, పులిపాటి ధరమంత్రి, బూరుగ రవీంద్ర, బూరుగ లీలాంబరం, చిన్న యోహాను, అజయ్, మూకిరి ఆదాం, సునీల్ తదితరులు ఉన్నారు. పెద్ద జాగర్లమూడికి చెందిన షేక్ మస్తాన్‌వలి, షేక్ అన్వర్, షేక్ హజరాబి, షేక్ చిన్న నాగూర్, పెద్ద నాగూర్, షేక్.చీరాల బాజీ, సలాం, షేక్.మషుకూర్ అలీ, షేక్.గౌస్, బాజీ తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మార్టూరు హనుమంతురావు కాలనీకి చెందిన షేక్ రహిమాన్ ఆధ్వర్యంలో గుంటూరు లక్ష్మీ, సువర్ణకుమారి, షేక్.మస్తాన్, బి.శివనాగమల్లేశ్వరి కుమారి, బీ అత్తర్, రాజమ్మ, సుబ్బాయమ్మ, ధనలక్ష్మి, షేక్.జిలానీ, సు బ్బారావు, అంజనాదేవి, అమీనా టీడీపీలో చేరారు. చేరినవారందరికీ ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా కూటమి అభ్యర్థుల విజయానికి శ్రమించాలని కోరారు.

వచ్చేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం

సంతమాగులూరు, ఏప్రిల్ 2 : మరో 40 రోజుల్లో విముక్తి కలిగి మరో 40 రోజులలో టీడీపీ- జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరుగుతుందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ తెలిపారు. సంతమాగులూరు మండలం మిన్నెకల్లు గ్రామంలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని, ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటున్నారని, అహంకారం ఉన్న వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాడు. జగన్ రెడ్డి అహంకారమే అతని రాజకీయ అంతానికి దారి తీసే పరిస్థితి నెలకొందన్నారు.



మాజీ ఎమ్మెల్యే పోతులతో చర్చిస్తున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

పోతులతో వేమిరెడ్డి భేటీ

టంగుటూరు, ఏప్రిల్ 21 : తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆదివారం కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుతో భేటీ అయ్యారు. ఉదయం పోతుల గృహానికి వచ్చిన వేమిరెడ్డికి పోతుల ఎదురేగి బొకే అందించి ఘనస్వాగతం పలికారు. వేమిరెడ్డి రాగానే పోతుల తన అనుచరులను పరిచయం చేశారు. వెంటనే వారిరువురు ప్రత్యేక గదిలోకి వెళ్లారు. సుమారు అరగంట పాటు ఏకాంతంగా మాట్లాడుకున్నారు. కందుకూరు అసెంబ్లీ ఎన్నికల విషయమై వీరు చర్చించి ఉండవచ్చని అంతా భావిస్తున్నారు. టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు సంపూర్ణ మద్దతు తెలపాలని వేమిరెడ్డి పోతులను కోరినట్లు తెలిసింది. వేమిరెడ్డితో నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ కూడా ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, టీడీపీ నాయకులు కసుకుర్తి శ్రీధర్, పమిడి తులసీరావు, రావూరి సతీష్, పత్తిపాటి బ్రహ్మానందం, కామినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.



కందులూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

కందులూరులో 'బాబు' జన్మదిన వేడుకలు

టంగుటూరు, ఏప్రిల్ 21 : మండలంలోని కందులూరులో శనివారం రాత్రి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచారు. ఈసందర్భంగా స్థానిక టీడీపీ నాయకుడు దామచర్ల బసవయ్య మాట్లాడుతూ చంద్రబాబు ప్రజల మనిషి అన్నారు. 46 ఏళ్ల సుదీర్ఘ రాజకీయచరిత్రలో మచ్చలేని మహానేతని, జనం గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన మహనీయుడన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమని, ఐదేళ్ల జగన్ రెడ్డిపాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే రాజధాని లేని రాష్ట్రంగా ఉండటం అత్యంత దారుణ సంఘటనన్నారు. అందుకే చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మన పై ఉందని, ఇందుకు అనుకూలంగా తెలుగుదేశం పార్టీ నుంచిపోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓట్లేసి అధిక మెజార్టీతో గెలిపించాలని బసవయ్య కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వేంపాడులో నాయకులతో చర్చిస్తున్న టీడీపీ నాయకులు

స్వామి ప్రచారానికి సన్నాహాలు

పొన్నలూరు (కొండపి), ఏప్రిల్21: కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఎన్నికల ప్రచారం 24,25 తేదీల్లో పొన్నలూరు మండలంలోని గ్రామాల్లో నిర్వహించనున్న నేపథ్యంలో నాయకులు ఆయా గ్రామాల్లో ముందస్తుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై గ్రామాల్లో సమావేశాలు ఆదివారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం, బైకు ర్యాలీలకు కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా వేంపాడు, వెల్లటూరు, సింగరబొట్లపాలెం గ్రామాల్లో నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, సీనియర్ నాయకులు కర్ణా కోటిరెడ్డి, మండవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ పూర్ణచంద్‌ను సన్మానిస్తున్న శ్రీరామమూర్తి దంపతులు

ప్రాచీన కావ్యాలను కాపాడాల్సిన బాధ్యత రచయితలదే

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 : ప్రాచీన కావ్యాలను పునర్ మూల్యాంకనం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందని పురస్కార గ్రహీత, డాక్టర్ జీవీ పూర్ణచందు అన్నారు. ఆదివారం స్థానిక మారంవారి సేవా సదన్‌లో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కార సభ డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పూర్ణచందు మాట్లాడుతూ పంచతంత్రం కథలు రాసిన చిన్నయ సూరి అచ్చ తెనుగు పదాలను తన గ్రంథాలలో విరివిగా వాడారని, వాటి అర్థాలు తెలియక చాలా మంది ఆయన్ని అపార్థం చేసుకున్నారన్నారు. అందుకోసమే నేను ఆయన పదకోశం కోసం పరిశోధన చేస్తున్నానని తెలిపారు. అన్నమయ్య తన కావ్యాలలో అచ్చతెలుగు పదాలలలో ఆనాటి ఆహార ప్రదార్థాలను చొప్పించారన్నారు. మంచి కవి కావాలంటే మంచి గురువు, మంచి పుస్తకాలు వరంగా లభించాలన్నారు. వాటిని విస్తృతంగా చదివి, రాసి, వాటిలో అవసరమైన పదాలను జల్లెడపట్టి వేరుచేసి నాణ్యమైన కవిత్వాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా మిత్రమండలి సభ్యులు పలువురు పూర్ణచందు రచించిన పుస్తకాలను సభకు పరిచయం చేశారు. అనంతరం పూర్ణచందుకు పురస్కారాన్ని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజాలు అందజేయగా మిత్రమండలి సభ్యులు ఆయన ఘనంగా సత్కరించారు.

జాడలేని జాళ్లవాగు


ఆక్రమించిన భూబకాసురులు
పట్టించుకోని అధికారులు



జాళ్లవాగును ఆక్రమించి పొలాల్లో కలిపేసుకున్న దృశ్యం

మర్రిపూడి, ఏప్రిల్ 21 : ఎన్నికలు తరుముకొస్తున్న తరుణంలో భూబకాసురులు రెచ్చిపోతున్నారు. అధికారులందరు ఎన్నికల విధులలో ఉన్న నేపథ్యంలో ఇదే అదునుగా వాగులువంకలను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. వారి కబంధహస్తాలలో మండలంలోని ప్రతిష్ఠాత్మకమైన జాళ్లవాగు చిక్కి చిన్నబోయింది. టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే రూ.కోట్ల విలువ చేసే వాగు ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. పొదిలి, మర్రిపూడి మండలాల మధ్య ప్రసిద్ధమైన జాళ్లవాగు మండలంలోని కెల్లంపల్లి, పన్నూరు చెరువులకు ప్రధాన నీటి వనరులుగా పేరుగాంచింది. 50 మీటర్లకుపైగా వెడల్పు ఉండే జాళ్లవాగు నేడు కేవలం 2మీటర్లకే పరిమితమైయింది. సమీపంలో రైల్వేలైన్ ఏర్పాటు కావడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. వాగును రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెండు వైపుల కబ్జా చేశారు. రోడ్డు పక్కనే ఉండటంతో ఇక్కడ ఎకరా రూ.20 లక్షలకు పైగా ధర పలుకుతోంది. వాగు పరివాహక మొత్తం ఆక్రమణలకు గురికావడంతో వరద నీటి ప్రవాహం గతి తప్పే అవకాశం ఉంది. దీంతో కెల్లంపల్లి, పన్నూరు, శివరాయునిపేట గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల ఆయకట్టు భూమి బీళ్లువారే ప్రమాదం పొంచిఉంది. అంతేకాకుండా నదీపరివాహ ప్రాంతంలో మూగజీవాలకు గుక్కుడు నీరు తాగే అవకాశం లేకుండా పోయింది. గతంలో జాళ్లవాగులో వేసవిలో సైతం నీరు సమృద్ధిగా లభించేది. ఆక్రమార్కుల స్వార్థ ప్రయోజనాల కారణంగా జాళ్లవాగు రూపురేఖలు మారిపోయాయి. మర్రిపూడి, పొదిలి మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు వాగువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి కబ్జాకోరుల నుంచి జాళ్లవాగును పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

జన చైతన్యం
ప్రకాశం జిల్లా వార్తలు
సోమవారం 22 ఏప్రిల్ 2024



ఒంగోలు గడ్డ.. మాగుంట అడ్డా..!

ఇప్పటి వరకు పార్లమెంట్ స్థానానికి 16 సార్లు ఎన్నికల నిర్వహణ

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం
మొత్తం ఓటర్లు 16,00,409 మంది
పురుషులు 7,98,775 మంది
స్త్రీలు 8,01,634 మంది



ఆ కుటుంబం నుంచి ఎనిమిదిసార్లు పోటీ.. ఆరుసార్లు గెలుపు

తాజా ఎన్నికల్లోనూ వారే పోటీ
పొరుగు ప్రాంత నేతలకు ఆదరణ.. అధికసార్లు వారే గెలుపు
తొలినాళ్లలో కమ్యూనిస్టులు ఆ తర్వాత కాంగ్రెస్ అధిపత్యం
పునర్విభజన తర్వాత పెరిగిన పశ్చిమ ప్రాంత ప్రభావం
గెలుపులో ఆ ఓటర్లే కీలకం
వనరులు తక్కువ, సమస్యలు ఎక్కువ
ఏడాది పొడవునా దాహం కేకలు
వెలిగొండతోనే భవిష్యత్

ఒంగోలు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం తొలినాళ్లలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ మధ్య పోటాపోటీ.. ఎక్కువసార్లు కాంగ్రెస్ అధిక్యం కొనసాగింది. రాన్రాను మారిన పరిస్థితుల నేపథ్యంలో తొలుత టీడీపీ, ఆ తర్వాత వైసీపీలకు ఒంగోలు పార్లమెంట్ స్థానంలో ఆదరణ లభించింది. ఆ క్రమంలో ఇక్కడకు 1996లో నెల్లూరు నుంచి వచ్చిన మాగుంట కుటుంబాన్ని జిల్లా ప్రజలు అందరికన్నా ఎక్కువగా ఆదరించగా ఆ కుటుంబం ఈ ప్రాంతాన్ని రాజకీయ కేంద్రంగా మార్చుకొని స్థానికులుగా ముద్రపడిపోయారు. అప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లోనూ మాగుంట కుటుంబం నుంచి పోటీలో ఉంటూనే ఉన్నారు. అలా ఇప్పటివరకు ఎనిమిదిసార్లు మాగుంట కుటుంబం తరఫున ఒంగోలు ఎంపీ స్థానంలో పోటీ చేయగా ఆరుసార్లు గెలుపొందారు. ఎక్కువసార్లు గెలుపొందడమేగాక మరోసారి తాజాగా జరగనున్న ఎన్నికల్లోనూ మాగుంట శ్రీనివాసులరెడ్డి బరిలో నిలిచారు.



నియోజకవర్గ పునర్విభజనతో మారిన ముఖచిత్రం

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం ఆవిర్భావం నుంచి 2009 వరకు జిల్లాలోని తూర్పు ప్రాంతం, నెల్లూరు జిల్లాలో కొంత ప్రాంతం ఈ పార్లమెంట్ స్థానంలో ఉండేది. పునర్విభజన తర్వాత ఒంగోలు పార్లమెంట్ స్థానంపై పశ్చిమ ప్రాంత ప్రభావం పూర్తిగా పెరిగింది. తొలి నుంచి రెడ్డి సామాజిక వర్గం వారే ఇక్కడ పార్లమెంట్ సభ్యులుగా ఎక్కువసార్లు గెలుపొందుతుండగా ప్రస్తుతం ఆ సామాజిక వర్గ రాజకీయ ఆధిపత్యం మరింత పెరిగింది.

తొలినాళ్లలో ద్విసభ్య నియోజకవర్గంగా ఒంగోలు...

ఒంగోలు పార్లమెట్ స్థానానికి తొలి ఎన్నికలు 1952లో జరగ్గా అప్పట్లో ద్విసభ్య నియోజకవర్గంగా ఉండేది. ఆనాడు కమ్యూనిస్టు నేతలుగా ఉన్న పీసపాటి వెంకటరాఘవయ్య, ఎం. నానాదాసులు గెలుపొందారు. 1957లో జరిగిన ఎన్నికలలో కమ్యూనిస్టు నేత మాదాల నారాయణస్వామిపై కాంగ్రెస్ అభ్యర్థి రొండా నారపరెడ్డి గెలుపొందగా, 1962లో పోటీ చేసిన మాదాల నారాయణస్వామి సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి టీఎస్ పోల్‌పై విజయం సాధించారు. 1962 ఎన్నికల నాటికి కమ్యూనిస్టుల ప్రభావాన్ని అడ్డుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ ఆ రోజుల్లో ప్రముఖ సినీనటుడు కొంగర జగ్గయ్యను తెచ్చి రంగంలోకి తెచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జగ్గయ్య గెలుపొందగా అప్పటి నుంచి 2014 ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ హవా సాగింది. మొత్తంగా 1952 నుంచి 2019 వరకు 16 సార్లు ఎన్నికలు జరిగితే 11 సార్లు కాంగ్రెస్ గెలిచింది. అందులో ఐదుసార్లు కాంగ్రెస్ పార్టీ తరఫున మాగుంట కుటుంబం గెలుపొందింది.

సినీనటుడు కొంగర జగ్గయ్య పోటీతో ప్రారంభం...

1967 ఎన్నికలలో కొంగర జగ్గయ్య పోటీతో ప్రారంభమైన పొరుగు ప్రాంత నేతల ప్రభావం నేటి వరకు కొనసాగుతూనే ఉంది. ప్రతి ఎన్నికల్లోనూ గెలుపొందిన లేదా ఓటమి చెందినా, ద్వితీయ స్థానంలో నిలిచిన అభ్యర్థులలో ఎవరో ఒకరు పొరుగు ప్రాంతం వారే ఉంటూ వస్తున్నారు. తాజా ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీల తరఫున పొరుగు నేతలే బరిలో దిగుతున్నా మూడు దశాబ్దాలకుపైగా ఇక్కడ రాజకీయం నడుపుతున్న మాగుంట కుటుంబం ఇక్కడ స్థానికులుగానే ముద్రపడిపోయారు.

నియోజకవర్గ పునర్విభజన అనంతరం ఒంగోలు స్థానంపై పశ్చిమ ప్రాంత ప్రభావం అధికమైంది. ఒకప్పుడు నర్సరావుపేట పార్లమెంట్ స్థానంలో ఉన్న పశ్చిమ ప్రాంతాలు 2009 నుంచి ఒంగోలులో చేరడంతో గెలుపులో ఆ ప్రాంత ఓటర్లు తీర్పు ప్రభావం అధికమైంది. ఇదిలా ఉండగా ఈ ప్రాంత ప్ర జల పరిస్థితి చూస్తే రాష్ట్రంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతం. వర్షాకాలం, ఎండాకాలం అన్నది తేడా లేకుండా నిత్యం దాహం కేకలు పశ్చిమ ప్రాంతంలో వినిపిస్తుంటాయి. అంతేస్థాయిలో సాగునీటి సమస్య అధికం, విస్తారంగా భూములున్నా సాగునీరు లేక పంటలు పండక తాగేందుకు నీళ్ల లేక ఇతర మౌలిక సదుపాయాలు ప్రత్యేకించి ఉపాధి మార్గాలు లేక ఆ ప్రాంతం నుంచి వేలాది కుటుంబాలు వలసలు వెళ్లాయి. ఇంకా ఆ పరిస్థితి కొనసాగుతూనే ఉంది. అయితే వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే పశ్చిమ ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో గెలిచిన వారి వివరాలు...

సంవత్సరం	గెలుపొందిన అభ్యర్థి	ద్వితీయ స్థానం	మెజార్టీ
1957	ఆర్. నారపరెడ్డి(కాంగ్రెస్)	మాదాల నారాయణస్వామి(సీపీఐ)	24,619
1962	మాదాలనారాయణస్వామి(సీపీఐ)	టీఎస్ పొలు(కాంగ్రెస్)	2,343
1967	కొంగర జగ్గయ్య(కాంగ్రెస్)	ఎం.నారాయణస్వామి(సీపీఐ)	80,453
1971	పీఏ ప్రసాదరావు(కాంగ్రెస్)	జీ భారతీరంగ(స్వతంత్ర)	2,74,127
1977	పులి వెంకటరెడ్డి(కాంగ్రెస్)	ఎం.వెంకయ్యనాయుడు(బీఎల్‌డీ)	89,325
1980	పులివెంకటరెడ్డి(కాంగ్రెస్)	ఆనం భక్తవత్సలరెడ్డి(జనతా)	1,51,175
1984	బెజవాడ పాపిరెడ్డి(టీడీపీ)	పులి వెంకటరెడ్డి(కాంగ్రెస్)	18,143
1989	మేకపాటి రాజమోహన్‌రెడ్డి(కాంగ్రెస్)	కాటూరి నారాయణస్వామి(టీడీపీ)	97,370
1991	మాగుంట సుబ్బరామరెడ్డి(కాంగ్రెస్)	డేగా నరసింహారెడ్డి(టీడీపీ)	39,330
1996	మాగుంట పార్వతమ్మ(కాంగ్రెస్)	మేకపాటి రాజమోహన్‌రెడ్డి(టీడీపీ)	50,060
1998	మాగుంట శ్రీనివాసులరెడ్డి(కాంగ్రెస్)	ఎం.రాజమోహన్‌రెడ్డి(టీడీపీ)	20,866
1999	కరణం బలరామకృష్ణమూర్తి(టీడీపీ)	మాగుంట శ్రీనివాసులురెడ్డి(కాంగ్రెస్)	21,948
2004	మాగుంట శ్రీనివాసులరెడ్డి(కాంగ్రెస్)	విజయభారతి(టీడీపీ)	1,06,012
2009	మాగుంట శ్రీనివాసులరెడ్డి(కాంగ్రెస్)	ఎంఎం కొండయ్య(టీడీపీ)	78,523
2014	వైవీ సుబ్బారెడ్డి (వైసీపీ)	మాగుంట శ్రీనివాసులురెడ్డి(టీడీపీ)	15,535
2019	మాగుంట శ్రీనివాసులరెడ్డి(వైసీపీ)	శిద్దా రాఘవరావు(టీడీపీ)	2,13,057

రాజకీయ చిత్ర విచిత్రాలు

సైకిల్‌ను గుర్తుంచుకోండి

చీరాల టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కొండయ్య కుమార్తె ప్రచారం


టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్యకు మద్దతుగా ఆయన కుమార్తె శివనారాయణదేవి

చీరాల, ఏప్రిల్ 21 : ఎన్నికల వేళ టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌తోపాటు కొండయ్యకు మద్దతుగా ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కొండయ్య కుమారులు గౌరీఅమర్‌నాథ్, మహేంద్రనాథ్, కుమార్తె గోరిపర్తి శివనారాయణదేవి ప్రచారాన్ని వినూత్నంగా నిర్వహిస్తున్నారు. వీరిలో శివనారాయణదేవి పార్టీ శ్రేణులతో కలసి మారుమూల వీధుల్లో ఉన్న ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటేసి 'నాన్నను గెలిపించండి.. మీ సమస్యలు పరిష్కరిస్తారని అభ్యర్థిస్తున్నారు. రాష్ట్రం బాగుపడాలి.. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి అంటే కొండయ్యను గెలిపించుకోవాలని చెప్తూనే సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్, 50 ఏళ్లకే బీసీలకు పింఛన్, చంద్రబాబు ప్రభుత్వం రాగానే రూ.4వేల పింఛన్ వంటి ప్రయోజనాలను ఒక్కొక్కటి ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. 'అమ్మా ఎండనపడి వచ్చావ్ కాసిన్ని మంచినీళ్లు తాగు, కొంచెం మజ్జిగ తాగుతావా' అంటూ స్థానికులు, చిరువ్యాపారులు ఆమెపై ఆప్యాయత చూపుతున్నారు. ఈ క్రమంలో ఆమె మన గుర్తు ఏంటి అని అడుగుతూ ఎదుటి వారి నుంచి సైకిల్ అని చెప్పిస్తూ గుర్తుంచుకోండి సైకిల్‌ని అంటూ చేస్తున్న ప్రచారం ఆకట్టుకుంటోంది.

రంగులు మార్చి.. ఏమార్చి


రంగులు మార్చి బాలినేని ఫొటోతో ఫ్లెక్సీ



ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, వైసీపీ శ్రేణులు తమ ప్రచారానికి, సమావేశాలకు అడ్డదారులు వెతుక్కుంటున్నారు. అధికారులను సైతం మభ్యపెట్టి యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం ఒంగోలులోని వేమూరి కల్యాణ మండపంలో ఆర్యవైశ్యులు ఆత్మీయ సమావేశం పేరుతో సమావేశం ఏర్పాటు చేయగా, ఆ కార్యక్రమానికి వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగమైన ఈ కార్యక్రమానికి ఆర్య, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ నేతృత్వం వహించారు. సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి కల్యాణమండపానికి మాత్రమే అనుమతులు పొందగా, ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి లేదు. బాలినేని ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. అధికారుల కళ్లు కప్పేందుకు వైసీపీ రంగులు మార్చి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - ఒంగోలు (కార్పొరేషన్)

డ్రిల్.. జిల్


అల్లర్లను ఇలా కట్టడి చేస్తాం...

ఎన్నికల విధుల్లో భాగంగా
ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందికి శిక్షణ

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 21 : ఎన్నికలలో ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ చెప్పారు. ఆదివారం స్థానిక పోలీసు మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ సిబ్బంది ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొనేందుకు మాబ్ ఆపరేషన్ డ్రిల్, స్మోక్‌గన్ ఫైరింగ్, టియర్‌గ్యాస్ ఫైరింగ్, రోప్ పార్టీ డ్రిల్‌ను ప్రాక్టీస్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి మెలకువలను తెలియజేశారు. ప్రతికూల పరిస్థితిలో స్టోన్‌గార్డ్, హెల్మెట్, లాఠీ, టియర్‌గ్యాస్, ఆయుధాలను ఎలా వినియోగించాలని వివరించారు. వీఐపీ భద్రతలో ఎదురైన సమస్యలను ఎలా ఎదుర్కోవాలో కళ్లకు కట్టినట్లు మాబ్‌డ్రిల్‌లో చూపించారు. అదే సమయంలో టియర్ గ్యాస్ విడుదల చేయడం, లాఠీచార్జీకి ముందు హెచ్చరికలు చేయడంతోపాటు అవసరమైతే పోలీసు కాల్పులు చేసే సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు గురించి మాబ్ డ్రిల్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అల్లర్లను నిరోధించడమెలాగో శిక్షణ పొందుతున్న సిబ్బంది


అల్లర్లను ఎలా ఎదుర్కోవాలో శిక్షణ పొందుతున్న సిబ్బంది



వైసీపీ ప్రభుత్వంలో పాలన నుంచి పదవుల వరకు.. బీసీల అణచివేత

సీఎంగా జగన్ పగ్గాలు చేపట్టిన మొదట్నుంచీ అదే పంథా
స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు కోత
వారికి అందే 34 రకాల పథకాలు రద్దు
నవరత్నాలంటూ బులిపించి సరిపెట్టిన ప్రభుత్వం
వారిపై హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు కోకొల్లలు
వైసీపీ ఐదేళ్ల పాలనపై తీవ్ర వ్యతిరేకతలో బలహీన వర్గాలు

సింగరాయకొండ, ఏప్రిల్ 20 : రాష్ట్ర జనాభాలో సగభాగానికిపైగా ఉన్న బీసీలకు జగన్‌రెడ్డి పాలనలో భంగపడ్డారు. గత ఎన్నికలకు ముందు నా బీసీలంటూ పదేపదే వల్లెవేసిన జగన్.. అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. జగన్ ఐదేళ్లపాలనను సూక్ష్మస్థాయిలో పరిశీలన చేసిన బీసీలు.. పదవుల నుంచి పథకాల వరకు అన్నింటిలోనూ తమకు అన్యాయం చేశారని గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ ప్రభుత్వంలో బలహీన వర్గాలకు ఇచ్చిన 34 పథకాలకు వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. నవరత్నాల ద్వారా అందే పథకాలు మినహా వారికి ప్రత్యేకంగా అందే పథకాలను ఊచకోత కోశారు.

సింగరాయకొండ ప్రాంతంలో బీసీలపై అక్రమ కేసులు, వేధింపుల్లో కొన్ని..



- సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ ఆర్చీ, విగ్రహాల కేసులో టీడీపీ నాయకులైన బీసీ సామాజిక వర్గానికి చెందిన నలుగురు వ్యక్తులపై అక్రమంగా వైసీపీ నాయకులు కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేశారు.
- టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే పాతసింగరాయకొండ యాదవ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ కుమారుడిపై వైసీపీ ప్రభుత్వం పలుమార్లు అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేసింది.
- సింగరాయకొండ మండలం మూలగుంటపాడు బీసీ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యుడి కుమారులు ఇద్దరుపై సొంత పార్టీ నేతలు దాడి చేయించారు. అనంతరం జరిగిన గొడవలు ప్రతీకార హత్యకు దారితీశాయి.
- పొన్నలూరు మండలం తిమ్మసముద్రం గ్రామంలో టీడీపీ సానుభూతిపరుడైన బీసీ వ్యక్తి మోరబోయిన మాల్యాద్రి దుకాణాన్ని వైసీసీ నేతలు అక్రమంగా కూల్చివేసి అతని బతుకుదెరువుపై తీవ్ర దెబ్బకొట్టారు.

బీసీలపై దాడులు, హత్యలు, దౌర్జన్యాలు

టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సన్నెబోయిన



వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు కోకొల్లలు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను అనేకమందిని పగబట్టి హత్య చేశారు. అక్రమ కేసులు పెట్టి వేధించారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై జరిగిన దాడులు గతంలో ఎన్నడు జగరలేదు. రాబోయే ఎన్నికల్లో బీసీలు జాగరూకతతో మేల్కొని బీసీలకు అండగా ఉండే టీడీపీ వెంట నడవాలి.

బీసీలకు అన్ని విధాల అన్యాయం

గాలి హరిబాబు




జగన్‌రెడ్డి పానలో బీసీలకు అన్ని విధాల అన్యాయం జరిగింది. స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న రిజర్వేషన్‌లో 10 శాతం వైసీపీ ప్రభుత్వం తగ్గించింది. కార్పొరేషన్ల ద్వారా అందే రుణాలను, పారిశ్రామిక రాయితీలను రద్దుచేశారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు అందించిన పెళ్లికానుకలు, పండుగ కానుకలు రద్దుచేసి బీసీల నోట్లో మన్ను కొట్టారు. ఆదరణ పథకాన్ని రద్దుచేసి బీసీ కుల వృత్తులకు ద్రోహం చేశారు.

బీసీల అభ్యున్నతికి బీసీ డిక్లరేషన్

టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మించల



బీసీల అభ్యున్నతికి టీడీపీ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాగానే బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, ప్రత్యేక రక్షణ చట్టం, సబ్‌ప్లాన్ నిధులకు ఐదేళ్లలో లక్షన్నర కోట్లు, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంది. ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాల పునరుద్ధరణ, చట్టబద్ధంగా కులగణన, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు, రూ.10 లక్షలతో చంద్రన్న బీమా పునరుద్ధరణ, పెళ్లికానుక లక్షకు పెంపు, శాశ్వత కులధ్రువీకరణ పత్రం, విద్యా పథకాల పునరుద్ధరణ, బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.



వైసీపీ వచ్చాక మండలంలో బీసీల పెత్తనానికి తొలిసారి గండి

నరాల సుధాకర్



సింగరాయకొండ మండలంలో గత 30 ఏళ్ల నుంచి ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీలో ఉన్న బీసీలే రాజకీయ పెత్తనాన్ని చెలాయించేవారు. వైసీసీ ప్రభుత్వం వచ్చాక మండలంలో బీసీల పెత్తానానికి మొదటిసారిగా గండికొట్టారు. అతి తక్కువ జనాభా ఉన్న సీఎం వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులే మండలం మొత్తమ్మీద పెత్తనాన్ని చెలాయిస్తున్నారు. బీసీలపై అక్రమ కేసులు పెట్టి వేధించారు.

అప్పుడిలా ఇప్పుడిలా

- స్థానిక సంస్థల్లో బీసీలకు టీడీపీ 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే 24 శాతానికి కుదించి 10 శాతం రిజర్వేషన్‌ను కోతేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 16,800 రాజ్యాంగ పదవులను బీసీలు కోల్పోయారు.
- టీడీపీ హయాంలో కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ద్వారా 4 లక్షల మందికి రూ.3,700 కోట్లు రుణాలను అందజేస్తే వైసీపీ ప్రభుత్వంలో 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. టీడీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్ల ద్వారా బీసీలకు రుణాలను, పారిశ్రామిక రాయితీలను ఇస్తే జగన్ ప్రభుత్వం వాటిని రద్దుచేసింది.
- బీసీ సబ్‌ప్లాన్ నిధులను రూ.75వేల కోట్లు దారి మళ్లించి ఆర్థికంగా అణచివేశారు.
- చంద్రబాబు బీసీలకు మెరుగైన విద్యను అందించటానికి బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు, విదేశీవిద్య, స్టడీ సర్కిల్ వంటి పథకాలు ప్రవేశపెడితే వాటిని జగన్ వచ్చాక అర్థంతరంగా రద్దుచేశారు.
- గత తెలుగుదేశం ప్రభుత్వంలో 13 జిల్లాలకు మంజూరు చేసిన 13 బీసీ భవనాలు, 1,187 కమ్యూనిటీ హాళ్లను నిలిపివేసి బీసీల మీద వైసీపీ పగ తీర్చుకుంది.
- వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 74 మంది బీసీల హత్య, 800 మందిపై తప్పుడు కేసుల బనాయింపు, 3 వేల మందిపై దాడులకు పాల్పడ్డారు.
- గత చంద్రబాబు ప్రభుత్వం బీసీ కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ఆదరణ పేరిట పనిముట్లను అందజేసింది. కేవలం 10 శాతం చెల్లిస్తే 90 శాతం సబ్సిడీగా అందించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పథకానికి స్వస్తి పలికింది.

కూటమి అభ్యర్థులను ఆదరించండి

● టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి ● ఆ పార్టీ ఆధ్వర్యంలో నాయకుల విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి

పొదిలి, ఏప్రిల్ 21 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను ఆదరించాలని, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం రాత్రి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ గృహంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి అభ్యర్థులుగా తనను, మార్కాపురం నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా కందుల నారాయణ రెడ్డిని చంద్రబాబునాయుడు బరిలో ఉంచారన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ప్రతి చిన్న విషయాన్ని పరిగణలోకి తీసుకొని టీడీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి గెలుపును ఎవరు ఆపలేరన్నారు. అత్యధిక సీట్లతో కూటమి అధికారంలోకి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రం క్లిష్ట పరిస్థితితుల్లో ఉందని అందుకు టీడీపీ గెలుపు, చంద్రబాబునాయుడి పాలన ఎంతోచారిత్రక అవసరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి : మండలంలోని తలమళ్ల గ్రామంలో శనివారం 'ఇంటింటికి కందుల' ప్రచార కార్యక్రమం కందుల నారాయణరెడ్డి తనయుడు విఘ్నేష్‌రెడ్డి నిర్వహించారు. విఘ్నేష్‌రెడ్డికి గ్రామంలో మహిళలు పూలమాలలు వేసి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీఏ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరికి అభివాదం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో బడుగు బలహీన వర్గాలతోపాటు అన్నీ వర్గాల ప్రజల అభివృద్ధికి దోహద పడనున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తలమళ్ల గ్రామ నాయకులతోపాటు టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

సిద్ధవరంలో ఇంటింటి ప్రచారం

కొనకనమిట్ల : మండలంలోని మునగపాడు గ్రామంలో ఆదివారం ఇంటింటికి కందుల ప్రచార కార్యక్రమం నారాయణరెడ్డి సోదరుడు కందుల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎన్‌డీఏ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీని వాసరెడ్డి, కందుల నారాయణ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతిఒక్కరికి అభివాదం చేస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ 6 పథకాలు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కందుల వేణుగోపాల్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కార్యక్ర మంలో మునగపాడు గ్రామ నాయకులతో పాటు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న కందుల వసంతలక్ష్మి

మార్కాపురం : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజల కష్టాలు తీరతాయని జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో ఆదివారం కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసైనికులు, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూటమి అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, కందుల నారాయణరెడ్డిల విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రస్తుతం పింఛన్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాల పేరుతో మహిళ సాధికారతకు సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మౌలాలీ, కొప్పుల శ్రీనివాసులు, కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

తర్లుపాడు : బీసీల అభివృద్ధికి కృషి చేసేది టీడీపీనేని యువ నాయకుడు కందుల రోహిత్‌రెడ్డి అన్నారు. తర్లుపాడులో రోహిత్ ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాల వలన పేదలకు కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని 20 రోజుల్లో పతనమవుతుందన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను, అవినీతిని ఎండగట్టారు. టీడీపీ బీసీల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలపై నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తూ, గతంలో వారికి వస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేసిందన్నారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.గోపీనాథ్ చౌదరి, యూత్ అధ్యక్షులు మేకల వెంకట్, గ్రామ కమిటీ అధ్యక్షులు గౌతుకట్ల సుబ్బయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ప్రచారం నిర్వహిస్తున్న విఘ్నేష్‌రెడ్డి, మాట్లాడుతున్న ఇమ్మిడి కాశీనాథ్

అవీ..ఇవీ..

అంధకారంలో జూనియర్ కళాశాల వీధి

పొదిలి, ఏప్రిల్ 21 : పొదిలి జూనియర్ కళాశాల వీధిలో కొన్ని నెలలుగా అంధకారం నెలకొంది. పట్టణంలోనే పెద్ద వ్యాపార సముదాయంలోని కళాశాల వీధిలో కనీసం వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయకపోవడం ఏమిటని వ్యాపారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళల్లో పట్టణంలో దొంగల హల్‌చల్ చేయడం కూడా పొదిలిలో ఎక్కువగా ఉంది. ఈక్రమంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రతిరోజు చూస్తుంటారు కాని సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవతీసుకొని వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని పలువురు వ్యాపారులు కోరుతున్నారు.

పన్ను తగ్గింపునకు అవకాశం

గిద్దలూరు, ఏప్రిల్ 21 : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెలాఖరులోగా మొత్తం పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిమాండ్ నోటీసు కోసం వేచి చూడకుండా అసెస్‌మెంట్ నెంబర్, డోర్ నెంబర్, పాత రసీదు చూపి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలపై పన్నులు చెల్లించి 5శాతం పన్ను రాయితీ పొందవచ్చని పేర్కొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



విశేష అలంకరణలో అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 21: పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాహుల్‌మీనా

మార్కాపురం, ఏప్రిల్ 21: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం వివిధ ప్రభుత్వ శాఖ అధికారలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా మాట్లాడుతూ అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడాలన్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వాహనాలు మాఢ వీధులలో సంచరించే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రథోత్సవానికి హాజరయ్యే వేలాది మంది భక్తులను దృష్టిలో పెట్టుకొని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలసుందరరావు, సీఐ ఆకుల వెంకటేశ్వర్లు, ఈవో గొలమారు శ్రీనివాసులరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎర్రగొండపాలేనికి షర్మిల

పుల్లలచెరువు, ఏప్రిల్ 21: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేడు ఎర్రగొండపాలేనికి రానున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు వై.పాలెం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బూదాల అజితారావు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ కూడలిలో బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిచనున్నట్లు వైపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

వన్యప్రాణిని వేటాడిన కేసులో ఒకరి అరెస్టు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 21 : వన్యప్రాణిని వేటాడిన కేసులో అటవీశాఖ అధికారులు ఒకరిని అరెస్టు చేశారు. ఏడాది క్రితం కణితిని వేటాడి చంపిన కేసులో మన్యం రంగయ్య నిందితుడిగా ఉన్నాడు. అయితే అప్పటి నుండి తప్పించుకుని తిరుగుతున్నాడు. దిగువమెట్ట సమీపంలో అతడు ఉన్నట్లు గుర్తించి అధికారులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచినట్లు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ డి.వంశీక్రిష్ణ తెలిపారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

పొదిలి : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఆదివారం తనిఖీలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా కమిషనర్ చంద్రశేఖర్, తహసీల్దార్ జియా ఆధ్వర్యంలో ఆదివారం మార్కాపురం అడ్డరోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎలాంటి అనుమతులు లేకుండా వాహనాల్లో ఎన్నికలను ప్రభావితం చేసే వస్తువులను తరలించి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీఐ మల్లిఖార్జునరావ్, ఎస్ఐ కోటయ్య,ఇన్‌చార్జ్ ఆర్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

బీఫాం అందుకున్న ఎరిక్షన్‌బాబు



బీఫాం అందుకుంటున్న ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, ఏప్రిల్ 21: వై.పాలెం టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆ పార్టీ తరపున బీ.ఫాం అందుకున్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో బీఫాం అందజేశారు. తనపై నమ్మకం ఉంచి బీఫాం అందజేసిన చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ అభ్యర్థిగా గెలిచి సీటును కానుకగా ఇస్తానని ఈ సందర్భంగా గుడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో వరిగడ్డి వామి దగ్ధం



దగ్ధమవుతున్న వరిగడ్డివామి

త్రిపురాంతకం, ఏప్రిల్ 21: అగ్ని ప్రమాదంలో వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన మండలంలోని గణపవరంలో ఆదివారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన రైతు యెగ్గెం పెద్ద చెన్నారెడ్డికి చెందిన రెండు ట్రక్కుల వరిగడ్డి అగ్నికి ఆహుతయ్యింది. సమాచారం అందుకున్న ఎర్రగొండపాలెం అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అప్పటికే గడ్డి మొత్తం కాలి బూడిదైంది. దీంతో సుమారు రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

మందుబాబుల ఇక్కట్లు



మద్యంకోసం క్యూకట్టిన మందుబాబులు

పొదిలి, ఏప్రిల్ 21 : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సమయపాలన కుదించడంతో మందుబాబులకు ఇక్కట్లు మొదలయ్యాయి. గతంలో ఎప్పుడు డబ్బులు సమకూరితే అప్పుడు షాపుకు వెళ్లి మద్యం సేవించేవారు. కానీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమయంలో కుదించడంతో ఆసమయంలో డబ్బులు లేక ఆతరువాత అధిక ధరలకు కొనుగోలు చేయలేక పోతున్నామని మందుబాబులు వాపోతున్నారు. ఆదివారం షాపుల ముందు మందుబాబులు క్యూకట్టారు. సమయం అయిపోయిన తరువాత క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా ప్రైవేటు వ్యక్తులు వసూలు చేస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు. బార్‌కు వెళ్లి మద్యం తాగాలంటే క్వార్టర్ బాటిల్‌పై రూ.100 ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. బారులలో ఎంత పర్సెంటేజ్ అదనంగా వసూలు చేయాలనే పరిశీలన లేకపోవడంతో విచ్చలవిడిగా వసూళ్ల పర్వం కొన సాగుతోంది.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

త్రిపురాంతకం, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం త్రిపురాంతకంలో ఆదివారం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ సూరేపల్లి సుబ్బారావు, ఎస్సై వి సాంబశివయ్య ఆధ్వర్యంలో ఎర్రగొండపాలెం కూడలి నుంచి ప్రధాన రహదారి వెంట కంకణాలపల్లి రోడ్డు వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

శబ్దకాలుష్యం చేస్తే కఠిన చర్యలు





బైక్ సైలెన్సర్లు పరిశీలిస్తున్న డీఎస్పీ సుందరరావు, బేస్తవారపేట ఎస్సైలు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 21: శబ్దకాలుష్యం చేసే ద్విచక్ర వాహనదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సుందరరావు హెచ్చరించారు. పట్టణంలోని కళాశాల వీధిలోని సెవెన్ హిల్స్ లాడ్జి సెంటర్‌లో అధిక శబ్దాలు వచ్చే విధంగా ఏర్పాటు చేసిన బైకులను తనిఖీ చేసి 8 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. రోడ్లపై అధిక శబ్దాలు వచ్చే విధంగా సైలెన్సర్లను ఏర్పాటు చేసుకుని ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ తనిఖీలో రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ సైలెన్సర్ల పరిశీలన

బేస్తవారపేట : బేస్తవారపేటలోని ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు.యువత మోటార్ సైకిళ్లకు ఇష్టానుసారం సైలెన్సర్లను ఏర్పాటు చేసుకొని విపరితమైన శబ్దాలు చేస్తూ బైక్‌లు నడిపి ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టారు. పలు మోటార్ సైకిళ్ల సైలెన్సర్లను పరిశీలించి కొన్నిటిని తొలగించారు. మరోసారి ఏర్పాటు చేసుకుంటే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయిస్తామన్నారు. ఎస్సై బినరశింహరావు కౌన్సిలింగ్ నిర్వహించారు.

301 మంది వలంటీర్ల రాజీనామా

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 21 : నియోజకవర్గంలోని ఐదుమండలాల పరిధిలోని గ్రామసచివాలయాల్లో పనిచేస్తున్న 1549 మందిలో 301 మంది వలంటీర్లు ఎంపీడీవోలకు రాజీనామాలేఖలు అందజేశారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు ఎర్రగొండపాలెం మండలంలో 66 మంది, త్రిపురాంతకం మండలంలో 89 మంది, పెద్దారవీడు మండలంలో 66 మంది, పుల్లలచెరువు మండలంలో 69మంది, దోర్నాలలో 11 మంది వలంటీర్లు రాజీనామా చేయగా, ఎంపీడీవో ఆమోదించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి జోరుగా వలసలు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 21 : మండలంలోని అమానిగుడిపాడు ఎస్సీ కాలనీకి చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఆ పార్టీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు టీడీపీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మందనాగయ్య, ఎలిమినేటి మోషెయ్య, మందా ఎద్దుల నాగయ్య, మరియబాబులు ఉన్నారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి లేదన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిట్యాల వెంగల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు కుమార్తె చెల్సియా, కుమారుడు అజిత్‌లు టీడీపీ మండల మాజీ అధ్యక్షులు వడ్లమూడి లింగయ్య, వేగినాటి శ్రీను, జాగర్లమూడి గాలెయ్య తోట మహేష్, కొత్త భాస్కర్, గ్రామ సర్పంచి ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన సిద్ధవరం బీసీలు

సిద్ధన్నపాలెం నుంచి 15 కుటుంబాలు

పుల్లలచెరువు మండలం సిద్ధన్నపాలెం గ్రామం నుంచి 15 బీసీ కుటుంబాలు వైసీపీని వీడి ఆదివారం సాయంత్రం టీడీపీలో చేరాయి. వై.పాలెం మండలం అమనిగుడిపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వారు టీడీపీలో చేరారు. తెలుగుయువత కార్యవర్గ సభ్యులు పోట్ల గోవింద్ పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఎరిక్షన్‌బాబు కుమార్తె చెల్సియా, కుమారుడు అజిత్, పుల్లలచెరువు మండల టీడీపీ ముఖ్యనాయకులు బీవీ.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కూటమి విజయంతోనే నియోజకవర్గం అభివృద్ధి

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 21 : ఎర్రగొండపాలెం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలించాలని ఆయన కుమార్తె చెల్సియా, కుమారుడు అజిత్‌లు కోరారు. అమానిగుడిపాడు గ్రామంలో ఆదివారం సాయంత్రం వారు ర్యాలీలో పాల్గొన్నారు. వెలిగొండప్రాజెక్టు పూర్తి కావాలన్న, మార్కాపురం జిల్లా కావాలన్న టీడీపీ ప్రభుత్వం ఏర్పడితేనే సాధ్యమన్నారు. టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డిలను సైకిల్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, మాజీ మండల టీడీపీ అధ్యక్షులు వడ్లమూడి లింగయ్య మాజీ ఎంపీటీసీ చిట్యాల వెంగళరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షులు జాగర్లమూడి గాలెయ్య, మండల తెలుగుయువత నాయకులు వేగినాటి శ్రీను, తోట మహేష్ కొత్త భాస్కర్ టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ చల్సియా

అందరివాడైన అశోక్‌రెడ్డిని గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న దివ్యేష్‌రెడ్డి

బేస్తవారపేట, ఏప్రిల్ 21: గిద్దలూరు నియోజకవర్గాన్ని గతంలో అభివృద్ధి చేసిన తన తండ్రి ముత్తుముల అశోక్‌రెడ్డిని గెలిపించాలని ఆయన తనయుడు దివ్యేష్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం ఆయన బేస్తవారపేట మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె, రెట్టపల్లె కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఎన్నడు జరగని విధంగా టీడీపీ హయంలో అభివృద్ధి జరిగిందని, గ్రామాల్లో సిమెంట్ రోడ్లు,వివిధ రంగాల వర్గాల వారికి పార్టీలకు అతీతంగా రాయితీ రుణాలు,గృహాలు మంజూరు.సీఎం రీలీఫ్ ఫండ్, తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారన్నారు.ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో గిద్దలూరు నుండి పోటీ చేయుచున్న ముత్తముల అశోక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న మాగుంట శ్రీనివాసరెడ్డిలను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో పెద్ద ఓబినేనిపల్లె, వెన్నా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

● ఏడుగురికి తీవ్ర గాయాలు



108 వాహనంలో ఆస్పత్రికి తరలుతున్న క్షతగాత్రులు

బేస్తవారపేట, ఏప్రిల్ 21: అమరావతి -అనంతపురం జాతీయ రహదారిలోని బేస్తవారపేట మండలం పందిళ్లపల్లె టోల్ ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురుకి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. మార్కాపురం విద్యానగర్ కాలనీకి చెందిన వారు ఆటోలో గిద్దలూరు మండలం తంబళ్లపల్లె గ్రామంలో ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా, పందిళ్లపల్లె టోల్ ప్లాజా సమీపంలోని కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వీరిని 108 ద్వారా కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైభవోపేతంగా సీతారాముల రథోత్సవం

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 21: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో సీతారాములవారి రథోత్సవం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రామయ్యస్వామి పర్యవేక్షణలో గ్రామంలో బుధవారం కల్యాణం నిర్వహించారు. అనంతరం నిత్యం స్వామివారికి వాహనసేవ నిర్వహించారు. ఆదివారం రథోత్సవం జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొగ్గరపు రమేష్, రావికింది సుబ్బరత్నం, పెరుమాళ్ల సుబ్బారావు, నాగేంద్రబాబు, రావికింది పుల్లారావు, దొడ్డా వెంకటేశ్వర్లు, డమాం పెద్దచెంచయ్య, నెల్లూరి కోటేశ్వరరావు, డమాం వెంకట సుబ్బయ్య, మండ్లా వెంకటసుబ్బయ్య, రాములు పాల్గొన్నారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

గిద్దలూరు : రాచర్ల మండలం జెల్లివారి పుల్లలచెరువు సమీప నల్లమల అడవిలో వెలసిన శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 23వ తేదీ మంగళవారం అంకురార్పణ, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, స్వామివారి శేషవాహన సేవ, హనుమంతవాహనంపై శ్రీరాముల వారి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి బి.రమేష్ తెలిపారు. 24న బుధవారం ఉదయం 11 గంటలకు అంగరంగ వైభవంగా స్వామి కళ్యాణ మహోత్సవం, రాత్రి 10గంటలకు గరుడవాహనంపై విష్ణుమూర్తి అలంకారం, అర్ధరాత్రి 12 గంటలకు ధ్వజ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. 25న బుధవారం ఉదయం 9గంటలకు స్వామి వారి తెప్పోత్సవం, సాయంత్రం 4గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా 23వ తేది సాయంత్రం కోలాట ప్రదర్శన, రాత్రి బాలనాగమ్మ పూర్తి నాటకం, 24న మధ్యాహ్నం, సాయంత్రం కోలాట ప్రదర్శన, రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకం, 25న ఉదయం కోలాట ప్రదర్శన, రాత్రి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ఉంటుందన్నారు.

గుండు పందెం

బ్రహ్మోత్సవాలలో భాగంగా 24వ తేది గుండు పందెం నిర్వహించి మొదటి బహుమతి 10 తులాలు, రెండవ బహుమతి 5 తులాల వెండి ఇవ్వనున్నట్లు దేవస్థాన కమిటీ ప్రకటించింది. రూ.150 ఎంట్రీ ఫీజు చెల్లించి పోటీలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ సత్రాలు, సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు.





తలంబ్రాలను కలుపుతున్న మహిళలు, దేవేర్లతో స్వామివారు

కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. రాజ్యలక్ష్మీ అమ్మవారి, లక్ష్మీ చెన్నకేశవ యతిరాజ, శ్రీకృష్ణ స్వరాంజలి సేవా సంఘం, మహిళా సభ్యులు ఆలయ మధ్యరంగ మండపంలో మంగళవారం నిర్వహించనున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణానికి అవసరమైన తలంబ్రాలను కలిపారు. ప్రధానాచార్యకులు శ్రీపతి అప్పనాచార్యులకు సమర్పించారు.

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంకురార్పణతో మొదలయ్యాయి. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా మోతకాపుల చెన్నకేశవస్వామి నామ స్మరణల మధ్య పుష్కరణి వద్ద ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ మండపంలో వేంచేపు చేశారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు సోమయాజుల మల్లికార్జునశర్మ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. వివిధ రకాల మట్టిని సేకరించి నవదాన్యాలను కలిపి బ్రహ్మోత్సవాల అనంతరం వాటిలో వచ్చే పాలికలను వంటలు సస్యశ్యామలంగా పండేందుకు భక్తులకు పంచుతారని అర్చకులు తెలిపారు.

చల్లంగా చూడమ్మ... గంగమ్మ తల్లి


విశేష అలంకార రూపంలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, ఏప్రిల్ 21: పవిత్ర పుణ్యక్షేత్రం తూర్పుగంగవరం పంచాయతీ సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గుంటి గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి చల్లంగా చూడమ్మ... గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. తాళ్లూరు పరిసరమండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో సందడిగా మారింది. ఆలయ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలునిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంధ మహోత్సవాలు

పామూరు, ఏప్రిల్ 21: పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో వెలసియున్న శ్రీహజరత్ కరిముల్లా షా ఖాదిరి కాలేషా పీర్ మస్తాన్‌వలి స్వామి వారి 58వ గంధ మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసినట్లు దర్గా ప్రదాన ముతవల్లి షేక్ పొదిలి గౌస్‌బాషా తెలిపారు. ఆదివారం ఉదయం దర్గాలో మిలాద్ (ప్రత్యేక ప్రార్థనలు) అనంతరం తహలీల్ ఫాతేహాలు నిర్వహించారు. ఇవి ముగిసిన అనంతరం భక్తులకు గంధం, ప్రసాదాలను అందచేశారు. ఈసందర్భంగా భక్తులు దర్గా లోపల, బయట ప్రమిదలు వెలిగించి మొక్కులు తీర్చుకొన్నారు. కార్యక్రమాల్లో ముజావర్లు, దర్గా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా విజయాంజనేయస్వామి తిరునాళ్ల


దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దొనకొండ, ఏప్రిల్ 21: దొనకొండలోని నాల్గురోడ్ల కూడలిలోని పాపులమ్మ సత్రంలో వెలసిన విజయాంజనేయస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి వార్ల 17వ వార్షికోత్సవ తిరునాళ్ల వేడుకలు ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి నేతృత్వంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు స్వామివారికి అఖండజ్యోతి దీపారాధన, గణపతి పూజ, మండపారాధన, పంచామృతాభిషేకాలు, సహస్రనామ తమలార్చన తదితర పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. దేవాలయం సన్నిధిలో మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం

కనిగిరి, ఏప్రిల్ 20: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఆదివారం పట్టణంలోని కూచిపూడిపల్లిలో జరిగిన ఈ ఘటనలో లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. పట్టణంలోని 5వ వార్డు కూచిపూడిపల్లిలో బత్తుల రత్తయ్య ఇంట్లో ఎయిర్‌కూలర్ నుంచి విద్యుత్ షార్ట్ జరిగి మంటలు ఎగిసిపడ్డాయి. ఆ మంటలు మంచపై ఉన్న పరుపుపై పడటంతో మంటలు మరింత తీవ్రమై ఇంట్లోని టీవీ, దుస్తులు, బీరువా, ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేసినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితమైన షాదీఖానా

» ఐదేళ్లుగా వెక్కిరిస్తున్న శిలాఫలకం


షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు(ఫైల్)


శంకుస్థాపన చేసిన శిలాఫలకం

దొనకొండ, ఏప్రిల్ 21: మండల కేంద్రమైన దొనకొండలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసిన షాదీఖానా నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. నాడు వేసిన శిలాఫకలం ఐదేళ్లుగా వెక్కిరిస్తూ అలంకారప్రాయంగా దర్శనమిస్తుంది. గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు 2016లో ఒక్కో షాదీఖానా నిర్మాణానికి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేసింది. దొనకొండ మండలానికి మంజూరైన షాదీఖానా నిర్మాణం గురించి ప్రారంభంలో నాయకులు పట్టించుకోలేదు.

అప్పటి మండల కోప్షన్‌సభ్యుడు షేక్ గౌస్ దొనకొండలో షాదీఖానా ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొని అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో అప్పటి అధికారులు ప్రధాన రహదారి పక్కన షాదీఖానా నిర్మాణానికి ఒక ఎకరా యాభై సెంట్లు ప్రభుత్వ భూమి కేటాయించారు. దీంతో మైనార్టీ కార్పొరేషన్ నుంచి రూ.15లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మాణం తలపెట్టేందుకు టెండరు ఖరారయింది. ఈక్రమంలో అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు మార్చి 1,2019లో శంకుస్థాపన చేశారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికలు రావటం, ఆతర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టింది.

అధికార వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ షాదీఖానా నిర్మాణం గురించి అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో శంకుస్థాపన జరిగిందనే కారణంతోనే వైసీపీ నాయకులు పట్టించుకోకుండా వదిలేశారని ప్రజల్లో చర్చనీయాంశమైంది. దాదాపు ఐదు సంవత్సరాలుగా షాదీఖానా నిర్మాణం పునాది గుంతలకే పరిమితమైందే తప్ప నిర్మాణం పనులు అడుగు ముందుకుపడలేదు. షాదీఖానా నిర్మాణం, దాని ప్రాముఖ్యత గురించి పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాదీఖానా నిర్మాణం దొనకొండ ప్రాంత మైనార్టీలకు కళగానే మిగిలిపోయిందని, ఇక నిర్మాణం గూర్చి మరచిపోవటమేనని పలువురు పేర్కొన్నారు. మండలంలోని దొనకొండ, కొచ్చెర్లకోట, వద్దిపాడు తదితర గ్రామాలలో దాదాపు 900 ముస్లిం కుటుంబాలు జీవిస్తున్నారు. వివాహ, ఇతర శుభకార్యాలు, సమావేశాలకు దొనకొండలో సరైన సౌకర్యంలేక అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చంద్రబాబు చేతులమీదుగా బీఫాంలు అందుకున్న ఉగ్ర, లక్ష్మి





టీడీపీ అధినేత చంద్రబాబు చేతులమీదుగా బీఫాంలు అందుకుంటున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

దర్శి/కనిగిరి, ఏప్రిల్ 21: టీడీపీ అధినేత చంద్రబాబు చేతుల మీదుగా దర్శి, కనిగిరి అసెంబ్లీల కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిలు ఆదివారం బీఫాంలు అందుకున్నారు. ముమ్మర ప్రచారంలో ఉన్న లక్ష్మి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పిలుపురావటంతో హుటాహుటీన అమరావతిలో కేంద్ర కార్యాలయానికి వెళ్లి బీఫాం అందుకున్నారు. ఈసందర్భంగా చంద్రబాబు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. చంద్రబాబు ఇచ్చిన సూచనల మేరకు ఆయన అడుగుజాడల్లో నడుస్తామని గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. తమపై ఎంతో నమ్మకంతో బీఫా ంలు అందజేసిన చంద్రబాబుకు డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ఉగ్ర కృతజ్ఞతలు తెలిపారు.


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన మారెళ్ల వైసీపీ కార్యకర్తలు

మారెళ్లలో వైసీపీకి షాక్

» 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

పీసీపల్లి, ఏప్రిల్ 21: మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం రాత్రి కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో చేరారు. వీరికి ఉగ్ర నరసింహారెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను విస్మరించి ఓట్లు వేసిన అందరినీ మోసం చేశారన్నారు. వైసీపీ నాయకుల మాటలు నమ్మి గ్రామంలో అత్యధిక శాతం మంది వైసీపీకి ఓట్లేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ప్రజలకు అవసరమైన ఏఒక్క పని గ్రామంలో చేపట్టలేదని చెప్పారు. కనీసం తాగేందుకు కూడా శుద్ధజల నీరు లభించక గ్రామంలో ఎంతోమంది మూత్రపిండాల వ్యాధికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్ర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పాలేరు నదిపై నిర్మించిన పాలేటిపల్లి చెరువులో నీరు ఉన్న కారణంగా ఇంత వేసవిలోనూ బోర్లు ఎండిపోకుండా భుగర్భ జలాలు పెరిగాయన్నారు. గ్రామాల్లో టీడీపీ చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని అన్నారు. గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే సాధ్యమని భావించిన తాము ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడిని, కనిగిరి ఎమ్మెల్యేగా ఉగ్రనరసింహారెడ్డిని, ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసరెడ్డిని గెలిపించుకోవాలనే దృఢ సంకల్పంతో వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు.

పార్టీలో చేరినవారిలో యడ్లపల్లి శ్రీను, పరుచూరి నరసింహారావు, పరుచూరి బ్రహ్మయ్య, పరిమి లక్ష్మణరావు, పరిమి మల్లికార్జున, నల్లూరి శ్రీను, పరిమి మాల్యాద్రి, పరుచూరి రమేష్, పరస మాదవ, వెంకట హరీష్, కె.నరసింహ, కొండలరావు, శ్రీకాంత్, చిన్నా, పి.సెంచయ్య, మాలకొండయ్య, వెంకటనరసయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పరిమి వెంకటేశ్వర్లు, పరిమి మాలకొండయ్య, ములకా నాగేశ్వరరావు, గోగాడ సుబ్బారావు, శర్మ, శ్రీను, చిన్నా, బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

దర్శి ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి

» కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి


దర్శిలో ప్రచారం చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి


టీడీపీలో చేరిన కురిచేడు మండలం పడమరవీరాయపాలెం గ్రామస్థులు

దర్శి, ఏప్రిల్ 21: దర్శి ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆదివారం రాత్రి దర్శి నగర పంచాయతీలోని 6వవార్డులో కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలుచేసి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లోని ప్రజలతో మాట్లాడారు. వందలాది మంది అక్కడకు చేరుకొని హారతులిచ్చి పూలవర్షం కురిపించారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈప్రాంత సమస్యలు నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, సంగా తిరుపతిరావు, తెలుగు మహిళా నాయకురాలు ఎంశోభారాణి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక

కురిచేడు, ఏప్రిల్ 21: కురిచేడు మండలం పడమరవీరాయపాలెం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు ఆదివారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 40 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మేకల రాంబాబు, ఎనుగంటి గోపి, శోభన్ బాబు, మాలెం వెంకటేశ్వర్లు, మేకల శ్రీను, శీలం నాగేశ్వరరావు, మల్లెల మల్లికార్జున రావు, ఆకుమళ్ళ మస్తాన్, తదితరులు ఉన్నారు.

టీడీపీ అభ్యర్థి నామినేషన్‌ను విజయవంతం చేయాలి

దొనకొండ, ఏప్రిల్ 21: దర్శి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోమవారం చేపట్టే నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్నిగ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

దర్శి, ఏప్రిల్ 21: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. దర్శి - పొదిలి రోడ్డులో మోటార్ సైకిల్‌పై 133 బాటిళ్ళ మద్యం తీసుకెళుతుండగా అధికారులు తనిఖీచేసి స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న అక్రమమద్యాన్ని దర్శి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మద్యాన్ని ఎక్కడ నుంచి తీసుకవచ్చారు అనేదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదమ్ముల ఘర్షణ.. ఒకరికి తీవ్రగాయాలు

పీసీపల్లి, ఏప్రిల్ 21: కుటుంబ తగాదాల నేపథ్యంలో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో తమ్ముడు గాయపడ్డ సంఘటన మండలంలోని లక్ష్మక్కపల్లిలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు మాలకొండయ్య, మాల్యాద్రిలు అన్నదమ్ములు. వీరిమధ్య కొద్దిరోజులుగా భూమిలో పైపులు వేసుకునే విషయమై వివాదం జరుగుతుంది. ఆదివారం పైపులు వేసే సమయంలో ఇద్దరూ ఘర్షణపడి ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు.ఈ దాడిలో మాల్యాద్రి తీవ్రంగా గాయపడగా చికిత్సకోసం వైద్యశాలకు తరలించారు. వీరిరువురి దాడిపై పీసీపల్లి పోలీసులను వివరాలు అడగగా.. తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

వైభవంగా గ్రామ దేవతల పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 20: మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో అంకాలమ్మ, పోలేరమ్మ గ్రామ దేవతల ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కుటుంబసభ్యులతో దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు శాంతి పూజలు జరిపించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో పేదలకు ప్రయోజనం


సీఎస్‌పురం మండలం వి బైలులో పథకాల గురించి ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 20: టీడీపీ అధినేత ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు ప్రయోజనం చేకూరుతుందని టీడీపీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య అన్నారు. ఈ పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతారని చెప్పారు. మండలంలోని విబైలు గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎంపీగా మాగుంట శ్రీనివాసరెడ్డిని, ఎమ్మెల్యేగా ఉగ్రను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాలకొండయ్య, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య, దొర తిరుపతయ్య, జమకాల భాస్కరరావు, వెంకటాద్రి, బత్తుల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, పామూరు మండలం కంభాలదిన్నె ఎస్సీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో తెలుగురైతు మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, మాజీ సర్పంచ్ గోళ్ల మాల్యాద్రినాయుడు, వార్డు మెంబరు కొమ్మలపాటి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి

పామూరు, ఏప్రిల్ 21: వైసీపీ పాలనలో మహిళా సాధికారతను విస్మరించారని వ్యాపారవేత్త, టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు అన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలు వైసీపీకి ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పడమర కట్టకిందపల్లి గ్రామ పంచాయతిలో బాబుష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు చేకూరే ప్రయోజనాల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో మాగుంట, ఉగ్రలను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు గట్ల కొండారెడ్డి, కావేరి రసూల్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, పామూరు పట్టణంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రచారం నిర్వహించారు. ఆకులవీధి, దర్వాజగల్లీ, కనిగిరి రోడ్ దేవాలయం వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీచేశారు. స్థానిక వార్డు మెంబర్ ఉప్పలపాటి హరిబాబు మాట్లాడుతూ ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, ఎమ్మెల్యేగా ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య, షేక్ మునీర్, కటకం శివప్రసాద్, సుంకే మోహన్‌రావు, పాడె అరవింద్, బండ్ల సురేష్, ఈర్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం

కనిగిరి, ఏప్రిల్ 20: టీడీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. బుధవారం కనిగిరిలో జరిగే ఉగ్ర నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ నేతలు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, పట్టణంలో తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, అహ్మద్, వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), రాచమల్లశ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డిలు ఇంటింటికి తిరుగుతూ నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని పల్లెలు

వెలిగండ్ల, ఏప్రిల్ 21: వైసీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. మండలంలోని హుస్సేన్ పురం, కంకణంపాడు పంచాయతీలో ఆదివారం ఇంటిఇంటికి తిరుగుతూ టీడీపీ చేపడుతున్న సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు కార్యక్రమంలో నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, కర్నాటి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ జనార్దన్‌రెడ్డి, చిలకల క్రిష్టారెడ్డి, ఒంగోలు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో శ్రీసరస్వతీ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనపరిచిన విద్యార్థులతో శ్రీసరస్వతీ విద్యాసంస్థల చైర్మన్ రమణారెడ్డి

తాళ్లూరు, ఏప్రిల్ 21: మధ్యప్రదేశ్‌లో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగిన ఇండియన్ 7ఏ సైడ్ ఫుట్‌బాల్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీసరస్వతి హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. హైస్కూల్‌కు చెందిన చైతన్య, మదన్‌మోహన్, రామాంజనేయులు, అభిలాష్, నాగరాజు, మనోహర్, శ్రీనాథ్‌లు పాల్గొన్నారు. వీరిలో చైతన్య అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. మే నెలలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో చైతన్య పాల్గొననున్నట్లు శ్రీసరస్వతీ విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో అరాచక పాలన

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 21: ఐదేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన సాగిందని బీజేపీ కనిగిరి నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలే కూటమి అభ్యర్థుల గెలుపునకు నాంది అవుతుందని చెప్పారు. సీఎస్‌పురంలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనపై అన్నివర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇండ్ల వెంకటసత్యం, ఎమినిరెడ్డి కొండారెడ్డి, ఎలమందల వెలుగొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

పామూరు, ఏప్రిల్ 21: పామూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఇందులోభాగంగా టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు పందిటి హరీష్ సహకారంతో ఆదివారం పాబోలు జ్యూయలరి సెంటర్‌లో సుమారు 500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు.

ఈసందర్భంగా హరీష్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు వాసవీ క్లబ్ తరుపున మజ్జిగ పంపిణి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సోమిశెట్టి శ్రీనివాసులు, సోల్లెటి లక్ష్మణ, పందిటి శ్రీనివాసులు, పానుగంటి చలపతి, గాధంశెట్టి సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై రాజీనామాల ఒత్తిడి?

» వైసీపీ సరికొత్త ఎత్తుగడలు

» ఎన్నికల్లో ఉపయోగించుకునేందుకు పన్నాగం

దర్శి, ఏప్రిల్ 21 : వలంటీర్ల రాజీనామాలకు అధికార పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎన్నికల్లో వాలంటీర్లను నేరుగా ఉపయోగించుకునేందుకు వీలులేకుండా ఎన్నికల కమిషన్ బ్రేక్ వేయటంతో కొత్త పథకం రచించారు. తాత్కాలికంగా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి ఎన్నికల ప్రచారం, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా వారిని ఉపయోగ పెట్టుకునేందుకు రాజీనామాలకు తెరలేపారు. అందులోభాగంగా దర్శి నగర పంచాయతీలోని నాల్గవ సచివాలయం పరిధిలోని 15మంది వలంటీర్లు జగనన్న సచివాలయ కమిటీ(జేఎస్‌సీ) ఇన్‌చార్జ్ ఈ.కోటిరెడ్డికి రాజీనా మాలు సమర్పించినట్లు సమాచారం. పట్టణంలోని వలంటీర్లందరనీ రెండు రోజుల్లో రాజీనామాలు చేయించేందుకు ఒత్తిడి తెస్తున్నారు.

తొలుత దర్శి పట్టణంలో వలంటీర్లతో రాజీనామాలు చేయించి అనంతరం గ్రామాల్లోని వారిచేత రాజీనామాలు చేయించేలా వైసీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. దర్శి పట్టణంలో 152మంది వలంటీర్లు, రూరల్ మండలంలో 261 మంది ఉన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలు వీరి ద్వారా అందించిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా వారిని అడ్డుపెట్టుకొని ప్రజలను ప్రభావితం చేసి ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం అధికార వైసీపీ చేస్తుంది.

ఇదిలాఉండగా వలంటీర్లు నిబంధనల ప్రకారం రాజీనామాలు ఎంపీడీవోకు అందజేయాలి. దర్శి నగర పంచాయతీలోని వలంటీర్లు కమిషనర్‌కు ఇవ్వాలి. అలాకాకుండా వైసీపీ జేఎస్‌సీ ఇన్‌చార్జ్‌లకు రాజీనామాలు ఇవ్వటంతో ఆంతర్యమేమిటో అర్థంకావటం లేదు. అందరిచేత రాజీనామాలు తీసుకొని ఒకేసారి అధికారులకు అందజేయాలనే ఉద్దేశంతో ఈవిధంగా చేస్తున్నట్లు సమాచారం. వలంటీర్ల రాజీనామాల విషయంపై ఎంపీడీవో హనుమంతరావును, నగర పంచాయితీ కమిషనర్ వై మహేశ్వరరావు ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఇప్పటివరకు తమకు రాజీనామ పత్రాలు అందలేదన్నారు. అధికార పార్టీ నాయకులకు రాజీనామాలు ఇచ్చారనే సమాచారం తమకు కూడా తెలిసిందని చెప్పారు. వారిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 22 ఏప్రిల్ 2024





చంద్రబాబు నుంచి బీఫారాలు అందుకున్న బాపట్ల జిల్లా నేతలు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవదర్మ, ఎం.ఎం కొండయ్య, ఏలూరి సాంబశివరావు, విజయకుమార్, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్

విజయీభవ

- బీ ఫారాలు అందజేసి ఆశీర్వచనాలు
- అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించిన చంద్రబాబు
- ఉండవల్లిలోని తన నివాసంలో బీఫారాల పంపిణీ
- ఇక 20 రోజులే.. అలసత్వం తగదని అధినేత దిశానిర్దేశం


8లో..

ఎన్నికల వేళా.. ఇసుక దోపిడీ



కొల్లిపర మండలం అన్నవరపు లంకలో ఇసుక తవ్వకాలు

- ఎన్నికల కోడ్ కొరడా ఝుళిపిస్తున్నా దడవని ఇసుక దొంగలు
- అన్నవరంలో ఎమ్మెల్యే బంధువుపైనే ఆరోపణలన్నీ
- ఏ అనుమతీ లేకపోయినా పగలు, రాత్రి ఇసుక దోపిడీ
- అన్నవరంలో దాడులు ఓకే... మరి పెదకొండూరులో?
- ఇక్కడ జీసీకేసీ ఉద్యోగినని చెప్పి అనధికార వ్యాపారం
- రోజుకు ఒక్కో రీచ్‌లో రూ.20 నుంచి రూ.30 లక్షల వ్యాపారం
- ఇదంతా ఎవరి జేబుల్లోకి?
- మైనింగ్ శాఖ వదిలేసింది... ఎట్టకేలకు పోలీసుల దాడులు



నదిలో ఇసుక తీయటంతో భారీగా ఏర్పడిన గుంతలు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఇసుక దందా ఆగడం లేదు. లక్షలాది రూపాయల విలువ చేసే ఇసుకను పెద్దయెత్తున యంత్రాలతో తవ్వి, గుట్టలు పోయడం, లారీలకు లోడు చేస్తున్నా.. రాత్రివేళల్లో గుట్టు చప్పుడు కాకుం డా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. వందలాది లారీలతో ఇసుకను పరిమితికి మించి తరలిస్తున్నారంటూ పెద్ద ఎత్తున విమ ర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో అధికారులు రీచ్‌ల వద్దకు వెళ్లి పరిశీలించి హెచ్చరికలు చేసినప్పటికీ ఫలితం లేకపో యింది. గతంలోనే అన్నీ మూసెయ్యా లని జాతీయ హరి త ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేస్తే, ఈ రీచ్‌లలో ఎట్లా తవ్వకాలు జరిగిపోతాయో? పైగా పగలు మాత్రమే కాకుండా రాత్రి కూడా తవ్వకుకు పో తుంటే అధికా రులు ఏం చేస్తున్నారనేది ప్రశ్న. ఆ అక్రమాలను నియంత్రించాల్సిన ఎస్ఈబీకి అంతా తెలిసినా, తెలియ నట్టు అటువైపు కూడా చూడ డం లేదు. ఎవరైనా లారీల యజమా నులు కేసులు రాస్తారేమో, బిల్లులు లేకుండా ఎట్లాగని ప్రశ్నిస్తే మాత్రం... ఏ అధికారీ మన రీచ్‌వైపు కన్నెత్తి కూడా చూడరని, గుమస్తా నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వరకు మామూళ్లు వెళ్లిపోతాయని చెబుతు న్నారంటే వీరికి అధికార, రాజకీయ అండదండలు ఏమేర ఉన్నాయనేది అర్థమవుతుంది.

కొల్లిపర, దుగ్గిరాల, ఏప్రిల్ 21: ఎన్నికల కోడ్ వచ్చినా అధికార దందాకు మాత్రం ఏ ఆటంకం లేదు. దీనికి తోడు మామూళ్ల మత్తు... ఈ రెండూ కలసి అధికారుల కళ్లు కప్పేస్తున్నాయి. ఒక్కో రీచ్‌లో రోజుకు 150 నుంచి 200కుపైగా లారీల ఇసుక తరలించేస్తూ రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఒక్క రోజులో వెన కేసేస్తున్నారంటే ఇంతకంటే మంచి వ్యాపారం ఏముంటుంది? అందుకే అధికార పార్టీ నేతల బంధువులు తమ అధికారాన్ని అండగా పెట్టు కుని కింది నుంచి, పై అధికారి వరకు మామూ ళ్లు ఇచ్చేస్తున్నామంటూ, ఇసుక దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా తెగబడుతున్నారు. కృష్ణానది కి మరోపక్కనున్న కృష్ణా జిల్లాలో ఒక్క రీచ్ కూడా లేకుండా అన్నీ మూసేశారు. కానీ గుం టూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మాత్రం అనధికార రీచ్‌లు యథేచ్ఛగా నడిచిపోతూనే ఉన్నాయి. వేటికీ అనుమతి లేదని, గతంలోనే అన్నీ మూసెయ్యాలని జాతీయ హరిత ట్రిబ్యు నల్ ఆదేశాలు జారీ చేస్తే, ఈ రీచ్‌లలో ఎట్లా తవ్వకాలు జరిగిపోతాయో? పైగా పగలు మా త్రమే కాకుండా రాత్రికూడా తవ్వకు పోతుంటే అధికారులు ఏం చేస్తున్నారనేది ప్రశ్న. ఆ అక్ర మాలను నియంత్రించాల్సిన ఎస్ఈబీకి అంతా తెలిసినా, తెలియనట్టు అటువైపు కూడా చూడ డం లేదు. తాజాగా గుంటూరు ఏఎస్పీ నచికేత్ షెల్‌కే నేరుగా అన్నవరం రీచ్‌పై దాడిచేసి 33 లారీలు, రెండు పొక్లెయిన్‌లను పట్టుకుని కేసు లు నమోదు చేశారు. ఈ రీచ్ గత కొన్ని సంవ త్సరాలుగా ఓ అధికార పార్టీ నేత బంధువు చేతిలో నడుస్తూనే ఉంది. అయితే ఆయన గుం టూరు నుంచి బయలుదేరిన సమాచారం తెలిసి పోలీసు, ఎస్ఈబీ శాఖల్లోని కొందరు కిందిస్థాయి సిబ్బంది సమాచారం చేరవేసేం దుకు శతవిధాలా ప్రయత్నించారు. ఆయన వారికి అందుబాటులో లేకపోవటం వల్లే అన్ని లారీలు దొరికి పోయాయని, లేకుంటే ఏఎస్పీ వెళ్లినా గతంలో దాడులు జరిపినప్పుడు ఎదుర నట్లే ఒక్క లారీకూడా దొరక్కుండా తిరిగి రావ లసి వచ్చేదనేది సమాచారం. ఇది అన్నవరం రీచ్‌లో నడుస్తున్న దందా పరిస్థితి అయితే, దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర మరో అనధికార దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడ పగలు బుసక లారీలు, రాత్రి ఇసు క తరలిపోతోంది. ఎన్నికల కోడ్ రాక ముందు ఈ తరహాలో నడిస్తే, కోడ్ వచ్చాక పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను తరలించేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తవ్వకాల అనుమతిని ప్రభుత్వం నుంచి తీసుకున్న జీసీకేసీ సంస్థలో ఉద్యోగినని చెప్పి ఒక వ్యక్తి ఈ దందాను నడుపుతుంటే, ఇతనికి గతంలో ఇసుక అనుమతులు పొందిన జె.పి సంస్థలో పనిచేసిన మరో ఇద్దరు ఇతనికి తోడై అక్రమ దందా నడిపేస్తున్నారనేది సమాచారం. ఇక్కడ స్థానికులు గతంలో లారీలను ప ట్టించినా తవ్వకాలు మాత్రం ఆగటంలేదు.

ఎన్నికల కోడ్ ఉన్నా అధికారంతో బరితెగించి..

కృష్ణాతీరంలో ఎక్కడ రీచ్ ఉన్నా ఒక్కో రీచ్ ఒక అధికార పార్టీ నేత కనుసన్నలలోనే నడి చింది. అయితే అవన్నీ మైనింగ్ శాఖ అనుమ తులిచ్చిన రీచ్‌లే. అయితే అన్నవరపులంక రీచ్ మాత్రం ఏ అనుమతులూ లేకుండా ఇప్పటి వరకు సాగిపోతూ వచ్చింది. అయితే తాజాగా ఓ ఏఎస్పీ స్థాయి అధికారి దాడి చేస్తేకానీ లారీ లను పట్టుకోలేని పరిస్థితి. అయితే ఈ దందా స్థానికంగా ఉన్న అధికారులందరికీ తెలిసిందే. నిన్నటి వరకు అధికారిక సిఫార్సులు ఒకటి యతే, ప్రస్తుతం అన్ని శాఖలకు మామూళ్లు అందించటమే కారణంగా చెబుతున్నారు. ఏది ఏమైనా 33 లారీలు, రెండు పొక్లెయిన్‌లు ఒకే సారి రీచ్‌లో దొరకటం ఈ మధ్యకాలంలో ఇదే పెద్ద దాడిగా చెబుతున్నారు. స్వాధీనం చేసు కున్న లారీలనన్నిటినీ కొల్లిపర తీసుకొచ్చి వేర్వే రు ప్రాంతాల్లో ఉంచారు. వీటిలో రెండు లారీలు ఇసుక లోడ్‌తో ఉంటే, మిగిలిన 31 లారీలు ఖాళీగా నదిలో బారులుతీరి ఉన్నవే. మరో రెం డు ఎక్స్‌కవేటర్‌లను పట్టుకున్నట్టు శుక్రవారమే కేసు నమోదుచేసి కోర్టుకు పెట్టామనేది పోలీ సుల మాట. అయితే ఈ రీచ్‌లో తవ్వకాలు నాలుగేళ్లుగా సాగుతుంటే, మధ్యలో బుసక వంటికోసం తాత్కాలిక అనుమతులు తీసుకో వటం, వాటిని అడ్డుపెట్టుకుని ఇసుక తవ్వకాలు జరిపటం పరిపాటిగా మారిందని చెబుతు న్నారు. ఇప్పుడు కూడా 33 లారీలను పట్టుకు న్నారు కానీ, ఈ రీచ్‌లో ఇసుక తవ్వకాల వెన కున్న పెద్దలుకానీ, నిర్వాహకులు ఎవరనేదా నిపై మాత్రం పోలీసులు పెదవి విప్పటమే లేదు. వాస్తవానికి లారీల యజమానులు తమ లారీలను రీచ్‌కు అనుమతి ఉందని చెప్పినచో టకే పంపుతారు. అయితే ఏ రీచ్‌లో అనుమతు లున్నాయనేది మైనింగ్ శాఖ ఎప్పటికప్పుడు గోప్యంగా ఉంచుతుండటంతో, నిజమైన అనుమ తులు ఎక్కడ ఉన్నాయో! వేటికి లేవో తెలియక లారీల యజమానులు ఇసుక కోసం రీచ్‌లకు పంపుతూనే ఉన్నారు. అయితే అక్కడ రీచ్ ఎవరు నడుపుతున్నారో? తవ్వకాలకు కారణమ యిన అక్రమార్కులు ఎవరనేది లారీల వారిని కానీ, స్థానికులను కానీ అడిగితే చెప్పేమాటే. కానీ ఆ దిశగా మాత్రం పోలీసులు ఒక్క అడు గు కూడా ముందుకు వేయకపోవటం విమర్శల కు తావిస్తోంది. గతంలోకూడా ఈపూరు-కొలా రు మధ్య ఇసుక లారీలను పోలీసులు పట్టు కుంటే, ఏ రీచ్‌లో తీసుకొచ్చింది? ఎంత చెల్లిం చిందీ అన్ని వివరాలు చెప్పి, వారిపై చర్యలు తీ సుకోకుండా మాపై దాడులేంటంటూ లారీలను ఆపేసి నిరసన తెలిపిన పరిస్థితి ఉంది. వా స్తవానికి అన్నవరపు లంక రీచ్‌లోనూ ఇదే పరి స్థితి ఉంది. లారీలను పట్టుకున్నారు సరే... ఆ రీచ్‌లో అసలు ఎంత ఇసుక తవ్వేశారు? ఏంత పరిమాణంలో తరలిపోతే, ప్రభుత్వ ఆదాయా నికి ఎంత నష్టం వచ్చిందనే దానిపై మైనింగ్ శాఖ వెంటనే రంగంలోకి దిగి రీచ్‌లో తనిఖీలు చెయ్యాల్సిఉంటే, నేటికీ ఆ శాఖ అధికారులు అది మా పనికాదన్నట్టు అడుగు కూడా రీచ్‌లో పెట్టలేదు. అంటే దీనివెనుక మామూళ్ల వ్యవ హారం పనిచేస్తుందా! లేక అధికారం అజమా యిషీ చేస్తుందా అనేది అర్థంకాని విషయం.



కొల్లిపర మండలం అన్నవరపు లంక ఇసుక రీచ్‌లో పట్టుకున్న 33 లారీలు

ఐదేళ్ల నుంచి ఆగని దోపిడి

తుళ్ళూరు: నిషేధిత రీచ్ అయినా ఐదేళ్ల నుంచి ఇసుక దందా నడుస్తోంది. ఎన్నికల కోడ్ వచ్చినా అధికార పార్టీ వారికి అధికారులు దాసోహం అంటు న్నారు. ఉద్దండ్రాయునిపాలెం ఇసుక రీచ్‌లో ఇప్పటికీ ఇసుక దోపిడి జరుగుతోంది. నిషేధిత రీచ్ అయినా దందా ఆగటం లేదు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు నిద్రపోతున్నట్టు నటి స్తున్నారు. కళ్ళ ఎదుట ఇసుక నిల్వలు భా రీగా కనబడుతున్నా చర్యలు తీసుకోవటం లేదు. కృష్ణానదిలో నుంచి ఇసుకను తోడి రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో అక్రమా ర్కులు నిల్వ ఉంచుతున్నారు. దానిని రాత్రి ళ్లు లారీలకు లోడు చేసి అమ్మేసుకుంటు న్నారు. ఎన్నికల కోడ్ రాక ముందు రేయిం బవళ్లు ఉద్దండ్రాయునిపాలెం నుంచి ఇసుక లారీలు తుళ్లూరు పోలీస్ స్టేషన్ మీదుగా వెళుతున్నా చర్యలు శూన్యం. పెద్ద ఎత్తున్న ఇసుక దందా వైసీపీ ప్రజా ప్రతినిధి ఒకరు చేశారు. ఆ ఒకరు ఎవరు అనేది అందరికి తెలిసిందే. అక్రమ కేసులు పెడతారేమోనని ఆఖరికి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ శ్రేణులు కూడా మిన్నకుండిపోయారు. ఈ ఐదేళ్లల్లో ఇసుక దందా మీద వందల కోట్లు సంపాదిం చారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా చర్య లు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.



రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో నిల్వ చేసిన అక్రమ ఇసుక



పెదకొండూరు వద్ద కరకట్టపై నిలిపివున్న లారీలు

పెదకొండూరు రీచ్‌లో ఇంటి దొంగల దోపిడీ

దుగ్గిరాల మండలం పెదకొండూరు రీచ్‌లో ఇంటి దొంగలు దోచుకుపోతున్నారు. రోజుకు 200కుపైగా లారీల ఇసుక తరలించుకుపోతున్నారు. దీనికి దగ్గర్లోని అన్నవరం రీచ్‌లో ఏఎస్పీ స్థాయి అధికారి దాడులుచేసి లారీలను పట్టుకున్నా, ఇక్కడ మాత్రం ఒక్క గంట కూడా ఇసుక తరలింపులు, తవ్వకాలు ఆపలేదు. పగ లు, రాత్రి అడ్డులేకుండా ఇసుక తవ్వకు పోతున్నారు. జె.పి సంస్థకు ఇసుక తవ్వకాల కాంట్రాక్ట్ ముగిశాక జీ.సి.కె.సి సంస్థకు ప్రభుత్వం ఇసుక తవ్వకాలు అప్పగిం చింది. అయితే తాజాగా గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలతో రీచ్ లకు అనుమతులు లేని పరిస్థితి. పెదకొండూరు రీచ్‌లో మాత్రం జీ.సి.కె.సి సంస్థలో ఉద్యోగినని చెప్పి పేరు మార్చుకుని మరీ దందా నడుపుతున్నాడని చెబుతు న్నారు. ప్రముఖ సినీ హీరోయిన్ ప్రణీత పేరుతో ఉండే అతను తన పేరు వెనుక రెడ్డి చేర్చుకుని తాను సంస్థ లో ఉద్యోగినని చెప్పి చెలామణి చేస్తున్నాడని చెబుతు న్నారు. ఇతనికి తోడు గతంలో జె.పి సంస్థలో ఉద్యోగు లుగా ఉంటూ దందా నడిపిన అనుభవం ఉన్న మరో ఇద్దరు కూడా చేరి పెదకొండూరులో దందాను నడుపు తున్నట్టు చెబుతున్నారు. కృష్ణా జిల్లాలో తవ్వకాలు నిలి పేయటం, ఇసుకకు డిమాండ్ పెరగటంతో 18 టన్నులు పొయ్యాల్సిన లారీలో 35 నుంచి 45 టన్నుల వరకు ఇసుక పోసి లారీకి రూ.6వేల నుంచి 8వేల వరకు తీసు కునేవారు. ప్రస్తుతం ఒక్క లారీ దర రీచ్‌లోనే రూ.14వేల నుంచి రూ.20వేల వరకు ఉందంటే వీరి దందా విలువ ఎంతనేది అర్థమవుతుంది. రోజుకు 200 లారీల ఇసుక తరలించటమంటే చాలా తేలికగా చెబు తున్నారు. ఒక్క రోజుకు వీటి విలువే రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉందనుకుంటే, ఈ మొత్తం ఎక్కడికి పోతుందనేది ప్రశ్నే. ఎవరైనా లారీల యజమా నులు కేసులు రాస్తారేమో, బిల్లులు లేకుండా ఎట్లాగని ప్రశ్నిస్తే మాత్రం... ఏ అధికారీ మన రీచ్‌వైపు కన్నెత్తి కూడా చూడరని, గుమస్తా నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వరకు మామూళ్లు వెళ్లిపోతాయని, మీరు బయపడాల్సిన పనిలేదని బహిరంగంగానే చెబుతున్నా రంటే వీరికి అధికార, రాజకీయ అండదండలు ఏమేర ఉన్నాయనేది అర్థమవుతుంది. గతంలో మూడు లారీలు పట్టిచ్చామని, వాటిని చిన్నపాటి ఫైన్‌తో వదిలేశారని, తర్వాత మేము అడ్డుకోబోతే పోలీసులు, అధికార పార్టీ నాయకులతో బెదిరింపులకు పాల్పడ్డారని, భయంతో మేముకూడా వదిలేశామని, పెదకొండూరు వాసులు చెబుతున్నారు. అసలే ఎన్నికల వేళ, అధికార పార్టీ అభ్యర్థులకూ ఖర్చులు ఉండటంతో రోజువారీ ఖర్చులు మేమే చూసుకుంటున్నామని చెప్పటం కొసమెరుపు.

నేడు, రేపు షర్మిల పర్యటన

అద్దంకిలో పీసీసీ చీఫ్ రోడ్ షో • రేపు కాంగ్రెస్‌లో చేరనున్న ఆమంచి

చీరాల, అద్దంకిటౌన్, ఏప్రిల్ 21: వైఎస్ షర్మిల.. నాడు జగనన్న వదిలిన బాణం. అదే బాణం.. అదే జగన్‌ను అధికార పీఠం నుంచి దింపేందుకు పీసీసీ చీఫ్‌గా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో ఆమె పర్యటించను న్నారు. షర్మిల పర్యటనపై రాజకీయ వర్గాల్లో, ఇటు సామాన్య ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఆమె ప్రసంగాలపై జోరుగా చర్చ సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలి హోదాలో వైఎస్ షర్మిల మంగళవారం చీరాల రానున్నారు. గత ఎన్నికల సమయంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా షర్మిల బస్సు యాత్ర చీరాల వచ్చి జగనన్న వదిలిన బాణాన్ని అంటూ అప్పటి చీరాల వైసీపీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌ను గెలిపించమని కోరుతూ ప్రచారం చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల క్రమంలో పీసీసీ చీఫ్‌గా అదే చీరాలలో షర్మిల అన్న జగన్‌రెడ్డిపై విమర్శల వర్షం కురి పించేందుకు రానున్నారు. రాజకీయ సంచలనాలకు కేంద్ర బిందువైన మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆమె సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి, బీఫారం అందుకుంటారని నేతలు తెలిపారు.

నేడు అద్దంకిలో పర్యటన

ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్ షర్మిల సోమవారం అద్దంకిలో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అద్దంకి అభ్యర్థి అడుసుమల్లి కిశోర్‌బాబు కోరారు. ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో షర్మిల పర్యటన వివరాలను ఆయన ప్రకటించారు. షర్మిల సోమవారం సాయం త్రం 7 గంటలకు పట్ట ణంలోకి వస్తారన్నారు. రామ్‌నగర్ జంక్షన్ నుంచి పాతబస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు రోడ్ షో జరుగుతుంద న్నారు. అనంతరం జరిగే కార్నర్ బహిరంగ సభలో షర్మిల మాట్లాడ తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధూళిపాళ్ల కల్యాణ చక్రవర్తి, పీసీసీ మాజీ జాయింట్ సెక్రటరి కోరే సురేం ద్రనాథ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్య క్షుడు బాలచంద్రుడునాయక్, డీసీసీ జనరల్ సెక్రటరి బీ శ్రీనివాస్‌యాదవ్, మండల అధ్య క్షుడు పీవీ సురేష్‌బాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లగండ్ల శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, మహిళ నాయకులు డీ రోజారాణి పాల్గొన్నారు.

రేపు చీరాలకు రాక

షర్మిల మంగళవారం చీరాల వస్తారని ఆమంచి కృష్ణమోహన్ చెప్పారు. పందిళ్లపల్లిలోని తన కార్యాల యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఆమంచి మాట్లాడుతూ ముందుగా షర్మిల తన ఇం టికి వస్తారన్నారు. ఆమె సమక్షంలో తాను, తన అనుయా యులు కాంగ్రెస్ పార్టీలో చేరతామన్నారు. అనంతరం చీరాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా షర్మిల నుంచి బీఫారం అందుకుం టానని చెప్పారు. అనంతరం ర్యాలీగా రామన్నపేట, వేటపాలెం, దేశాయిపేట, జాండ్రపేట, ముంతావారిసెంటర్ మీదగా గడియా ర స్తంభం సెంటర్ వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు. అక్కడ ప్రజలనుద్దేశించి షర్మిల ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం ఆర్వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తన అనుయాయులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమంచి కోరారు.



మాట్లాడుతున్న కిశోర్‌బాబు

హామీ ఇస్తే.. అంతే?

- అటకెక్కిన జగనన్న హామీలు
- కలగానే ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం
- మూడేళ్లుగా పునాదుల్లోనే వైద్య కళాశాల, ఆస్పత్రి
- ప్రకటనల్లోనే అంతర్గత రోడ్లు, సమ్మర్‌స్టోరేజి ట్యాంకు
- నమ్మించి సీఎం మోసం చేశారంటున్న బాపట్ల వాసులు

బాపట్ల, ఏప్రిల్ 21: జగన్.. మాట తప్పరు.. మడుమ తిప్పరు.. అన్న మాటలు నీటి మూటలుగానే మిగి లాయి. బహిరంగ సభలు పెట్టి ప్రజల సమక్షంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ముఖ్యమంత్రి జగన్ పూర్తిగా విఫలమయ్యారు. ఏళ్ల గడుస్తున్నా సీఎం హోదాలో స్వయంగా జగన్ ఇచ్చిన హామీలకు అతీగతీ లేదు. దీంతో జగన్ హామీ ఇచ్చాడంటే చేయడంటే అనే భావన ప్రజల్లో నెల కొంది. బాపట్ల జిల్లా అవిర్భావం తర్వాత 2022 ఆగస్టు 11న తొలిసారిగా ముఖ్య మంత్రి జగన్ బాపట్ల వచ్చారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పా టు చేసిన బహిరంగ సభలో బాపట్ల అభివృద్ధికి ఎన్నో హామీలు ఇచ్చారు. అయితే వాటికి సంబంధించి ఒక్క హామీ కూడా నెరవేరిన దాఖలాలు లేవు. బాపట్ల నియోజకవర్గ అభివృ ద్ధికి ప్రకటించిన హామీలన్నీ అట కెక్కాయి. ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపో యారు.

- 2021 మేలో బాపట్లలో వైద్య కళాశాలకు వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. కళాశాలకి దాతలు 55 ఎకరాల భూమిని ఇచ్చారు. రూ.505 కోట్లు కేటాయించినట్లు ప్రకటించి పనులు ప్రారంభించారు. 2023 నాటికి భవనాల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ప్రకటిం చారు. కళాశాలతోపాటు ఆస్పత్రిని పూర్తి చేసి అడ్మిషన్లు ప్రారంభిస్తామని గొప్పలు చెప్పారు. అయితే 2024 నాటికి కూడా ఆ గొప్పలు అమలయ్యే పరిస్థితి కానరావడంలేదు. మూడేళ్లుగా కళాశాల భవనాలు పునాదుల దశలోనే ఉన్నాయి. నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకేస్తే నాలుగు అడుగులు వెనక్కు వెళ్తున్నాయి.
- బాపట్లలో 50 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ కలెక్ట రేట్ నిర్మాణం చేస్తామని సీఎం జగన్ ప్రకటించా రు. అయితే నేటికి దాని ఊసే లేదు.
- బాపట్ల పట్ట ణంలోని అంతర్గ తరోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు ని ధులు మంజూరు చేస్తామని ప్రక టించారు. అయితే నేటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు.
- పట్టణ జనాభా నీటి అవసరాలకు సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ సామర్థ్యం చాలడంలేదని మరొక ట్యాంక్ నిర్మాణా నికి రూ.18 కోట్లు ఇస్తామని జగన్ ప్రకటించారు. అయితే ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తప్పడంలేదు.



విద్యానగర్‌లో విస్తరించిన రోడ్డు నిర్మించకుండా వదిలేసిన దృశ్యం



బాపట్లలో పునాదుల దశలో ఉన్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

కార్పొరేట్‌కు దీటుగా పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రి

- గత టీడీపీ హయాంలో అభివృద్ధి
- ఎమ్మెల్యే ఏలూరి చొరవతో రూ.5కోట్ల నిధులు
- అన్ని వసతులతో అందుబాటులోకి వైద్యసేవలు


కార్పొరేట్‌ను తలపిస్తున్న పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రి


రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి


రోగులకు సేవలందిస్తున్న డాక్టర్ సౌమ్య

పర్చూరు, ఏప్రిల్ 21 : ఓ పక్క వసతులు, మరో పక్క వైద్యులు లేక కునారిల్లిన పర్చూరు ప్రభుత్వ వైద్యశాల నేడు సకల వసతులతో కార్పొరేట్ హాస్పిటల్‌గా రూపుదిద్దుకుంది. ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కూడా లేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆసుపత్రివైపు ప్రజలు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. కొద్దిపాటి అనారోగ్య సమస్య వచ్చినా పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. దీంతో నిరుపేద రోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. పర్చూరు వైద్యశాల దుస్థితిని, రోగుల ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంటనే స్పందించారు. యుద్ధప్రాతిపదికన ఆసుపత్రిని అభివృద్ధి చేశారు. పేదలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వైద్యశాల స్థితిగతులను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం అప్పటి వైద్య ఆరోగ్య మంత్రి కామినేని శ్రీనివాసరావును పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆసుపత్రిని చూసిన కామినేనికి ఎమ్మెల్యే ఏలూరి సమస్యలను వివరించారు. ఏలూరి ప్రత్యేక చొరవతో రూ.5కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రి సకల వసతులతో రోగులకు అందుబాటులోకి వచ్చింది.

నిత్యం వందల సంఖ్యలో రోగులు

గతంలో పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు రావాలంటేనే భయపడేవారు. ఏలూరి చొరవతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో రోజూ వందల సంఖ్యలో రోగులు వచ్చి సేవలను వినియోగించుకుంటున్నారు.

కుటుంబ నియంత్రణకు నోచుకోని చోట శస్త్ర చికిత్సలు

గతంలో కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేక కుంటుంబ నియంత్రణ ఆపరేషన్‌లకు కూడా నోచుకోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం గర్భిణులకు శస్త్ర చికిత్సలు సైతం నిర్వహిస్తున్నారు. ఏలూరి కృషిని రోగులు అభినందిస్తున్నారు.

అందుబాటులోకి మార్చురీ

గతంలో ప్రమాదాలు జరిగి మరణిస్తే పోస్టుమార్టం కోసం చీరాల తరలించాల్సి వచ్చేది. దీంతో వ్యయ భారంతో, సమయంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. రోజుల తరబడి కుటుంబ సభ్యులు నిరీక్షించాల్సి వచ్చేది. వైద్యశాల అభివృద్ధితోపాటు మార్చురీని కూడా పర్చూరు వైద్యశాలలో అందుబాటులోకి తెచ్చారు.

పర్చూరు ప్రజలకు బహిరంగ విన్నపం

మీ రుణం తీర్చుకోలేను.. నన్ను క్షమించండి



గౌరవనీయులైన పర్చూరు నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు నమస్కారాలు. నాతండ్రి గొట్టిపాటి నరసింహారావు మరణానంతరం నాకు జగన్‌గారు పర్చూరు ఇన్‌చార్జిగా ప్రకటించినప్పటి నుంచి నా ప్రయాణం మీతోనే సాగింది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో నేను ఓడిపోయాను. ఆ తర్వాత 5 సంవత్సరాల పోరాటంలో నాతో ఎన్నో కేసులు, అవమానాలు పడ్డారు. నా సుఖాల్లో కంటే నా కష్టాల్లోనే నాకు తోడుగా నీడగా నిలిచారు. ఎన్ని జన్మలెత్తినా మీ రుణం తీర్చుకోలేను. ఇన్‌చార్జిల మార్పుల నేపథ్యంలో కొత్తవారితో సమన్వయ లోపం వల్ల కష్టపడే నాయకులకు, అసలైన వైసీపీ కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయాను. నన్ను క్షమించండి. 2014 ఎన్నికల్లో నా కష్టం. నా త్యాగం మీ అందరికీ తెలిసిందే. నా కష్టంలో నా అక్క గొట్టిపాటి లక్ష్మి నాకు తోడుగా నిలిచారు. నేను 150 ఎకరాలు అమ్మినా ఏంటి? ఎందుకు? అని అడగకుండా సంతకం పెట్టింది. ఇల్లు వాకిలీ తాకట్టు పెట్టినా నన్ను ఏనాడూ ప్రశ్నించలేదు. మెడికల్ క్యాంపు పెట్టడం కానీ, పర్చూరు కార్యకర్తలు ఎవరు వెళ్లినా నామ మాత్రపు ఫీజు తీసుకుని వైద్యం చేశారు. ఇప్పటి వరకు నా అక్క నన్ను ఏమీ అడగలేదు. కానీ ఇప్పుడు ఈ ఎన్నికల్లో నాకు తోడుగా నిలబడు అని అడిగింది. నా అక్కకి తోడుగా నిలబడడం నాధర్మంగా భావించి, దర్శికి వెళ్తున్నాను. జగనన్న నన్ను క్షమించండి. నాకు మీరు ఎంతో ప్రేమ, ఆప్యాయత చూపించారు. కానీ నా ధర్మం నేను నిర్వర్తించి, నావంతుగా నా అక్కకి తోడుగా ఉండాలని నిర్ణయించుకున్నాను.

- ఇట్లు మీ.. గొట్టిపాటి భరత్

సైకిలెక్కిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లా

- ఆయనతోపాటు నాగులపాలెంలో పలువురి చేరిక
- ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి
- అరాచక పాలనకు ఇక ముగింపు
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సాంబశివరావు


టీడీపీలో చేరిన గంగవరం ఎస్సీలు


సుభాష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 21: పర్చూరు తొలి ఎమ్మెల్యే కొల్లా రామయ్య తనయుడు జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లా సుభాష్ సైకిల్ ఎక్కారు. ఏలూరి క్యాంపు కార్యాలయంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలోకి చేరారు. సుభాష్‌కు ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సుభాష్‌తోపాటు గ్రామానికి పలువురు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర పరిస్థితి గాడిన పడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కలసి కట్టుగా పనిచేసి అరాచక వైసీపీని ఇంటికి సాగనంపాలని ఏలూరి వారికి పిలుపు నిచ్చారు. అలాగే పర్చూరు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన వైసీపీ శ్రేణులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

నాగులపాలెంలో..

కొల్లా సుభాష్‌తోపాటు, పలువురు పర్చూరు మండలానికి చెందిన వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వారిలో వైదన ఆదినారాయణ, పోట్రు వెంకటనారాయణ, షేక్ షుకూర్, మహ్మద్ ఫయాజ్, దాసరి శివనారాయణ, దాసరి ప్రశాంత్, కాల్వ హరిబాబు, దామచర్ల లింగేశ్వరరావు, పులిపాటి ఎలీషా, యాటగిరి శ్రీనివాసరావు, రావూరి నాగరాజు, రావూరి ఏడుకొండలు, పఠాన్ కాలేషా, జయంపూర్ రామయ్య దామచర్ల నాగరాజు, అమ్మా తిరుపతయ్య ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దూళిపల్లి వెంకటస్వామి, కొల్లా శ్రీనివాసరావు(ఫ్యాక్టరీ) ఉన్నారు.

వలపర్ల ద్వారకాపాడులో..

మార్టూరు మండలం వలపలర్ల ద్వారకాపాడుకు చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిలో దేవకొండ రామాంజనేయులు, దేవరకొండ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, దేవరకొండ ఏడుకొండలు, అంజయ్య, కార్తీక్, సూర్యనారాయణ, పాలపర్తి తిరుపతయ్య, పాలపర్తి సుబ్బారావు, దుర్గ, గోవింద్, ఆదినారాయణ, అంజయ్య వెంకట్రావు, వనపర్తి వెంకటకోటేశ్వరరావు ఉన్నారు.

మార్టూరులో..

మార్టూరు నుంచి వల్లెపు శ్రీనివాసరావు, ఉప్పు అంకమ్మ, పల్లపు సాంబశివరావు, పల్లపు వెంకటేశ్వర్లు, రామిశెట్టి అంజనేయులు, వేముల అంజనేయులు, వేముల రమేష్, తన్నీరు సాంబశివరావు, దేరంగుల వెంకట్రావు, గుంజి కొండలు, చిన్నకుర్రే మణికుమార్, కుంచాల పున్నారావు, కోవూరు అంకమ్మరావు, ధర్మవరపు గురవయ్య, కొప్పూరి కృష్ణారావు, కొప్పూరి లక్ష్మణ్, చిన్నకర్ల మోషే, దేరంగుల నాగేశ్వరరావు, వల్లపు బంగారు బాబు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

గంగవరంలో..

ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. వారిలో వలేరు వెంకటేశ్వర్లు, కవల జెమేష్, కవల కృష్ణ, బొనిగల చిట్టిబాబు, నూకతోటి వేణుబాబు, కొమరబత్తిన మరియమ్మ, కొమరబత్తిన శ్రీనివాసరావు, నూకతోటి ప్రసంగరావు, నూకతోటి నాగేశ్వరరావు, ఏసుదాసు, శ్యాంబాబు, కంచర్ల కాలేబు, ప్రభుదాసు, చావా గోపి, గంగవరపు పోలీష్ ఉన్నారు.

టీడీపీలో చేరిన గంగవరం ఎస్సీలు

ఇంకొల్లు : ఇంకొల్లు మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన ఎస్సీలు ఆదివారం టీడీపీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు ఆధ్వర్యంలో ఏలూరి సాంబశివరావు సమక్షంలో చేరగా వారికి కండువాలు వేసి ఏలూరి ఆహ్వానించారు. వలేరు వెంకటేశ్వర్లు, కొణిగల చిట్టిబాబు, నూకతోటి ప్రసంగిరావు, వేణు, నాగేశ్వరరావు, ఏసుదాసు, చావా గోపీ, కవల కృష్ణ, కంచర్ల కాలేబు, ప్రభుదాసు, కవల జేమ్స్, లుధియా, శ్రీనివాసరావు, శ్యాంబాబు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కరి వీరాంజనేయులు, వీరగంధం అంజనేయులు, నాగేంద్రమ్మ, మాజీ సర్పంచ్ ఆడె విజయలక్ష్మి, భవనం విద్యాసాగర్‌రెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

టీడీలో చేరిన సొసైటీ అధ్యక్షుడు పోపూరి

సైకిల్ ఎక్కిన వలపర్ల, జాగర్లమూడి, మార్టూరు, బొల్లాపల్లి వాసులు

పర్చూరు, ఏప్రిల్ 21: తెలుగుదేశం పార్టీలోకి వలసల జోరు కొనసాగుతూనే ఉంది. యద్దనపూడి మండలం పెద్ద జాగర్లమూడి, మార్టూరు, మండలం వలపర్ల, బొల్లాపల్లి, మార్టూరు హనుమంతురావు కాలనీకి చెందిన పలు కుటుంబాలు ఏలూరి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. బొల్లాపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నేత, సొసైటీ అధ్యక్షుడు పోపూరి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో పలువురు సైకిల్ ఎక్కారు. వారిలో వల్లపు సుబ్బారావు, రామాంజనేయులు, గోరంట్ల వెంకట్రావు, వల్లపు అంకారావు, వల్లపు అంకమ్మరావు, గోగులపాటి శ్రీనివాసరావు, కోవూరు వెంకట్రావు తదితరులు ఉన్నారు. అలాగే వలపర్లలో వైసీపీకి పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారిలో బూరగ శ్యామ్ కుమార్, పులిపాటి ధరమంత్రి, బూరుగ రవీంద్ర, బూరుగ లీలాంబరం, చిన్న యోహాను, అజయ్, మూకిరి ఆదాం, సునీల్ తదితరులు ఉన్నారు. పెద్ద జాగర్లమూడికి చెందిన షేక్ మస్తాన్‌వలి, షేక్ అన్వర్, షేక్ హజరాబి, షేక్ చిన్న నాగూర్, పెద్ద నాగూర్, షేక్.చీరాల బాజీ, సలాం, షేక్.మహకూర్ అలీ, షేక్.గౌస్, బాజీ తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మార్టూరు హనుమంతురావు కాలనీకి చెందిన షేక్ రహిమాన్ ఆధ్వర్యంలో గుంటూరు లక్ష్మీ, సువర్ణకుమారి, షేక్.మస్తాన్, బి.శివనాగమల్లేశ్వరి కుమారి, బీ అత్తర్, రాజమ్మ, సుబ్బాయమ్మ, ధనలక్ష్మి, షేక్.జిలానీ, సుబ్బారావు, అంజనాదేవి, అమీనా టీడీపీలో చేరారు. చేరినవారందరికీ ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా కూటమి అభ్యర్థుల విజయానికి శ్రమించాలని కోరారు.


సొసైటీ అధ్యక్షుడు పోపూరికి కండువా వేస్తున్న ఏలూరి


కొత్తపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కమల్‌కిషోర్

టీడీపీ కూటమితోనే వైసీపీ విధ్వంస పాలనకు విముక్తి

కొత్తపాలెం, గుంటుపల్లిలో బాబీ ఇంటింటి ప్రచారం

బల్లికురవ, ఏప్రిల్ 21 : వైసీపీ విధ్వంస, అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కావాలంటే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపాలెం, గుంటుపల్లి గ్రామాలలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబీ ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలు, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన జగన్‌రెడ్డికి మరో చాన్స్ ఇచ్చి ప్రజలు తప్పు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. జగన్‌రెడ్డి చేతగాని పాలనతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత కోల్పోయారన్నారు. దూరదృష్టి, పాలనాదక్షత ఉన్న చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకున్నప్పుడే అభివృద్ధి, మీ పిల్లలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, పేదల కష్టాలు తీరుతాయని అన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్‌ను, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బాబీ కోరారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం సేకరించిన భూములు, ప్రభుత్వ భవనాలు దేనికీ పనికిరాకుండా జగన్‌రెడ్డి నేలమట్టం చేశారన్నారు. చంద్రబాబుది అభివృద్ధి పాలనైతే.. జగన్‌రెడ్డిది విధ్వంస పాలన అని, ఇలాంటి వ్యక్తి ఎప్పటికీ రాజకీయాల్లోకి రాకుండా ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. బటన్ నొక్కి మోసం చేస్తున్న వైసీపీ పాలకులను ఇంటికి పంపేందుకు మీకూ బటన్ నొక్కే చాన్స్ వచ్చిందని, అందరూ విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవానలి కమల్‌కిషోర్ కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మలినేని గోవిందరావు, దూళిపాళ్ల వీరాంజనేయులు, చల్లగుండ్ల రాంబాబు, దూళిపాళ్ల పున్నారావు, మాలపాటి పోతురాజు, కట్టా రాఘవేంద్ర, ఏల్చూరి వీరాంజనేయులు, వెంకట్రావు, పుచ్చకాయల సుబ్బరామయ్య, ముక్కపాటి అంజయ్య, చల్లగుండ్ల భూరామయ్య, బండారు శేషయ్య, దూళిపాళ్ల హనుమంతురావు, మాదాల సాంబయ్య, పుచ్చకాయల వెంకట్రావు, పలు గ్రామాల నేతలు పాల్గొన్నారు.

వలపర్లలో కూటమి శ్రేణుల ప్రచారం


వలపర్లలో ప్రచారం చేస్తున్న శ్రేణులు

మార్టూరు, ఏప్రిల్ 21 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదివారం మండలంలోని వలపర్ల గ్రామంలో కూటమి పార్టీల నాయకుల, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆర్యవైశ్యులు ఉండే వీధిలో జరిగిన ప్రచారంలో సైకిల్ ఓటు వేసి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. మీరు వేసే ఓటు రాష్ట్ర భవిష్యత్‌పై ఆధారపడి ఉందన్నారు. ఒకసారి చేసిన తప్పుతో రాష్ట్రం నాశనమైందని, మరోసారి పొరపాటు జరగకుండా సుభిక్ష పాలన అందించే చంద్రబాబుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం పర్చూరులో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న ఏలూరికి మద్దతుగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య నాయకులు, మాజీ ఎంపీటీసీలు అర్వపల్లి శ్రీనివాసరావు, వంకాయల వెంకట సుబ్బారావు, మల్లికార్జున ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కంభం పాటి హనుమంతరావు, గుంటి వెంకటేశ్వర్లు, టీ అనిల్‌కుమార్, జనసేన అవినాష్, బీజేపీ నాయకులు హరగోపాల్ పాల్గొన్నారు.

వచ్చేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం


మిన్నెకల్లులో ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

సంతమాగులూరు, ఏప్రిల్ 2 : మరో 40 రోజుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చి అరాచక, విధ్వంస వైసీపీ పాలన నుంచి ప్రజలకు విముక్తిని కల్పిస్తుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ తెలిపారు. సంతమాగులూరు మండలం మిన్నెకల్లు గ్రామంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా గొట్టిపాటి హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సుపరిపాలన కోసం కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హర్షవర్ధన్ అన్నారు. జగన్ రెడ్డి అహంకారమే ఆయన రాజకీయ పతనానికి దారి తీసిందన్నారు. ఒక్క చాన్స్‌తో అధికారంలోకి వచ్చిన జగన్ దోపిడీ, దౌర్జన్యం, విధ్వంసాలతో రాష్ట్రాన్ని నామరూపాలు లేకుండా చేశారన్నారు. కనీసం రోడ్లు కూడా వేయలేని దౌర్భాగ్య స్థితికి తీసుకొచ్చారన్నారు. ఊళ్లంతా ఏకమై ఓటుతో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించి బంగాళఖాతంలో కలపాలన్నారు. ఐదేళ్లలో అభివృద్ధిని విస్మరించి సొంత మద్యం వ్యాపారంతో పేదలను, యువత జీవితాన్ని నాశనం చేశారన్నారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మోసగించారన్నారు. అన్ని ధరలు, కరెంట్ చార్జీలు, పన్నులతో పేదలను బాదేశారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తేల్రపోలు రమేష్, వాసిరెడ్డి, ఏడుకొండలు, చింతా రామారావు, శ్రీరామమూర్తి, కోటేశ్వరరావు, గురుయాదవ్, సుజాత, కృష్ణ, రామాంజి, మురళి, అంకమ్మరావు, బాషా, బాజీ మసూద్ హఫీస్ లాల్‌బుడే, మీరస, మస్తాన్‌వలి పాల్గొన్నారు.


డాక్టర్ పూర్ణచంద్‌ను సన్మానిస్తున్న శ్రీరామమూర్తి దంపతులు

ప్రాచీన కావ్యాలను కాపాడాల్సిన బాధ్యత రచయితలదే

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 : ప్రాచీన కావ్యాలను పునర్ మూల్యాంకనం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందని పురస్కార గ్రహీత, డాక్టర్ జీవీ పూర్ణచందు అన్నారు. ఆదివారం స్థానిక మారంవారి సేవా సదన్‌లో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కార సభ డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పూర్ణచందు మాట్లాడుతూ పంచతంత్రం కథలు రాసిన చిన్నయ సూరి అచ్చ తెనుగు పదాలను తన గ్రంథాలలో విరివిగా వాడారని, వాటి అర్థాలు తెలియక చాలా మంది ఆయన్ని అపార్థం చేసుకున్నారన్నారు. అందుకోసమే నేను ఆయన పదకోశం కోసం పరిశోధన చేస్తున్నానని తెలిపారు. అన్నమయ్య తన కావ్యాలలో అచ్చతెలుగు పదాలలలో ఆనాటి ఆహార ప్రదార్థాలను చొప్పించారన్నారు. మంచి కవి కావాలంటే మంచి గురువు, మంచి పుస్తకాలు వరంగా లభించాలన్నారు. వాటిని విస్తృతంగా చదివి, రాసి, వాటిలో అవసరమైన పదాలను జల్లెడపట్టి వేరుచేసి నాణ్యమైన కవిత్వాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా మిత్రమండలి సభ్యులు పలువురు పూర్ణచందు రచించిన పుస్తకాలను సభకు పరిచయం చేశారు. అనంతరం పూర్ణచందుకు పురస్కారాన్ని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజాలు అందజేయగా మిత్రమండలి సభ్యులు ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చప్పిడి వీరయ్య, వారణాసి రఘురామశర్మ, కేవీ పోలిరెడ్డి, డాక్టర్ యూ దేవపాలన, ఆర్‌వి రాఘవరావు, ఇలపావులూరి శేషతల్పసాయి, కొండాకావూరి కుమార్, వీరవల్లి రుద్రయ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు


కవాతు చేస్తున్న బలగాలు

పర్చూరు, ఏప్రిల్ 21 : శాంతి భద్రతలకు విఘాతం కల్గించేవారిపై చర్యలు తప్పవని ఎస్‌ఐ ఆర్.రమేష్ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోలీసు బలగాల ఆధ్వర్యంలో గ్రామంలో కవాతు నిర్వహించారు. పర్చూరు గ్రామంలోని ప్రధాన రహదారులతో పాటు, అంబేడ్కర్ నగర్, ఇందిర కాలనీ, ముస్లిం వీధుల్లో కవాతు నిర్వహించారు. ఎవరూ ఎలాంటి వివాదాలు, ఘర్షణలలో తలదూర్చవద్దన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నిలకను నిర్వహించటమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తుందన్నారు.

వైసీపీ పాలనలో స్థానిక సంస్థలు నాశనం

- మంచి నీటినీ ఇవ్వలేని దుస్థితి
- అధికారంలోకి రాగానే మున్సిపాలిటీలో వసతులు
- కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి


9వ వార్డులో ప్రచారం చేస్తున్న గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 21 : స్థానిక సంస్థలను వైసీపీ చేసిందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం అద్దంకి పట్టణంలో 9వ వార్డులో గొట్టిపాటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. వార్డులలోని సమస్యలను స్థానికులు రవికుమార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వార్డులలో మహిళలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. జగన్‌రెడ్డి పంచాయతీ, మున్సిపల్ నిధులు వేల కోట్లను లాక్కొన్నారని, కనీసం తాగునీటిని సక్రమంగా ఇవ్వలేకపోయారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు శాశ్వత మంచినీటి పథకాన్ని రూ.90కోట్ల మంజూరు చేశారని గుర్తు చేశారు. దానిని అరకొర పనులతో నిర్లక్ష్యంగా వదిలేసి పట్టణ ప్రజలను తాగునీటికి ఇబ్బందులు పడేలా చేశారన్నారు. కేవలం బటన్ నొక్కి పథకాలను అరకొరగా వర్తింపచేసి నిజమైన పేదలకు జగన్‌రెడ్డి అన్యాయం చేశారని గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులందరికీ పథకాలు వర్తింపచేస్తామన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి వసతులు కల్పిస్తామన్నారు. మున్సిపాలిటీ నివాసులను ఫైన్‌లు వేసి ట్యాక్స్ కట్టాలని వేధిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు పలకాలన్నారు. ఓటుతో జగన్‌రెడ్డిని శాశ్వతంగా ఇంటికి పంపాలని గొట్టిపాటి కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

విజయాన్నియ్యమ్మా గంగాభవానీ

ఇష్టదైవానికి కొండయ్య పూజలు


అమ్మవారి ముందు బీఫాం ఉంచి నమస్కరిస్తున్న కొండయ్య

చీరాల, ఏప్రిల్ 21 : కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, కేతనకొండ గ్రామ పరిధిలోని ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో వేంచేసిన తమ కుటుంబ ఇష్టదైవం వెల్లమ్మ సమేత గంగా భవానీదేవి ఆలయం వద్ద టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థిగా చీరాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు బీఫాంను కొండయ్య అందుకున్నారు. అనంతరం తమ ఇష్టదైవం వెల్లమ్మ సమేత గంగాభవానీ ఆలయంలో అమ్మవార్ల చెంత బీఫాంను ఉంచి కొండయ్య నమస్కరించారు. ఎలాంటి అవాంతరాలు కలగకుండా విజయాన్ని ఇవ్వమ్మా అని వేడుకున్నారు. ఎన్నికలలో గెలవాలని కోరుకున్నారు.

పలువురు టీడీపీలో చేరిక

మండల పరిధిలోని తోటవారిపాలెం, పాత చీరాల, కావూరివారిపాలెం, వాడరేవు తదితర గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఆదివారం టీడీపీ కార్యాలయంలో కొండయ్య కుమారుడు మహేంద్రనాథ్ సమక్షంలో టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థుల గెలుపుకు విశేషంగా కృషి చేయాలని మహేంద్రనాథ్ వారికి సూచించారు.

బోయినవారిపాలెంలో ప్రచారానికి విశేష స్పందన

మండలంలోని బోయినవారిపాలెం గ్రామం లో ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య శ్రేణులతో కలసి నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన వచ్చింది. దీంతో శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ తిరుగుతున్న క్రమంలో పలువురు మన కొండయ్య, మన కొండన్న అంటూ ఒకరికొకరు చెప్పుకుంటూ స్వాగతించడం కనిపించింది. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు దేవాలయ పునఃప్రతిష్ఠ

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 21 : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో సోమవారం శ్రీ గంగా పార్వతీ సమేత భోగ మల్లేశ్వర స్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 18వ తేదీ నుంచి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, వ్రతాలు, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం పునఃప్రతిష్ఠ కార్యక్రమం ముగిసిన తర్వాత భారీగా అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు విశేషంగా తరలిరావాలని వారు కోరారు.

కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు

పర్చూరు, ఏప్రిల్ 21 : కారు ఢీకొని ద్విచక్ర వాహనదారునికి తీవ్రగాయాలైన సంఘటన పాత మద్రాసు రోడ్డులోని పర్చూరు మండలం అడుసుమల్లి వద్ద శనివారం రాత్రి జరిగింది. చీరాల నుంచి గుంటూరు వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈప్రమాదంలో ద్విచవాహన దారునికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారు చీరాల రెవెన్యూ అధికారిదిగా తెలిసింది.



టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి బీఫాంలు అందుకుంటున్న అద్దంకి అభ్యర్థి గొట్టిపాటి, పర్చూరు అభ్యర్థి ఏలూరి, చీరాల అభ్యర్థి కొండయ్య

గొట్టిపాటి, ఏలూరి, కొండయ్యలకు బీఫాంలు అందజేసిన బాబు

అద్దంకిటౌన్ పర్చూరు, చీరాల , ఏప్రిల్ 21 : తెలుగుదేశంపార్టీ తరపున పోటీలో ఉన్న అద్దంకి, పర్చూరు, చీరాల అభ్యర్థులకు ఆదివారం పార్టీ అధినేత చంద్రబాబు బీఫాంలు అందజేశారు. అద్దంకి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పర్చూరు అభ్యర్థి ఏలూరి సాంబశివ రావు, చీరాల అభ్యర్థి ఎంఎం కొండయ్యలు చంద్రబాబు చేతుల మీదుగా బీఫాంలు అందుకున్నారు. అలాగే బాపట్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి టీ కృష్ణప్రసాద్ బీఫాం అందుకున్నారు. అలాగే ఈ సందర్భంగా బీఫాం అందుకున్న సభ్యులందరితో చంద్రబాబు ప్రతిజ్ఞ చేయించి, ప్రతి అభ్యర్థి ఈ ఎన్నికలల్లో గెలిచిరావాలని ఆశీ రదించారు.



జాతీయ రహదారిలోని చెట్ల కిం ద సేదతీరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యార్థుల తల్లిదండ్రులపై చిన్నచూపు..!

- ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతికి ప్రవేశ పరీక్ష
- కనీస వసతుల కల్పనలో విఫలం
- రోడ్ల వెంబడి చెట్ల కింద సేదతీరిన పేరెంట్స్

చీరాలటౌన్, ఏప్రిల్ 21 : చీరాల పరిధిలోని జాతీయ రహదారిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం 6వ తరగతి విద్యార్థినీవిద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. హాల్ టికెట్‌తో స్కూల్ వద్దకు 9 గంటలకే చేరుకోవాలని అధికారులు సూచించారు. దీంతో ఉదయానికే సెంటర్ వద్దకు గుంటూరు, పొన్నూరు, చిలకలూరిపేట, పర్చూరు, చినగంజాం, వేటపాలెం వంటి ప్రాంతాల నుంచి 201 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. దూర ప్రాంతాల నుంచి పరీక్షకు చిన్నారులను తీసుకువచ్చిన తల్లిదండ్రులకు పాఠశాల సమీపంలో అధికారులు నిలువ నీడ కూడా ఏర్పాటు చేయలేదు. తాగు నీటి సౌకర్యం కల్పించలేదు. ఒకపక్క ఎండ మండిపోతుండడంతో చేసిది లేక రోడ్ల వెంట ఉన్న చెట్ల కింద సేదతీరాల్సిన దుస్థితి నెలకొంది. ఏపీ మోడల్ స్కూల్ అధికారుల చిన్నచూపుపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిలో ఎక్కడా చిన్నపాటి దుకాణాలు కూడా లేక, తాగునీరు లేక మలమల మాడారు. కనీసం ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు సుమారు 300 నుంచి 500 మీటర్ల దూరం నడచి వెళ్లి చిన్నచిన్న చెట్ల కింద కూర్చొని సేదతీరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కనీసం ఒక చిన్న షామియానా, తాగునీరు కూడా లేకుండా చేయడం అన్యాయమని ఆగ్రహించారు. పరీక్షకు 247 మందికి గాను 201 విద్యార్థులు హాజరయ్యారు.

పార్టీలతో పోలీసు వ్యవస్థకు సంబంధం లేదు

- తప్పుచేసిన వ్యక్తులెవరైనా సరే చర్యలు తీసుకుంటాం
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రసాద్



నిబంధనలను వివరిస్తున్న డీఎస్పీ ప్రసాద్

చీరాలటౌన్, ఏప్రిల్ 21 : చట్టం అందరికీ సమానమేనని, పార్టీలతో పోలీసు వ్యవస్థకు సంబంధం లేదని, తప్పుచేసిన వ్యక్తులెవరైనా సరే చర్యలు తప్పవని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ అన్నారు. ఎన్నికల నియమావళిని గుర్తు చేస్తూ ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందదర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో కొన్నిచోట్ల నామినేషన్ సమయంలో మైక్ పర్మిషన్ తీసుకుని డీజేలు వినియోగిస్తున్నట్లు వివరించారు. డీజేలు ఎన్నికల నియమావళికి పూర్తి విరుద్ధమన్నారు. నామినేషన్ ర్యాలీలలో ఫైర్ క్రాకర్స్ వినియోగించ రాదని హెచ్చరించారు. వాహన పరిమితి ఉందని చెప్పారు. నామినేషన్ ప్రక్రియలో 10 వాహనాలు మించరాదన్నారు. సంఖ్య పెరిగితే మరో 10 వాహనాలకు 100 మీటర్ల దూరం పాటించాలన్నారు. అంతేకాకుండా ఆయా పార్టీలకు సంబంధించిన జెండాలు నిర్దేశించిన కొలతను మించరాదన్నారు. ఈసీ నియమాలు అభ్యర్థులకు అందించినట్లు చెప్పారు. ప్రారంభ సమయంలో అందరూ నియమాలను నిశితంగా పరిశీలించుకోవాలన్నారు. భిన్నంగా వ్యవహరించిన వారిపై జిల్లాలో ఇప్పటికే కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అన్ని పార్టీలకు ఈ నియమాలు వర్తిస్తాయని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

నేడు ఎమ్మెల్యే ఏలూరి నామినేషన్

- భారీ ఏర్పాట్లు
- తరలిరావాలని కూటమి శ్రేణులకు సాంబశివరావు పిలుపు

పర్చూరు, ఏప్రిల్ 21 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరి సాంబశివ రావు సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. ఉదయం 9గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరుతారు. మధ్యాహ్నం 12.30కు పర్చూరు బొమ్మల సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో ఎమ్మెల్యే ఏలూరి ప్రసంగిస్తారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తారు.

నామినేషన్‌కు రూట్ మ్యాప్

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు 22వ తేదీ సోమవారం ఉదయం 9గంటలకు నామినేషన్ వేయనున్నారు. ఈ వేడుక కార్యక్రమానికి భారీ ర్యాలీగా క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరుతారు. మార్టూరు పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ అనంతరం గన్నవరం రోడ్డులోని వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజాలు చేస్తారు. అనంతరం దండుబ్రోవ మీదుగా యనమదల ఆంజనేయ విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తారు. యద్దనపూడి మీదుగా పెద్ద జాగర్లమూడి చెరువు కట్టవద్ద మహంకాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన పెద్దివారిపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తారు. సమీపంలోని చర్చిలో ప్రార్థనలు అనంతరం కొల్లావారిపాలెం మీదుగా పర్చూరు చేరుకుంటారు. పర్చూరు సాయిబాబా ఆలయంలో పూజలు చేసి మధ్యాహ్నం 12.30కి పర్చూరు బొమ్మల సెంటర్‌లో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

చీరాలటౌన్, ఏప్రిల్ 21 : రైలు ప్రమాదంలో గుర్తు తెలియని సుమారు 30-35 వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వేటపాలెం - చీరాల రైల్వే స్టేషన్ మధ్య జరిగింది. అందిన వివరాల ప్రకారం యువకుడు పట్టాలు దాటుతుండగా మృతిచెందినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. ఇటుక రాయి రంగుపై తెలుపు నలుపు గీతల చొక్కా, బులుగు రంగు జీన్స్ ఫ్యాంట్ ధరించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాలు తెలిసిన వారు 9440627646 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రలోభాలు.. బెదిరింపులు

వైసీపీ నేతల బరితెగింపు
ప్రతిపక్ష నేతలు, ఓటు బ్యాంకులు టార్గెట్
వారిని తమవైపు తిప్పుకునేందుకు అడ్డదారులు
ఇదేమని ప్రశ్నించిన వారిపై దాడులు
యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన
పట్టించుకోని అధికారులు

వైసీపీ ప్రభుత్వం సాగించిన ఐదేళ్ల ప్రజాకంఠక పాలనతో సీఎం జగన్‌రెడ్డి, ఆపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు తీవ్రప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారు. జనానికి చేసిన మేలును వివరించి ఓట్లు అభ్యర్థించలేని దుస్థితి వారికి దాపురించింది. దీంతో ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రలోభాలు, బెదిరింపులకు దిగుతున్నారు. మండలం, గ్రామాల వారీ టీడీపీలో ముఖ్యనాయకులను గుర్తించి వారిని లొంగదీసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వలంటీర్ల ద్వారా ఓటు బ్యాంకుల వివరాలను సేకరించుకుని వారికి గాలం వేస్తున్నారు. 'మీకు కొంత మొత్తం ఇస్తాం. ఎన్నికల్లో మాకు అనుకూలంగా పనిచేయండి' అని ప్రలోభపెడుతున్నారు. అందుకు ససేమిరా అన్న వారిని రకరకాలుగా బెదిరిస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యవహారం జిల్లావ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో నడుస్తోంది. అదేసమయంలో ఒంగోలులో ఇప్పటి వరకూ పార్టీనే నమ్ముకున్న వైసీపీ నేతలపైనే నిఘా ఏర్పాటు చేశారు. ఇది తమను అవమానించడమేనని కొందరు వాపోతున్నారు.



ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 21 : జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంలోనే వైసీపీ నేతలు బరితెగిస్తున్నారు. యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తు న్నారు. ఇప్పటికే ప్రలోభాల పర్వం ముమ్మరం చేసిన వారు ఇప్పుడు బెదిరింపు రాజకీయం ప్రారంభించారు. ఓటు బ్యాంకులుగా ఉండే ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలను, ఆయా సామాజికవర్గాల వారీ ముఖ్యులను టార్గెట్‌గా చేసుకొని వారిని తమవైపు తిప్పుకునేందుకు సామ,దాన,భేద దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. అందుకు లొంగని వారిని బెదిరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారాలను కట్టడి చేయాల్సిన ఎన్నికల అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఓటు బ్యాంకులపై గురి

గ్రామాల్లో టీడీపీకి చెందిన ముఖ్యనేతలు, ఇతరత్రా ఓటు బ్యాంకులుగా ఉన్న వారిపై వైసీపీ నేతలను దృష్టిసారించారు. వారిని తమవైపు తిప్పుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కొందరికి డబ్బులను ఎరగా చూపి వల విసురుతున్నారు. మరి కొందరు వివిధ రకాల ఆశలు చూపుతున్నారు. వ్యాపారులు, ఇతరత్రా ఆర్థిక వనరుల గురించి వివరించి మా మాట వినకపోతే మీ సంగతి చూస్తామంటూ హెచ్చరిస్తున్నారు. సొంత పార్టీకి చెందిన ఎవరైనా ప్రతిపక్ష పార్టీ వైపు చూస్తున్నారని తెలిస్తే వెంటనే వారికి ఫోన్ చేసి బుజ్జగిస్తున్నారు. తాయిలాలు ఆశ చూపుతు న్నారు. అప్పటికీ వినకపోతే బెదిరిస్తున్నారు. అదేసమయంలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తు న్నారు. దీన్ని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. కొద్దిరో జుల క్రితం ఒంగోలు సమతానగర్‌లో చోటుచే సుకున్న ఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రచారంలో వలంటీర్ పాల్గొడాన్ని ప్రశ్నించిన ఓ కుటుంబంపై వైసీపీ మూకలు దాష్టీకానికి దిగాయి. అక్కడికి వెళ్లిన టీడీపీ నేతలపైనా దాడులకు తెగబడ్డాయి. ఈ విషయంలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా వ్యవహరించినట్లు విమర్శలు వచ్చాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో బాధిత కుటుంబ పెద్ద అయిన కానిస్టేబుల్‌పైనే చర్యలు తీసుకొని తమ స్వామిభక్తిని చాటుకున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

విచ్చలవిడిగా తాయిలాల పంపిణీ

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వైసీపీ నాయకులు విచ్చలవిడిగా తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలుకు ముందే ఒంగోలు, కొండపిల్లో ప్రారంభమైన ఈ ప్రలోభా లపర్వం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా జోరందుకుంది. కొత్తపట్నం మండలంలో ఇంటింటికీ ఒక బస్తా బియ్యంతోపాటు రెండు కిలోల నూనె ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. కనిగిరి, సంతనూతలపాడు, మార్కాపురం, గిద్దలూరు, కొండపి నియోజకవర్గాల్లో నిత్యం ఇలాంటి వ్యవహారాలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల కులపెద్దలు, ఓటర్లపై ప్రభావం చూపగలిగిన వారు, ఇరత్రా ఓటు బ్యాంకులను గుర్తించి వారికి పెద్దమొత్తంలో డబ్బులు కూడా ఇస్తున్నారు. ఇకసొంత పార్టీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ముఖ్య నేతలకు కూడా పెద్దఎత్తున నగదు ముట్టజెప్పారు. మున్ముందు ఈ ప్రలోభాల పర్వం మరింత ముమ్మరం చేసేందుకు సిద్ధమయ్యారు.

మందుచూపు

నామినేషన్ల ప్రక్రియకు ముందే వైసీపీ నాయకులు పెద్దఎత్తున మద్యం నిల్వ చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ వైన్‌షాపుల నుంచే భారీగా తరలించినట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం దర్శి నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన నేతల ఇళ్లలో సుమారు రూ.20 లక్షల విలువైన మద్యం పట్టుబడటం ఇందుకు నిదర్శనం. మిగిలిన నియోజకవర్గాల్లోని గ్రామాలకు ఇప్పటికే మద్యం చేరినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలకు చెందిన నాయకులు పది మంది కలిసి ఒకచోటకు వెళితే వెంటనే రంగంలోకి దిగుతున్న ఎన్నికల అధికారులు, ఎలాంటి అనుమతులు లేకుండా భారీ సంఖ్యలో ప్రచారం, ప్రలోభాలకు గురిచేస్తున్నా వైసీపీ వారి వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



టీడీపీలోకి వరుస చేరికలతో వైసీపీలో అంతర్మథనం
డివిజన్‌లలో నేతల పనితీరుపై ఇన్‌చార్జిల నియామకం
వారితో రోజువారీ నివేదికలు
ఒంగోలులో పార్టీ కార్పొరేటర్లతో ముఖ్యనేత సమావేశం
కొత్తవారిని తేలేరు..
ఉన్నవారిని ఆపలేరంటూ అసహనం
మేయర్ డివిజన్‌పై రెడ్డి సామాజికవర్గానికి పెత్తనం
నియోజకవర్గంలోని ఇతర చోట్లా ఇదే పరిస్థితి

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 21 : ఒంగోలు నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలస జోరు కొనసాగుతోంది. దీంతో అధికార పార్టీ నేతలు అంతర్మథనంలో పడ్డారు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి బలంగా ఉంటారనుకున్న పలు వురు వైసీపీలో ఉండలేమంటూ తెగేసిచెప్తున్నారు. వివిధ కారణాలు చెప్పి టీడీపీలోకి క్యూకడు తున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు వైసీపీ ముఖ్యనేతలు సొంత పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇతర ముఖ్యుల కదలికలపై నిఘా ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆయా డివిజన్‌లు, మండల, గ్రామ స్థాయిలో ఇప్పటి వరకు పెత్తనం చేసిన వారిపైనే ఇన్‌చార్జిలుగా కొంతమందిని నియమించినట్లు తెలిసింది. నగర మేయర్ గంగాడ సుజాత ప్రాతినిథ్యం వహిస్తున్న చెరువుకొమ్ముపాలెం, వెంగముక్కలపాలెంలో డివిజన్ ఇన్‌చార్జి బాధ్యతలను కృష్ణారెడ్డి, అంజి రెడ్డిలకు అప్పగించారు. దీంతో కొద్దిరోజులుగా మేయర్ డివిజన్‌కు దూరమయ్యారు.

నమ్ముకున్న వారిపైనే నిఘా..!

వలసలను ఆపలేరు... కొత్తవారిని తేలేరు

ఒంగోలు నియోజకవర్గంలో టీడీపీ బలం రోజురోజుకూ మరింత పెరుగుతోంది. వైసీపీ నుంచి తెలుగుదేశంలో చేరేవారితో అధికార పార్టీకి భారీ షాక్‌లు తగులుతున్నాయి. దీంతో అధికార పార్టీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. ఈనేపథ్యంలో ఈనెల 17న వైసీపీ ముఖ్య నేతఆపార్టీ కార్పొరేటర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కార్పొరేషన్ ఎన్నికల సమయంలో మీ గెలుపు కోసం ప్రతిపక్షాల వారిని సైతం పలుకరించి వ రీ కలుపుకుపోయారు. సార్వత్రిక ఎన్నికల్లో మా త్రం దూరంగా ఉంటూ ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు?' అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. వైసీపీ నుంచి టీడీపీలోకి వెళుతున్న వారిని ఎందుకు ఆపలేకపోతున్నారు? టీడీపీ నుంచి వైసీపీలోకి కొత్తగా నాయకులను ఎందుకు తీసుకురాలేకపోతున్నారు? అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

డివిజన్‌లపై ఇన్‌చార్జిలకు పెత్తనం

ఎన్నికల్లో ఓటమి భయం వైసీపీని వెంటా డుతోంది. దీంతో గెలుపు కోసం ఆపార్టీ నాయకు లు నానాఅగచాట్లు పడుతున్నారు. కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులపై అదనంగా ఇన్‌చార్జిలను నియమించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇన్‌చార్జిలు ప్రతిరోజూ డివిజన్‌లలో పర్యటించి కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుడి పనితీరుతోపాటు, లోటుపాట్లు, గెలుపు అవకాశాల గురించి నివేదిక అందించాల్సి ఉంది. ఈప్రక్రియ వారం రోజులుగా ఊపందుకొంది. పలు డివిజన్‌లలో అధికార పార్టీ కార్పొరేటర్లు, నేతల పనితీరుపై ప్రజల్లో విమర్శలు ఉన్నాయని ఇన్‌చార్జిలు నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో డివిజన్‌ల వారీ ఎదురవుతున్న సమస్యలు, ఇతరత్రా అంశాలపై ముఖ్యనేతలు సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే మేయర్ గంగాడ సుజాతను ఆమె ప్రాతినిథ్యం వహిస్తున్న 18వ డివిజన్‌కు దూరంగా ఉంచినట్లు సమాచారం. నమ్ముకున్న పార్టీ శ్రేణులపైనే నిఘా పెంచి అనుమానించడంపై కొందరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

334 మద్యం బాటిళ్లు సీజ్

చీరాల, ఏప్రిల్ 21 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో ఎస్‌ఈబీ సీఐ కర్ణ నేతృత్వంలో సిబ్బంది ఎన్‌డీపీ (నాన్ డ్యూటీ పెయిడ్) లిక్కర్‌ను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. సీఐ కర్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈపురుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఓ ఆటోలో తరలిస్తున్న 334 క్వార్టర్ సీసాల అక్రమ మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులను, మద్యం తరలిస్తున్న ఆటోను ఎస్‌ఈబీ కార్యాలయానికి తరలించారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన సీఐ చెప్పారు.

గెలుపే లక్ష్యం

- టీడీపీ అధినేత చంద్రబాబు
- పార్టీ అభ్యర్థులకు ఉండవల్లిలో బీఫాంలు

ఒంగోలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికలకు మరో ఇరవై రోజులు మాత్రమే సమయం ఉన్నందున పార్టీ నుంచి పోటీచేస్తున్న ప్రతి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు అధికార మార్పిడి కోసం కాకుండా రాష్ట్ర పురోభివృద్ధికి అత్యంత కీలకమైనవని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థులంతా ఎమ్మెల్యేలుగా గెలిచి వచ్చి అందులో భాగస్వామ్యం కావాలని సూచించారు. అలాగే ఎంపీ అభ్యర్థులంతా విజయం సాధించి పార్లమెంట్‌లో రాష్ట్రం కోసం గళం విప్పాలన్నారు. వచ్చేనెల 13న జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు జిల్లాలో టీడీపీ తరపున పోటీచేస్తున్న అభ్యర్థులను ఇది వరకే ప్రకటించిన చంద్రబాబు.. వారికి ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో బీఫాంలను అందజేశారు. జిల్లా నుంచి ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థులు దామచర్ల జనార్దన్ (ఒంగోలు), డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి (కొండపి), బీఎన్ విజయ్‌కుమార్ (సంతనూతలపాడు), డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి (కనిగిరి), డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి (దర్శి), ఎం.అశోక్‌రెడ్డి (గిద్దలూరు), కందుల నారాయణరెడ్డి (మార్కాపురం), గుడూరి ఎరిక్షన్‌బాబు (వైపాలెం)లు అధినేత చంద్రబాబు నుంచి బీఫాంలను అందుకున్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో చంద్రబాబు ప్రత్యేకంగా గ్రూపు ఫొటోలు దిగి వారిని మరింత ఉత్సాహపరిచారు. ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి గెలిచి తీరాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసిన ఆయన అందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా వివరించారు. ప్రత్యేకించి రాక్షసుడు వంటి జగన్‌తో జరుగుతున్న యుద్ధం, రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఎక్కడా లోటుపాట్లు లేకుండా వ్యవహరించాలని ఉద్బోధించారు.

ప్రేమ కలిపింది..!

జపాన్ అమ్మాయి ఆంధ్రా అబ్బాయి
మేదరమెట్లలో పెళ్లిసందడి

మేదరమెట్ల, ఏప్రిల్ 21 : కులాలు, మతాలు, జిల్లా, రాష్ట్రాలు, దేశాలు ప్రేమకు ఏవీ అడ్డు కాదని నిరూపించారు ఆ జంట. ఎక్కడో జపాన్‌లో పుట్టిన అమ్మాయి ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా మేదరమెట్లకు చెందిన యువకుడిని ప్రేమించి పెళ్లాడింది. వరుడు తల్లిదండ్రులు ప్రేమ వివాహానికి అంగీకరించడంతో హిందూ సంప్రదాయం ప్రకారం మేదరమెట్లలో పెళ్లిసందడిగా జరిగింది. సంప్రదాయ వస్త్రధారణ, తెలుగు పద్ధతులు పాటించి ఆ జంట ఒక్కటయ్యారు. ఇంజనీరింగ్ చదివి జపాన్‌లో ఉద్యోగం రావడంతో జపనీస్ బాష నేర్చుకుని ఐదేళ్లుగా ఐటీ కన్సల్టెంట్‌గా మేదరమెట్లకు చెందిన ముప్పాళ్ల రాజా పనిచేస్తున్నారు. జపాన్ రాజధాని టోక్యోకి చెందిన షిహో కూడా ఐటీ కన్సల్టెంట్‌గానే పనిచేస్తున్నారు. మూడేళ్లుగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారు. భారతీయులు, వారి సంప్రదాయల పట్ల ఎంతో మక్కువ పెంచుకున్న షిహో హిందూ పద్ధతిలో పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. అందుకు అమ్మాయి తల్లిదండ్రులు, సోదరి మద్దతు తెలిపారు. టోక్యోలో వీరితోపాటు పనిచేస్తున్న స్నేహితులు ఆదివారం మేదరమెట్లలో వివాహ వేడుకకు హాజరయ్యారు. అందరూ హిందూ సంప్రదాయ దుస్తులతో పాల్గొనడం పెళ్లికి వచ్చిన వారిని ఆశ్చర్యపరిచింది. తెలుగు వారి ఆహార అలవాట్లు, పెళ్లి పద్ధతులను జపాన్ దేశస్థులు ఆసక్తిగా గమనించారు. వంటకాల పేర్లు అడిగి మరి రుచి చూసి మెచ్చుకున్నారు. బంధుమిత్రులు హాజరై ఆ జంటను ఆశీర్వదించారు.



వివాహబంధంతో ఒక్కటైన మేదరమెట్ల యువకుడు, టోక్యో యువతి

సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు మేలు / గొట్టిపాటి ఝాన్సీ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 21 : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు ఎంతో మేలు కలుగుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి సతీమణి గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. మండలంలోని జనకవరం గ్రామంలో ఆదివారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఝాన్సీ జనకవరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేది తెలుగుదేశం పార్టీనే అన్నారు. విద్య, ఉద్యోగాలలో మహిళలకు రిజర్వేషన్లు మొదలు స్వయం సహాయక సంఘాల ఏర్పాటు వరకు చంద్రబాబు ప్రాధాన్యతనిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలు, కరెంట్ చార్జీలతో పేదల బతుకుబండి సాగడం కష్టంగా మారిందన్నారు. అందుకోసమే ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500 సాయం అందించేందుకు చంద్రబాబు అద్భుతమైన పథకాలను రూపొందించారన్నారు. పేద మహిళలు ఆర్థికంగా బలపడాలంటే టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఝాన్సీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రెండోసారి మార్టూరు చెరువుకు చేరిన సాగర్ జలాలు

మార్టూరు, ఏప్రిల్ 21 : రెండోసారి మరలా సాగర్ జలాలు విడుదల చేయడంతో కోనంకి సబ్ డివిజన్ పరిధిలోని మార్టూరు గ్రామ పంచాయతీ మంచినీటి చెరువుకు సాగర్ జలాలు చేరుతున్నాయి. మంచినీటి చెరువులో నాలుగు మోటార్ల ద్వారా వేగంగా చెరువును నింపుతున్నారు. గత రెండు రోజుల నుంచి చెరువుకు నీళ్లు చేరుతున్నాయి. సాగర్ కాలువ నుంచి నీరు తక్కువగా రావడంతో యద్దనపూడి బ్రాంచి కెనాల్‌ను మూసివేశారు. నాలుగు రోజుల కిందట మొదటి దఫా పమిడిపాడు మేజర్‌కు నీరు విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం పమిడిపాడు మేజర్‌కు మాత్రమే నీటిని విడుదల చేశారు. ఆదివారం ఈ మేజరుకు 125 క్యూసెక్కుల నీరు వెళుతున్నట్లు ఎన్ఎస్‌పీ అధికారులు చెప్తున్నారు. రాజుపాలెం మేజరు గుండా వస్తున్న సాగర్ జలాలు మార్టూరు, ఇసుకదర్శి, కోనంకి, రాజుపాలెం చెరువులకు చేరుతున్నాయి. ఇదే విధంగా మరో నాలుగు రోజుల వరకు జలాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. తద్వారా మార్టూరు చెరువుకు చేరే నీటితో తాగునీటికి ఇబ్బంది ఉండదని పంచాయతీ అధికారులు తెలిపారు.



మార్టూరు చెరువుకు చేరుతున్న సాగర్ జలాలు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

సోమవారం 22 ఏప్రిల్ 2024



ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	41.6	39.0	42.0	42.0	38.0
కనిష్ఠం	32.6	27.0	26.0	25.0	28.0


డెల్టా, ఉత్తర కాలువకు నీటి సరఫరా పెంపు

అనంతసాగరం : సోమశిల నుంచి డెల్టా, ఉత్తర కాలువకు నీటి సరఫరా పెంచారు. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 8.456 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 15 క్యూసెక్కుల నుంచి 200, ఉత్తర కాలువకు 5 నుంచి 50 క్యూసెక్కులకు పెంచారు. ఇక దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎడాపెడా చార్జ్!

- నాలుగేళ్లలో కరెంటు వడ్డన రూ.808 కోట్లు
- యూనిట్ ధర పెంపుతో రూ.342 కోట్లు
- వ్యత్యాసపు ధర, ఎఫ్‌పీపీసీఏ చార్జీల రూపంలో రూ.466 కోట్లు
- జగన్ పాలనలో చార్జీల షాక్‌తో మూర్ఛిల్లిన ప్రజలు





ఉదయగిరి వెంకటేశ్వర్లుది వరికుంటపాడు మండలం. ఈయన ఇంట్లో నెలకు ఓ 200 యూనిట్ల కరెంటు వినియోగం జరుగుతుంది. 2019లో వెంకటేశ్వర్లుకు 600 నుంచి 700 రూపాయల మధ్యలో బిల్లు వచ్చేది. ఇప్పుడు కూడా అన్నే యూనిట్లు ఖర్చు చేస్తున్నాడు. కానీ బిల్లు మాత్రం రూ.1500 వరకు వస్తోంది.

నెల్లూరు నగరానికి చెందిన మొహమ్మద్ పీరు అనే మధ్య తరగతి కుటుంబీకుడి ఇంట్లో 300 యూనిట్ల కరెంటు వినియోగం జరుగుతోంది. 2019లో ఇతని కరెంటు బిల్లు నెలకు రూ.2100 వరకు వచ్చేది. ఇప్పుడు రూ.4వేలకు చేరుకుంది.

ఇవి ఉదాహరణలు మాత్రమే. జిల్లాలోని లక్షలాది మంది గృహ వినియోగదారుల బిల్లులన్నీ ఇలాగే పెరిగిపోయాయి. నాలుగేళ్లుగా ప్రజలు ఈ కరెంటు చార్జీల కాటుకు గురవుతూనే ఉన్నారు. ప్రతి నెలా కళ్లనీళ్లు కుక్కుకొంటూ వేలకు వేల రూపాయలు కరెంటు చార్జీల రూపంలో చెల్లిస్తునే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం గృహ వినియోగ విద్యుత్‌కు ఇవ్వాల్సిన రాయితీలను ఇవ్వకపోవడంతో విద్యుత్ శాఖ జనం మీద పడి బాదేస్తోంది. ఆ బాదుడు ఎంతలా ఉందంటే గడిచిన నాలుగేళ్లలో జిల్లా ప్రజలపై పడిన అదనపు భారం ఎంతంటే రమారమి రూ.808 కోట్ల పైమాటే. సంక్షేమం.. సంక్షేమం అంటూ అరుస్తూనే బటన్ నొక్కుడు ద్వారా ఇచ్చిన డబ్బును కరెంటు చార్జీల రూపంలో గుంజేసింది. 2019లో చార్జీలను, ఇప్పటి చార్జీల లెక్కలను ఒకసారి పోల్చిచూస్తే తెలియకనే జిల్లా ప్రజలు వందల కోట్ల రూపాయలను అదనంగా చెల్లించాల్సిన వచ్చిన దారుణం అవగతం అతువుంది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

● 800 కోట్ల వడ్డన!?

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడచిన నాలుగేళ్లలో పెరిగిన యూనిట్ ధరల రూపంలో సుమారుగా రూ.342కోట్లు, సర్‌చార్జీల రూపంలో 466 కోట్లు మొత్తం 808 కోట్ల రూపాయల అదనపు భారం జిల్లా గృహ విద్యుత్ వినియోగదారులపై పడింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయనడానికి ప్రధాన కారణం పెరిగిన యూనిట్ ధరతోపాటు అదనంగా పడిన సర్‌చార్జీలే. 2019 తరువాత యూనిట్‌పై 0.44పైసలు చార్జి పెరిగితే సర్‌చార్జీల రూపంలో 80 పైసలు పడింది. విశేషమేమంటే ఒక యూనిట్ ఆరంభపు ధర రూ.1.90 పైసలు అయితే ఆ యూనిట్‌పై అదనంగా వసూలు చేస్తున్న మొత్తం (పెరిగిన యూనిట్ ధర 0.44+ రెండు సర్‌చార్జీలు 0.80 కలిపి) రూ.1.22పైసలు. అంటే వాడుకున్న కరెంటు ఎంత బిల్లు వస్తోందో అందులో 70 శాతం మొత్తం సర్‌చార్జీలు, పెరిగిన యూనిట్ ధరల రూపంలో అదనంగా బిల్లులో కలుస్తోంది.

● 2019లో ఇలా..

2019-20లో యూనిట్ చార్జీల ధరలు ఇలా ఉండేవి. 50-100 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ.2.60 పైసలు, 101-200 వరకు రూ.3.60, 200-300 వరకు 6.90, 300 యూనిట్లు దాటితే రూ.7.75 చొప్పున వసూలు చేసేవారు. అంటే అప్పటి ధరల ప్రకారం అన్ని కేటగిరీలను కలుపుకుంటే సగటున యూనిట్ ధర రూ.5.21 పైసలుగా ఉండేది.

● 2020 నుంచి ఇలా..

కేవలం 30 యూనిట్లలోపు వినియోగించే గృహస్తులకు మాత్రం రేటు తగ్గించి రూ.1.90 పైసలుగా నిర్ణయించి అంతకన్నా ఎక్కువ వినియోగించే యూనిట్ల ధరలు అమాంతం పెంచేశారు. 31-75 కేటగిరీకి రూ.3.00, 76-125కు 4.50, 126-225కు రూ.6.00, 226-400లకు రూ.8.75, 400లకు పైబడితే రూ.9.75 పైసలుగా వసూలు చేస్తున్నారు. అన్ని క్యాటగిరిల సగటు తీసుకుంటే ఒక యూనిట్ ధర రూ. 5.65 పైసలు అవుతుంది. అంటే 2019-20వ తో పోల్చితే యూనిట్ మీద సగటున రూ.0.44 పైసలు పెరిగింది.



● ఈ వడ్డన.. అమ్మఒడి డబ్బంత!

అదనపు కరెంటు చార్జీల భారం ఎంతంటే.. వైసీపీ ప్రభుత్వం ఘనంగా చెప్పుకునే అమ్మఒడి డబ్బంత అని జనం అనుకొంటున్నారు. లెక్కలు కడితే ఇది నిజమనే అనిపిస్తోంది. అమ్మఒడి కింద ఇప్పటికి నాలుగు విడతలుగా నగదు పంపిణీ చేశారు. జిల్లాలో సుమారుగా 2లక్షల మంది లబ్ధిదారులకు ఏడాదికి 13వేలు చొప్పున ఏడాదికి 260 కోట్లు పంపిణీ చేశారు. ఇప్పటికి నాలుగు విడతల్లో రమారమి వెయ్యి కోట్లు పంపిణీ చేసారు. కానీ జిల్లా పరిధిలోని అమ్మలు అదనపు కరెంటు చార్జీల రూపంలో 800 కోట్లకుపైగా అదనంగా చెల్లించారు. ఇది చూస్తే ఈ జగన్ రూపాయి ఇచ్చి వంద లాకొంటున్నాడు అని ప్రతిపక్ష నేత చంద్రబాబు పదే పదే ప్రస్తావిస్తున్న విషయం వాస్తవమే కదా అని జనం అనుకొంటున్నారు.

● రూ.342 కోట్లు పిండేశారు

ఒక నెలకు జిల్లా గృహవినియోగానికి ఖర్చు చేసే కరెంటు 16కోట్ల 19లక్షల 72వేల యూనిట్లు. యూనిట్ మీద 0.44 పైసలుతో లెక్కిస్తే నెలకు పడిన అదనపు భారం రూ.7 కోట్ల 12 లక్షల 67వేలు. ఈ పెరిగిన చార్జీలు గత నాలుగేళ్లగా అమలులో ఉన్నాయి. అంటే 48 నెలల కాలం. నెలకు రూ.7.12 కోట్ల చొప్పున వినియోగదారులపై పెరిగిన యూనిట్ ధర రూపంలో పడిన అదనపు భారం రమార మి 342 కోట్ల రూపాయలు. ఇది అన్ని యూనిట్ల సగటు లెక్క మాత్రమే. అదే కేటగిరీల వారీగా తీసుకుంటే ఈ అదనపు భారంలో 80 శాతం మధ్య తరగతి కుటుంబాలపైనే. జిల్లా విని యోగదారుల్లో 126-225 యూనిట్ల మధ్య వినియోగించే సర్వీసులే 80 శాతం వరకు ఉంటాయి. అంటే యూనిట్ ధర పెంపు కారణంగా గత నాలుగేళ్లలో పడిన అదనపు భారం 342 కోట్లలో 80 శాతం మొత్తం మధ్యతరగతి కుటుంబాలపైనే పడిందని తెలుస్తోంది.

సర్‌చార్జీల రూపంలోనూ..

సాధారణంగా విషసర్పాలు, క్రూర మృగాల పేర్లు చెబితే గగుర్పాటుకు గురి కావడం సహజం. కానీ ఇప్పుడు జిల్లా ప్రజలు సర్‌చార్జీలు అనే పేరు వింటే అంతకన్నా ఎక్కువ కలవరపాటుకు గురవుతున్నా రు. కారణం ఈ సర్‌చార్జీల రూపంలో గడిచిన 36 నెలలుగా జిల్లా ప్రజలు 466 కోట్ల రూపాయలు విద్యుత్ శాఖకు బిల్లుల రూపంలో చెల్లించారు. ఖర్చు చేసిన కరెంటు చార్జీకి సమానంగా ఈ సర్‌చార్జీలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కరెంటు బిల్లులో రెండు సర్‌చార్జీలు వస్తున్నాయి. ఒకటి 2019కి పూర్వ విని యోగానికి సంబంధించిన వ్యత్యాసపు ధర, రెండవది పెరిగిన విద్యుత్ ఉత్పాదక వ్యత్యాసపు ధర (ఎఫ్‌పీపీసీఏ). ఒక్కో సర్‌చార్జిపైన రూ.0.40 పైసలు చొప్పున రెండు సర్‌చార్జీల రూపంలో ఒక యూనిట్‌పై అదనంగా 0.80 పైసలు వసూలు చేస్తున్నారు. జిల్లాలో ఇక నెల గృహవినియోగం 16.19 కోట్ల యూనిట్లు. ఒక్కో యూనిట్‌పై 80 పైసలు చొప్పున సర్‌చార్జీల రూపంలో నెలకు పడే అదనపు భారం రూ.12.95 కోట్లు. గత 36 నెలలుగా ఈ సర్‌చార్జీలు వసూలు చేస్తుండగా, ఇప్పటి వరకు రూ.466.47 కోట్లకుపైగా చెల్లించారు. ఎన్నికలు వచ్చాయి కాబట్టి సర్‌చార్జీలు ఆగిపోతాయనుకుంటే పొరబాటేనండోయ్. ఇంకా 12 నెలల కాలం ఈ సర్‌చార్జీల భారం తప్పదు. అంటే ఇంకా ఓ 156 కోట్ల రూపాయలు చెల్లించాలన్నమాట. సాధారణంగా ఈ వ్యత్యాసపు ధరలను విద్యుత్ శాఖకు ప్రభుత్వాలు చెల్లించాలి. అలా చెల్లించకపోవడ ంతో ఆ భారం ప్రజలపై పడిందనే వాదన బలంగా ఉంది.



మధ్య తరగతికి పిడుగులే

కలిగిరి: మధ్యతరగతి, సామాన్య కుటుంబీకులకు ప్రస్తుతం వచ్చే కరెంటు బిల్లులు పిడుగుల్లా కనిపిస్తున్నాయి. నా పేరు బొలిగర్ల మధు, ఓ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నాను. గతంలో రూ.200 నుంచి 300 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.800 వరకు వస్తోంది. ఈ వేసవిలో ఇంట్లో కాసేపు ఫ్యాన్, కూలర్ వేసుకుందామనుకుంటే ఎక్కడ రూ.2వేలు బిల్లు వస్తుందోనని భయపడి పోతున్నాం. ప్రభుత్వం మధ్య తరగతి ప్రజలపై కనికరం చూపి కరెంటు బిల్లులు తగ్గించాలని కోరుతున్నాం.

- బొలిగర్ల మధు, సిద్దనకొండూరు, కలిగిరి మండలం



ఇతని పేరు కోలమూరి శ్రీనివాసులు. బేల్దారి మేస్త్రీ. నెల్లూరురూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురంలో ఉంటున్న ఈయనకు కొన్ని నెలలుగా నెలవారి విద్యుత్ బిల్లు రూ. 1400-1500 వరకు వస్తోంది. గతేడాది ఇదే నెలలో రూ. 700-800 మాత్రమే వచ్చేది. రెండింతల బిల్లు ఎందుకు పెరిగిందో తెలియదు. గతేడాది ఏవైతే విద్యుత్ పరికరాలు ఉన్నాయో ఇప్పుడు అవే ఉన్నాయి. పెరిగిన బిల్లుపై అధికారులను అడిగితే అది అంతేనన్నారు. పైగా పెరిగిన బిల్లు కారణంగా అమ్మఒడి పథకానికి కూడా దూరమయ్యాం.



టెన్షన్

- నేడు పదో తరగతి ఫలితాల విడుదల
- జిల్లాలో 32,746 మంది ఎదురుచూపు
- ఫలితాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 21 : పదో తరగతి(టెన్త్) పబ్లిక్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఫలితాల కోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి పరీక్షలు రాసిన 16,709 మంది బాలురు, 15,987 మంది బాలికలు కలిపి మొత్తం 32,746 మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది పరీక్షలు పూర్తయిన వెంటనే వేగవం తంగా స్పాట్ వాల్యుయేషన్ చేపట్టి త్వరతగతిన ఫలితాలను విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తొలుత మే నెల మొదటివారంలో ఫలితాలు విడుదలవు తాయని అందరూ భావించినా పాఠశాల విద్యాశాఖ ముందుగా ఫలితా లను విడుదల చేస్తుండటంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది.

మార్కులే ప్రామాణికం కాదు..

పదోతరగతి ఫలితాలు విడుదలవుతున్న నేపథ్యంలో పరీక్షలు రాసిన విద్యార్థులు, తల్లిదం డ్రులు టెన్షన్‌కు గురవుతున్నారు. తాము ఊహించిన ఫలితం వస్తుందో.. లేదో అన్న ఆందోళన నెలకొంది. కానీ ఏ ఫలితం వచ్చినా, ఎన్ని మార్కులు వచ్చినా ఒత్తిడికి గురికాకూడదని, మా ర్కులే ప్రతిభకు కొలమానం, ప్రామాణికం కాదని, సంయమనమే ప్రధానమని నిపుణులు సూచిస్తున్నారు.

చంద్రబాబు సభకు ఎందుకెళ్లావ్!?

- టీడీపీ నాయకుడిపై వైసీపీ నేత దాడి



గాయపడిన పామంజి శ్రీరాములు

తొటపల్లిగూడూరు, ఏప్రిల్ 21 : 'చంద్రబాబు సభకు ఎందుకు వెళ్లావ్!?' అంటూ టీడీపీ నాయకుడిపై అధికార పార్టీకి చెందిన నాయకుడు దాడి చేశాడు. శనివారం పొదల కూరులో జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభకు కోడూరు పంచాయతీ వెంకటేశ్వపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు పామంజి శ్రీరాములు వెళ్లి రాత్రి స్వగ్రా మానికి చేరుకున్నాడు. వెంటనే అక్కడకు వచ్చిన వైసీపీ నాయకుడు పామంజి ఈశ్వరయ్య చంద్రబాబు సభకు ఎందుకెళ్లావ్ అంటూ అసభ్య పదజాలంతో దూషించాడు. ఆ తర్వాత సహనం కోల్పోయి విచక్షణ రహితంగా గొడ్డలితో శ్రీరాములుపై దాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న శ్రీరాములును బంధువులు ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లాడు. ఎస్ఐ జంపానికుమార్‌ను వివరణ కోరగా నిందితుడ ఈశ్వరయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మా ఊళ్లో వాళ్లదే పెత్తనం!

- మూడేళ్లలో ఎన్ని నిధులొచ్చాయో తెలియదు!
- బ్రాహ్మణపల్లి సర్పంచు పెద్దఓబులేశు



వైసీపీ నేతలు బలపరిస్తే మూడేళ్ల కిందట మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి సర్పంచ్‌నయ్యా. కానీ పేరుకే సర్పంచును. పెత్తనమంతా వారిదే. ఈ మూడేళ్ల నా గ్రామానికి ఎన్ని నిధులు వచ్చాయో నాకే తెలియదు. పంచాయతీ కార్యదర్శిని అడిగితే పైవాళ్లను అడగమంటున్నాడు. నా సంతకాలను ఫోర్జరీ చేసి నిధులు పక్కదారి పట్టించారు. అందుకే సమాచార హక్కు చట్టం కింద వివరాలకు దరఖాస్తు చేసుకున్నా."నని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి స్వగ్రామం బ్రాహ్మణపల్లి సర్పంచ్ పెద్దఓబులేశు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆత్మకూరు మండలం కరటంపాడులో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గూటూరు మురళీకన్నబాబు ఆధ్వర్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత సర్పంచ్‌నని వైసీపీ నేతలు నిర్లక్ష్యం చేసి పెత్తనం వారి చేతుల్లోకి తీసుకున్నారని వాపోయారు. తాను సొంతంగా చేసిన అభివృద్ధి పనులకు సైతం బిల్లులు పెట్టుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన చెందారు. గ్రామంలో చేపట్టాల్సి అభివృద్ధి పనుల విషయమై మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డిని అడిగితే మనవాళ్లు చూసుకుంటారులే.. అని సమాధానం ఇస్తున్నారని చెప్పారు. గ్రామంలో ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉత్సవ విగ్రహంలా తాను మిగిలిపోయినట్లు తెలిపారు. అందుకే తాను వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు.

- ఆత్మకూరు

కారుపై 'నిఘా నేత్రం'



కారుపై సీసీ కెమెరా అమర్చుతున్న సిబ్బంది

సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అన్ని చర్యలు చేప డుతోంది. అందులో భాగంగా ఎన్నడూలేని విధంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తమ వాహనాలకు సీసీ కెమెరాలు అమర్చుతున్నారు. 2 కెమెరాలు స్థానిక ఆర్వో కార్యాలయంతోపాటు నెల్లూరు, విజయవాడ కమాండ్ కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానం చేశారు. వాహనాల తనిఖీల్లో బృంద అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదనే ఉద్దేశంతో ఈ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 78 వాహనాలకు, ఉదయగిరి నియోజకవర్గంలో 9 వాహనాలకు ఈ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే చెక్‌పోస్టుల్లో సైతం సీసీ కెమెరాలను అమర్చుతున్నారు.

- ఉదయగిరి రూరల్

వీపీఆర్‌కు సొంత గ్రామస్థుల అభినందన



వీపీఆర్‌ను కలిసి అభినందనలు తెలిపిన ఇందుపూరు గ్రామస్థులు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 21: నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో ఆయన స్వగ్రామం అల్లూరు మండలం ఇందుపూరు గ్రామస్థులు ఆదివారం కలిశారు. నగరంలోని వీపీఆర్ నివాసంలో వేమిరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం వీపీఆర్ నామినేషన్ వేయనున్నారు. ఈ విషయం తెలుసుకుని ఇందుపూరు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆయన్ను కలిసి ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమిరెడ్డి మారుమూల గ్రామంలో పుట్టి పారిశ్రామిక వేత్తగా దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించడం తమకెంతో గర్వకారణమన్నారు. వేమిరెడ్డికి భారీ మెజారిటీ వచ్చేందుకు గ్రామగ్రామాన ప్రచారం చేస్తామని చెప్పారు.

నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటిపై ఫిర్యాదు

ఆత్మకూరు, ఏప్రిల్ 21 : నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ జి వెంకటరమణమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం మర్రిపాడు మండలంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో తనను కులం పేరుతో ప్రస్తావించడమేగాక అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కావున విచారణ జరిపి మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకుని, తనకు రక్షణ కల్పించాలని కోరారు.

'ఓటుకు రూ.10 వేలు ఇస్తారు.. పూటుగా మద్యం తాగించి లొంగదీసుకుంటారు.. అవసరమైతే బెదిరిస్తారు.. వారి మాయలో పడ్డారా మళ్లీ చీకటి రోజులే..' ఇదీ ప్రతిపక్షాలు ప్రజలకు చేస్తున్న హెచ్చరికలు. ఇందుకు తగ్గట్టుగానే అధికార పార్టీ నేతలు ఎన్నికల్లో విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఎక్కడికక్కడ ఛీప్ లిక్కర్‌ను డంప్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలంలోని పంటపాలెంలో సెబ్ అధికారులు భారీ మద్యం డంప్‌ను పట్టుకోవడం కలకలం రేగింది. అదీ వైసీపీ నాయకుడికి చెందిన రొయ్యల గుంతల వద్ద డంప్ చేయడం, అధికారులు దాడులకు వస్తున్నారని తెలిసి వైసీపీ నాయకుల కార్లలో మద్యం సీసాలు కలిగిన బస్తాలను మరోచోటకు తరలించే ప్రయత్నం చేయడం ప్రతిపక్షాల ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఈవిధంగా ఇంకెన్ని ప్రాంతాల్లో డంప్‌లు చేశారోనన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇంత భారీస్థాయిలో మద్యం రవాణా జరుగుతూ డంప్ చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ఛీప్ పాలిట్రిక్స్!

- ఎన్నికల్లో విజయం కోసం వైసీపీ అడ్డదారులు
- ఎక్కడికక్కడ ఛీప్ లిక్కర్ డంప్
- 'సర్వేపల్లి'లో 4,232 సీసాలు పట్టుకోవడంతో కలకలం
- సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు.. క్షణాల్లో అక్రమార్కులకు సమాచారం లీక్!
- కార్లలో మద్యం తరలించే యత్నం
- ఎవరా ఇంటిదొంగలు?

● ఆ మద్యం ఎక్కడిది!?

ఎలాగైనా మళ్లీ గెలవాలనే ఉద్దేశంతో వైసీపీ నాయకులు కొన్నిరోజులుగా ఎన్నికల్లో పంపిణీకి సరిపడా మద్యాన్ని డంప్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ మద్యం ఎక్కడి నుంచి వచ్చిందన్నదే అసలు ప్రశ్నగా మారుతోంది. సర్వేపల్లి నియోజకవర్గంలో పట్టుబడిన 4,232 మద్యం సీసాలు రాష్ట్రంలో తయారైనవేనని అధికారులు చెబుతున్నారు. మరి అంత పెద్ద మొత్తంలో మద్యం వైసీపీ నాయకుల చేతుల్లోకి ఎలా చేరిందన్న ప్రశ్న తలెత్తుతోంది. ఆ బాటిళ్లను స్కాన్ చేస్తే ఏ మద్యం దుకాణం నుంచి వెళ్లిందో అర్థమవుతుంది. మరి ఏ దుకాణం నుంచి తరలించకపోతే నేరుగా మద్యం తయారీ డిస్టిలరీ కేంద్రాల నుంచే తరలించారా.. అన్నది తేలాల్సి ఉంది. అయితే ఆ దిశగా అధికారులు విచారణ చేస్తున్నారా.. అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే ఇప్పటి వరకు జిల్లాలో వేల బాటిళ్ల మద్యం పట్టుకున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. మరి ఆ మద్యం ఎక్కడి నుంచి బయటకు అక్రమ మార్గంలో వెళ్లిందన్నది మాత్రం తేల్చలేదు.

● ముందుగా వారికెలా తెలిసింది?

పంటపాలెంలో భారీ మద్యం డంప్ ఉన్నట్లు సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు అందింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సీ విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను బయటకు చెప్పకూడదు. మూడో కంటికి తెలియకుండా నేరుగా దాడులు నిర్వహించాలి. కానీ అధికారులు దాడులు చేయడానికి వస్తున్నారన్న విషయం మద్యం దాచిపెట్టిన వారికి ముందుగానే తెలిసిపోయింది. అధికారులు స్పాట్‌కు వెళ్లే సరికి డంప్ చేసిన మద్యాన్ని మూడు వాహనాల్లో తరలించేందుకు సిద్ధమయ్యారు. ఒక వాహనాన్ని అక్కడే పట్టుకోగా మిగిలిన రెండు వాహనాలను మరికొంత దూరం వెళ్లాక పట్టుకున్నట్లు తెలిసింది. అధికారులు రాక ముందే మరికొంత మద్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా మరో చోటకు తరలించినట్లు స్థానికంగా చెప్పుకుంటు న్నారు. మరి అధికా రులు దాడులకు వస్తున్నా రన్న సమాచారం మద్యం డంప్ చేసిన వ్యక్తులకు ఎలా తెలిసిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సెబ్, పోలీసు సిబ్బందిలో ఎవరో ఒకరు ఈ పని చేసి ఉంటారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● గుబులు పుట్టిస్తున్న గతం

2014 ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల్లో తయారు చేసిన కల్తీ మద్యాన్ని లేబుళ్ల మార్చి పేదలకు పంచారు. ఆ మద్యం తాగి పలువురు పేదలు ప్రాణాలు వదలగా, మరికొంత మంది అసుపత్రుల పాలయ్యారు. ఆ ఘటనలను తలుచుకొని ప్రజలు భయపడిపోతున్నారు. నాటి కల్తీ మద్యం కేసుల్లో ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు నిందితులుగా ఉండడం గమనార్హం.

మద్యం కేసులో నలుగురి అరెస్టు

ముత్తుకూరు : పంటపాలెంలో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆధ్వర్యంలో శనివారం జరిగిన దాడుల్లో సెబ్, రెవెన్యూ, పోలీసుల సంయుక్త దాడుల్లో 1780 క్వార్టర్ బాటిళ్లు, 2452 వైట్ హాల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వైసీపీ నాయకులు మారు సుధాకర్‌రెడ్డి, లోకవరపు వెంకట నారాయణ, పుచ్చలపల్లి నాగేశ్వరరావు, చిలకా రాములను అరెస్టు చేసినట్లు చేసి, మూడు కార్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బస్తాలు, అరెస్టు చేసిన వారితో సెబ్ అధికారులు

కాకర్ల నామినేషన్‌కు తరలిరండి

కొండాపురం, ఏప్రిల్ 21: ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ సోమవారం నామినేషన్ వేస్తారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి రావాలని టీడీపీ లీగల్ సెల్ సభ్యుడు సందిరెడ్డి రామారావు, తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం వారు మండలంలో పర్యటించి మండల కన్వీనర్ ఎం ఓంకారం, పార్టీ పరిశీలకుడు పి సుబ్బారావు తదితరులతో చర్చించారు. మండలంలో కాకర్లకు 8 వేల ఓట్లకు పైగా మెజారిటీ తీసుకు రావాలని కోరారు.


కనుల పండువగా సీతారాముల కల్యాణం



కందుకూరు : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కందుకూరు, ఏప్రిల్ 21: పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో ఆదివారం ఆలయ అర్చకులు శ్రీరామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువలా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి తిలకించారు. రామనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగగా గాయకుడు రాయసం రమేష్ భక్తిగానామృతంతో భక్తులు తన్మయత్వం చెందారు. ఆలయ స్థల దాతలు మందలపు వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● విశ్వనాథరావుపేటలో



బిట్రగుంట : కల్యాణ వేదికపై కొలువుదీరిన సీతారాములు

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట రైల్వే లోకో రామాలయంలో శ్రీరామనవ మి ఉత్సవాల్లో భాగం ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆల యం అర్చకులు వేదగిరి నరేషాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పసుపులేటి తిరుపతయ్య, సూర్యకళ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పసుపులేటి చెంచయ్య, సుజాత దంపతులు అన్నసంతర్పన కార్యక్రమం చేశారు. సాయంత్ర స్వామి అమ్మవార్ల ఊయల సేవ కార్యక్రమాలు జరిగాయి.

మహీధరరెడ్డి జన్మదిన వేడుకలు

కందుకూరు, ఏప్రిల్ 21: కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం కందుకూరులో ఘనంగా నిర్వహించారు. కొండికందుకూరు సర్పంచు కుమ్మర బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహీధరరెడ్డి కార్యాలయంలో ఆయన అభిమానులు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు, కోవూరు రోడ్డులోని దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. సన్నారెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని బొగ్గులసంఘం, విప్పగుంట రోడ్డు ప్రాంతాలలో నివశిస్తున్న నిరుపేద కుటుంబాలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దండే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు..
బ్యాక్ బోన్ ఆఫ్ సొసైటీ : పసుపులేటి సుధాకర్

కావలిటౌన్, ఏప్రిల్ 21: బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్ బోన్ ఆఫ్ సొసైటీ అని పీఎస్సార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ అన్నారు. ఆదివారం ట్రంకురోడ్డు గాయత్రినగర్‌లోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తన అనుచరులు, అభిమానులతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను రాజకీయాలు, కులమతాలు, ప్రాంతాలకతీతంగా పీఎస్సార్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించానన్నారు. ఈ క్రమంలో కావలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు.

కలగా మిగిలిన డబుల్ రోడ్డు!

● ప్రతిపాదనల దశ దాటి పరిస్థితి
● లింగసముద్రం, వలేటివారిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానం
● సింగిల్ రోడ్డుపై వాహనచోదకుల ఇబ్బందులు

లింగసముద్రం, ఏప్రిల్ 21 : ప్రతి నిత్యం రద్దీగా ఉండే లింగసముద్రం-వలేటివారిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు డబుల్ రోడ్డుగా మార్చాలన్న ప్రతిపాదనలు ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ సింగిల్ రోడ్డుపై ప్రయాణానికి వాహనచోదకులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. 2018లో అప్పటి కందుకూరు ఆర్‌అండ్‌బీ కార్యాలయ అధికారులు 14 కి.మీ ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే నిధులు మంజూరయ్యేలోపు ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే 2018లోనే అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ గోతులమయమైన రోడ్డుపైనే పాదయాత్ర చేశారు. ఈ రోడ్డును ప్రత్యక్షంగా చూసినప్పటికీ ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు మాత్రం మంజూరు చేయలేదు. దీంతో ఈ రోడ్డుకు మోక్షం కలగలేదు. అయితే రెండేళ్ల క్రితం కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి ఈ రోడ్డును డబుల్ రోడ్డుతో పాటు మోడల్ సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు పంపించారు. కానీ అది కూడా కార్యరూపం దాల్చలేదు. ఈ రోడ్డుపై పెదపవని మీదుగా కావలికి, కలిగిరి మీదుగా నెల్లూరు, చెన్నైకి, అలాగే కలిగిరి వింజమూరు మీదుగా బెంగళూరుకు వెళుతుంటారు. అలాగే కొండాపురం, మొగిలిచెర్ల, శాయిపేట గ్రామాల నుంచి లింగసముద్రం మీదుగా ప్రతినిత్యం కందుకూరు, ఒంగోలుకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ రోడ్డును ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వాహనదారులు, ప్రజలు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.



డబుల్ రోడ్డుకు నోచుకోని లింగసముద్రం, వలేటివారిపాలెం రోడ్డు



నీరందక.. పైర్లు పండక..!

సోమశిల నీరు అందక ఎండిన వరిపైరు (ఫైల్)

● అల్లాడుతున్న ఆయకట్టు రైతులు
● సాగునీటి కాలువ డైవర్షన్ నిర్మాణానికి వైసీపీ మోకాలడ్డు
● బిల్లులు మంజూరు కాక ఆగిన పనులు
● కావలి, ఉదయగిరి ప్రాంత రైతులపై ప్రభుత్వం శీతకన్ను

జలదంకి, ఏప్రిల్ 21: ఈ ఏడాది రబీలో కావలి కాలువ ద్వారా సాగునీరందక కావలి, ఉదయగిరి ప్రాంతాల్లోని మాగాణి భూములు బీళ్లుగా మారాయి. సోమశిలలో పుష్కలంగా నీరున్నా కావలి కాలువ కింద జలదంకి మండలం చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు పనులు చేయకపోవడమే ఇందుకు ముఖ్య కారణం. చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నిండితే కానీ సోమశిల జలాలు కాలువ చివరి ఆయకట్టు భూములకు అందవు. చివరి ఆయకట్టు భూములకు నీరందక ప్రతి ఏటా ఉదయగిరి, కావలి ప్రాంతాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇది గుర్తించిన అప్పటి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావులు పరిస్థితిని అప్పటి సీఎం చంద్రబాబుకు వివరించి బైపాస్ కాలువకు రూ.34.45కోట్లు కేటాయింపులు చేయించారు.ఈ క్రమంలో 2019 మార్చి7న జలవనరుల మంత్రి దేవినేని ఉమ చేతుల మీదుగా సీబీఆర్ ఇన్‌ఫాల్ వద్ద కాలువ డైవర్షన్ పనులకు శంకుస్థాపన చేశారు.

రివర్షన్ టెండరింగ్‌తో..

2019లో టీడీపీ అధికారం కోల్పోవడం, కొత్తప్రభుత్వం ఏర్పడడం జరిగింది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 25శాతం లోపు జరిగిన పనులను గుర్తించి రివర్స్ టెండరింగ్ తీసుకువచ్చింది. కొత్తగా ఆహ్వానించిన టెండర్లలో రూ. 29.75కోట్లతో రీటెండర్ పనులు దక్కించుకున్న టీఎస్ఆర్ నిర్మాణ సంస్థ మట్టిపనులు చేపట్టింది. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఆ నిర్మాణసంస్థ పనులు ఆపేసింది. నాలుగేళ్ల క్రితం ఆగిన పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఆ నిర్మాణ సంస్థకు నేటికీ రాష్ట్రప్రభుత్వం పైసా కూడా ఇవ్వలేదు. చిరకాలం నుంచి బైపాస్ కాలువ నిర్మాణం చేయాలని పోరాటం చేసిన రైతులకు గత టీడీపీ ప్రభుత్వం తీపికబురు చెప్పగా, రైతాంగం ఆశలపై వైసీపీ ప్రభుత్వం నీళ్ళుచల్లింది. డైవర్షన్ పనులు పూర్తయితే కావలికాలువ చివరిఆయకట్టు భూములకు పుష్కలంగా నీరందే అవకాశం ఉంది. ఉదయగిరి, కావలి ప్రాంతాల వైసీపీ నాయకులు ఆదిశగా ప్రయత్నాలు చేసిన దాఖలాలు కూడా లేవు. ఫలితంగా వరినాట్లకు సాగునీరందక నిట్టనిలువునా ఎండిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులపై వైసీపీ ప్రభుత్వం కపటప్రేమ ఒలకపోస్తున్నదనడానికి కావలి కాలువ బైపాస్ పనులు చేయపోవడమే ప్రత్యక్ష ఉదాహరణ.



అప్పటి ఇరిగేషన్‌శాఖ మంత్రి దేవినేని ఉమ ఆవిష్కరించిన కావలి కాలువ డైవర్షన్ పనుల శిలాఫలకం



బిల్లులు మంజూరు కాక నిలిచిపోయిన డైవర్షన్ కాలువ పనులు

బీఫారం అందుకున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 21: కందుకూరు నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం బీఫాం అందజేశారు. ఈనెల 23న నామినేషన్ దాఖలు చేసేందుకు ముహూర్తం నిర్ణయించినందున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి ఆశీర్వదించి జయప్రదం చేయాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పామూరురోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 12 గంటలకు సబ్ కలెక్టరు కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తామని తెలిపారు.



చంద్రబాబు నాయుడు నుంచి బీఫారం అందుకుంటున్న ఇంటూరి నాగేశ్వరరావు

నకిలీ మద్యం కేసులో ఎమ్మెల్యేని అరెస్ట్ చేయాలి

● 36వ వార్డులో కావ్య క్రిష్ణారెడ్డి విస్తృత ప్రచారం

కావలి, ఏప్రిల్ 21 : నకిలీ మద్యం సరఫరా చేసి కొందరి ప్రాణాలను బలికొన్న కేసులో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని అరెస్ట్ చే యాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన కావలి పట్టణం 39వ వార్డులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లోనే కాలనీ ఇళ్లు కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు. అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చేన వెంటనే అందచేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. పెంచిన పింఛన్ రూ.4 వేలు ఏప్రిల్ నుంచే అందజేస్తామన్నారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. గ్రావెల్, ఇసుక, మట్టి అన్నీ దోచేశాడని, ప్రశ్నించిన వారిపై దాడులు చేశారన్నారు. దొంగే దొంగ అన్న చందంగా ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి సచివాలయంలో మద్యం దాచి పెట్టి తనిఖీలకు వస్తున్నారని తెలిసి టీడీపీ వారు దాచి పెట్టారని మభ్యపెట్టే మాటలు చెబుతున్నారన్నారు. తప్పు చేస్తే సిగ్గుపడే వారిని, తలదించుకునే వారిని చూశాము కానీ ఇలాంటి దుర్మార్గులను చూడలేదన్నారు. 2014లో నకిలీ మద్యంతో కొందరి ప్రాణాలను బలిగొన్న ప్రతాప్‌రెడ్డి అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నా రు. అరాచక ఎమ్మెల్యేను తరిమి కొట్టి కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం నాకు ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసులు, తాతా వెంకటేశ్వర్లు, పోట్లూరు జయలక్ష్మి, జనసేన నే తలు పొబ్బా సాయి విఠల్, మన్నేపల్లి రిషికేష్, పవన్, బీజేపీ నేతలు కే. బ్ర హ్మానందం, వింతా రంగా రెడ్డి, పూనూరు మాధవి తదితరులు పాల్గొన్నారు.



కావలి : చంద్రబాబు నుంచి బీఫారం అందుకున్న క్రిష్ణారెడ్డి



కావలి : 36వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న క్రిష్ణారెడ్డి

బీఫారం అందుకున్న కావ్య

కావలి నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డికి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం బీఫాం అందజేశారు.

టీడీపీ నేతల ముమ్మర ప్రచారం

అల్లూరు : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో టీడీపీ నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఏ గ్రామానికి ఆ గ్రామంలో నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ఎన్నికల ప్రచారాలు చేపట్టారు. మండలంలోని నార్తుమోపూరులో నెల్లూరు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో బండి అమర్‌రెడ్డి, విడవలూరు దశరథరామిరెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు తదితరులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. అలాగే పురిణి పంచాయతీలో నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఏ.చందన్‌రెడ్డిలు ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్ రెడ్డి, మర్రిబోయిన సురేంద్ర, నెట్టంబాక పోలయ్య, చేజర్ల హరీష్, షేక్ మహబూబ్ బాషా, ఎల్లు శీనయ్య, చింతల పోలయ్య, అరగల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా వైసీపీ నేతల చేరిక

బిట్రగుంట : బోగోలు మండలంలోనితాళ్లూరు పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆదివారం మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు కుంచాల తిరుమలేష్, లక్కాకుల మాధవరావుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అరవపాలెం, చెంచులక్ష్మీపురం, అక్కరాజువారికండ్రికల నుంచి పలువురు బోగిరి ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీ కండువ కప్పుకున్నారు. ఎస్వీపాలెం పంచాయతీకి చెందిన ఆదిశేషయ్య యాదవ్, రాజు శ్రీనివాసులు రెడ్డి, నాగార్జున, ఇస్టాటి ప్రసాద్, పెయ్యల శీనయ్యల ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరగా వారికి దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి పార్టీ కండువా వేశారు. మరోవైపు కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సమక్షంలో అల్లిమడుగు, కడనూతల గ్రామాలకు చెందిన వారు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, స్థానిక నేతలు అభివద్ధిని పట్టించుకోకపోవడంతోనే వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు తెలిపారు.



అల్లూరు : ప్రచారంలో పాల్గొన్న అమర్‌రెడ్డి, తదితరులు



బిట్రగుంట : టీడీపీలో చేరిన వారితో దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి

నా భర్తను ఆశీర్వదించండి !

● ఇంటూరి సౌజన్య అభ్యర్థన

వలేటివారిపాలెం, ఏప్రిల్ 21 : కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు సతీమణి ఇంటూరి సౌజన్య స్వగ్రామం మండలంలోని కళ్లవళ్లలో ఆదివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తన భర్త విజయం కోసం గడప గడపకు వెళ్లి మీ ఇంటి ఆడపడుచుగా వచ్చా నా భర్తను ఆశీర్వదించండి అని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు బారీ సంఖ్యలో పాల్గొన్నారు.



మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న ఇంటూరి సౌజన్య

టీడీపీలో ఎస్టీ కుటుంబాల చేరిక

కందుకూరు : నియోజకవర్గంలోని ఉలవపాడు మండలం చాకిచర్ల ఎస్టీ కాలనీ, సుబ్బరాయుడు సత్రంకు చెందిన పలు కుటుంబాల వారు ఆదివారం టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఎస్టీ కాలనీకి చెందిన మానికల వెంకయ్య, రవి, రమేష్, రఘురామయ్య, వెంకటేశ్వర్లు, పెదసుబ్బారావు, ప్రసాదు, సుబ్రహ్మణ్యం, అనిల్, సురేష్, మాల్యాద్రి, సింహాద్రి, మురళి, నరేంద్ర, హరిబాబు, తిరుమల తదితరులకు ఆమె పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే సుబ్బరాయుడుసత్రం నుంచి తాటి అభిజిత్, గుత్తా బాలకోటేశ్వరరావు, మలిశెట్టి బాలకోటయ్య, నిమ్మల సుధాకర్, చొక్కరాతి బాలకృష్ణ, సాయి, పాములపాటి వెంకటేశ్వర్లు, మునగపాటి నాని, భావన సుబ్బారావు, కొప్పోలు రమణయ్య తదితరులు వైసీపీని వీడి ఇంటూరి సౌజన్య సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మిరియం మల్లికార్జున, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎందేటి శ్రీను, చాతల భాస్కర్, సుదర్శి సాంబయ్య, పరమాల వెంకటేశ్వర్లు, రామకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా చేయాలని వలంటీర్లపై ఒత్తిడి!

● బలవంతంగా 30 మంది రిజైన్ ● కేటాయించిన కుటుంబాల ఓట్ల బాధ్యత వారిదే..
● డబ్బు, మద్యం పంపిణీకి సిద్ధంగా ఉండాలంటున్న వైసీపీ నేతలు?

ఉలవపాడు, ఏప్రిల్ 21 : ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికలు వైసీపీ ప్రభుత్వానికి చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి కావడంతో ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోకూడదని వైసీపీ నేతలు పథకాలు రచించుకుంటున్నారు. అందులో భాగంగా మండలంలోని వలంటీర్లపై ఒత్తిడి తెస్తూ రాజీనామాలు చేయిస్తున్నారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 285 మంది వలంటీర్లు ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ మొదలు ఇప్పటి వరకు 30 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. భీమవరం గ్రామంలోని 2 సచివాలయాల పరిధిలో 28 మంది వలంటీర్లు ఉండగా వైసీపీ కోసం ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారం చేసేందుకు 26 మంది ఒకేసారి రాజీనామాలు చేయడం విశేషం. అలాగే ఉలవపాడు సచివాలయం3, పెదపట్టపుపాలెం నుంచి నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఇవి ఇంకా పెరిగే అవకాశాలు లేకపోలేదు. ఇదేవిధంగా కొన్ని గ్రామాల నుంచి కూడా ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు సమాచారం. చంద్రబాబునాయుడు వలంటీర్లకు రూ.10.000 ప్రకటించడం కూడా కొంతమేర వలంటీర్లలో ఆశలు పుట్టించడంతో రాజీనామాలకు కొందరు వలంటీర్లు ససేమేర అంటున్నారు. అలాంటి వాళ్లను స్థానిక వైసీపీ నాయకత్వం బెదిరింపులకు దిగుతున్నారు.

● వలంటీర్లపైనే ఆధారపడుతున్న వైసీపీ శ్రేణులు

వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాలకు సంబంధించిన ఓట్ల బాధ్యత వారిదేనని వైసీపీ స్థానిక నేతలు ఒత్తిడ్లి చేస్తున్నట్లు సమాచారం. ప్రతిరోజు వలంటీర్ల పరిధిలోని ఇళ్లకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ పథకాలను వివరించడం, జగన్ మళ్లీ రాకుంటే పథకాలు ఆపేస్తారని ప్రచారం చేయాలని నేతలు చెప్తున్నారని రాజీనామా చేయడం ఇష్టంలేని కొందరు వలంటీర్లు చెబుతున్నారు. ప్రతి ఇంటికి ఎన్నికల తాయిలాలు డబ్బు, మద్యం పంపిణీ కూడా రాజీనామ చేసిన వలంటీర్లు తీసుకొని బాధ్యతగా పనిచేయాలని, పార్టీ ఆదేశాలను తప్పక పాటించాలని స్థానిక నాయకులు మార్గనిర్దేశకాలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో కొందరు వలంటీర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

మాటిస్తే ఓటు వేసే వాళ్లం...

మా మాట



నాకు 73 ఏళ్లు. గతంలో జరిగిన ఎన్నికలకు, నేడు జరుగు తున్న ఎన్నికలకు తేడా గమనించా.అప్పట్లో నాయకులు గ్రామాల్లో ఇళ్లకు వచ్చినప్పుడు మాట ఇస్తే, ఎదుటి వాళ్లు ఎంత ప్రయ త్నించినా మొదట చెప్పిన వారికే ఓటు వేసే వాళ్లం. ఇప్పుడు ఈరోజు ఓ పార్టీ రేపొక పార్టీలో తిరు గుతున్నారు. అప్పట్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చులకు మేమే చందాల వేసి డబ్బులు ఇచ్చేవాళ్లం.

- కొండాపురం

భిన్నవ్యక్తిత్వాల మధ్య పోరు

ఎవరిదో జోరు!

- నెల్లూరు పార్లమెంటుకు వేమిరెడ్డి వర్సెస్ వేణుంబాక !
- జిల్లావ్యాప్తంగా సేవలతో వీపీఆర్
- సొంత ఊరికే చుక్కలు చూపించిన వీఎస్ఆర్
- జలదాతగా ప్రభాకరుడు
- అవినీతి మరకలతో విజయసాయి





చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా నెల్లూరు ఎంపీ స్థానానికి భిన్నవ్యక్తిత్వాల మధ్య పోరు నడుస్తోంది. టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్), వైసీపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి (వీఎస్ఆర్)ల మధ్య ప్రతిష్టాత్మక పోటీ సాగుతోంది. కొద్ది రోజుల క్రితం వరకు వీరిద్దరూ ఒకే పార్టీ నేతలు. ఇద్దరు కూడా రాజ్యసభ సభ్యులే. అంతేకాదు ఒకే జిల్లా వాసులు. అయితే వీరి వ్యక్తిత్వాలు మాత్రం పూర్తిగా భిన్నమైనవిగా ప్రజలు భావిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని వందలాది గ్రామాలు వీపీఆర్‌ను జలదాతగా గుర్తుంచుకుంటే.. విజయసాయి మాత్రం సొంత ఊరికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఏదోరకంగా తమను ఆదుకుంటారని నమ్మకంతో ప్రజలు వీపీఆర్ ఇంటికి క్యూ కడుతుంటే.. విజయసాయి రాజకీయ కక్షదారుడని విశాఖవాసులు ఘోషిస్తున్నారు. గో బ్యాక్ అంటూ నినదిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పించే విద్యాదాతగా వీపీఆర్‌ను జిల్లా ప్రజలు గుర్తుంచుకుంటే.. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాజకీయ కేంద్రంగా మార్చిన నింద విజయసాయిని వెంటాడుతోంది. ఇలా.. వీరిద్దరి మధ్య వెలుగుకు, చీకటికి ఉన్నంత తేడా కనిపిస్తోందనేది జనవాక్యం. ఈ రసవత్తర పోరులో ప్రజలు ఎటువైపు నిలుస్తారు... ఎవరిని ఆదరిస్తారు? అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ నడుస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

వీపీఆర్‌కు దాతగా గుర్తింపు

వీపీఆర్ రాజకీయాల్లోకి అడుగు పెట్టకముందు నుంచే దాతగా జిల్లా ప్రజల్లో గుర్తింపు పొందారు. వీపీఆర్ ట్రస్ట్ స్థాపించి వ్యాపార రంగానికి సమాంతరంగా జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫ్లోరైడ్ బాధిత గ్రామాల ప్రజల దృష్టిలో జలదాతగా గుర్తింపు పొందారు. సొంత నిధులతో వందకు పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఎనిమిదేళ్ల క్రితమే పాఠశాల స్థాపించారు. అక్కడుండేవారికి పుస్తకాలు, భోజన వసతిని ఉచితంగానే అందజేస్తున్నారు. జిల్లాతోపాటు దేశ వ్యాప్తంగా ఎన్నో అనాథ శరణాలయాలకు విరాళాలు అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, ఆలయాల పునరుద్ధరణకు భారీ మొత్తాలను అందించారు. వీటన్నింటికి మించి సాయం కోరిన వారిని ఒట్టి చేతులతో పంపని మంచి వ్యక్తిగా ప్రజల దృష్టిలో నిలిచారు. ఈ కార్యక్రమాలే ఆయనకు రాజకీయ పదవులు తెచ్చిపెట్టాయి. అయితే కుట్ర రాజకీయాలను జీర్ణించుకోలేక వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో పక్షం రోజుల పాటు ఆయన నివాసానికి జనం పోటెత్తివచ్చి సంఘీభావం తెలిపారు. ఆరేళ్లపాటు వైసీపీలో క్రియాశీల నాయకుడిగా వ్యవహరించినా, చిన్న అవినీతి మరక కూడా లేకుండా బయటకు వచ్చారు. ఆయన పార్టీలో చేరిక సందర్భంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడే స్వయంగా నెల్లూరుకు వచ్చి వీపీఆర్ దంపతులకు స్వాగతం పలికారు. ఆ దంపతులు టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసే క్రమంలో ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురైనా మౌనంగానే ఉండిపోయారు. తన గురించి నీతి లేని వ్యాఖ్యలు చేసే వారి సంగతి ఆ దేవుడే చూసుకుంటాడని ఓర్పు వహించారు. రాజకీయాల్లో వివాద రహితుడిగా, అజాత శత్రువుగా గుర్తింపు పొందారు.

విశాఖను వణికించిన వీఎస్ఆర్

నెల్లూరు ముద్దుబిడ్డగా ప్రచారం చేసుకుంటున్న విజయసాయిరెడ్డి జిల్లాకు చేసిన సేవ ఏదైనా ఉందా ? అంటే ఏమి లేదనే చెప్పాలి. చివరకు సొంత ఊరికి కూడా పెద్దగా ఏమి చేయలేదు. సుమారు 12ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా, వైసీపీలో నంబర్ 2గా గుర్తింపు పొందిన వీఎస్ఆర్ తన మార్కు కనిపించేలా జిల్లాకు ఒక్క పని కూడా చేయలేదు. సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలం, తాళ్లపాక ఆయన సొంతూరు. రెండున్నరేళ్ల క్రితం ఆ గ్రామాన్ని ఆయన దత్తత తీసుకున్నారు. కమ్యూనిటీ హాల్, కల్యాణ మండం కట్టిస్తానన్నారు. రూ.14 కోట్లతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. అవేవి చేయలేదు. ప్రభుత్వ నిధులతో నాలుగు రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు వేశారు తప్ప ఆయన సొంత నిధులు రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఇకపోతే ప్రభుత్వ నిధులతోనైనాసరే ఇచ్చిన ప్రధాన హామీలు నెరవేర్చలేకపోయారు.

జాతీయస్థాయిలో గుర్తింపు

ఇక పేరు ప్రఖ్యాతుల విషయానికి వస్తే జాతీయ స్థాయిలో ప్రచారంలోకి వచ్చారు. జగన్ అక్రమాస్తుల కేసులో ఏ-2 నిందితుడిగా ఈడీ కోర్టుల చుట్టూ తిరుగుతు న్నారు. విశాఖపట్నం విషయంలో మరోసారి జాతీయస్థాయిలో వార్తల్లోకి ఎక్కారు. విశాఖ జిల్లాలో ప్రతిపక్ష పార్టీ నాయ కుల ఆర్థిక మూలాలను దెబ్బ తీయడమే ధ్యేయంగా కుట్రలు పన్నారనే అభియో గాలు ఎదుర్కొన్నారు. రాజకీయ కక్షలతో గీతం వర్సిటీ ప్రహరీ పడగొట్టారని, విశాఖ మాజీ ఎంపీ, మాజీ మేయర్ ఇంట్లో ప్రభుత్వ స్థలం కలిసి ఉందని ఆ ఇల్లు పడగొట్టించారని, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఆపిం చారని పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. 50 ఏళ్లుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రూ.వేల కోట్ల విలువ జేసే దసపల్ల భూములను నిషేధిత జాబితా నుంచి తొల గించి తమ వారి పేర్లు మీద రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూముల్లో విజయసాయి బినామీలు అపార్టుమెంట్లు కడుతు న్నారని, ఆ అపార్టుమెంట్లకు వెళ్లే వంద అడుగుల రోడ్డు కూడా ప్రభుత్వ సొమ్ము తో వేస్తున్నారని విశాఖ నగరం ఘోషించింది. కేంద్రం నిధులతో నిర్మిస్తున్న విశాఖ బీచ్- భోగాపురం బీచ్ వరకు కోస్టల్ కారిడార్ పథకం కింద నిర్మిస్తున్న నాలుగు లైన్ల రోడ్డును విజయసాయి పథకం ప్రకారం భీమిలి వైపు మళ్లించాడని, అంతకుముందే అక్కడున్న భూములను కారుచౌకగా కొనుగోలు చేసి, రోడ్డు వచ్చిన తరువాత అధిక ధరకు అమ్ముకున్నాడని విశాఖ కోడై కూసింది. అంతేకాక ఆంధ్ర యూనివర్సిటీని సైతం విజయసాయి రాజకీయ కేంద్రంగా మార్చారనే విమర్శలు వెల్లువెత్తాయి. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యత ఆంధ్రవర్సిటీ వీసీ ప్రసాద్‌రెడ్డికి అప్పగించారని, దీంతో టికెట్ కోసం వచ్చే రాజకీయ నాయకులతో ఆంధ్రవర్సిటీ రాజకీయ కేంద్రంగా మారిపోయిందని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఐదేళ్లుగా విజయసాయికి వ్యతిరేకంగా విశాఖలో తరచూ ఉద్యమాలు, నిరసనలు జరుగుతూనే ఉన్నాయి.

రాజకీయ ఉపాధి



వ్యవసాయ కూలీలకు భలే గిరాకీ!

- సేద్యం పనులు లేకపోయినా ప్రచారంతో ఉపాధి

సార్వత్రిక ఎన్నికల సమరం మొదలవడంతో వ్యవసాయ కూలీలకు గిరాకీ పెరిగింది. అభ్యర్థుల ప్రచారాలకు జనాదరణ కోసం ఆయా రాజకీయా పార్టీల నేతలు రైతు కూలీలను తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం రబీ వ్యవసాయ సీజన్ పూర్తయి రైతాంగమంతా ఎడగారుకు హాలిడే ప్రకటించడంతో వ్యవసాయ కూలీలకు పనులు లేకుండాపోయాయి. ఇదే సమయంలో ఎన్నికలు రావడంతో సేద్యం పనులకు ప్రత్యామ్నాయంగా ప్రచారాలు కలిసొచ్చాయి. దీంతో మనిషి లెక్కల కోసం ఇంట్లో భార్యభర్తలతోపాటు పిల్లలను సైతం ఎన్నికల ప్రచారాలకు తీసుకెళ్తున్నారు. నారేతలు, కలుపు, వడ్ల లోడింగ్‌లకు కూలీలను తీసుకెళ్లే మేస్త్రీలకు ప్రస్తుతం ఎక్కడా లేని గిరాకీ ఉంది. ఎన్నికల ప్రచారాలకు వచ్చిన వారికి రూ.300లతోపాటు భోజనం పెట్టిస్తున్న అభ్యర్థులు కూలీలను తీసుకువచ్చిన మేస్త్రీలకు ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తున్నారు. కూలీల డిమాండ్‌ను బట్టీ వీరికి ఆఫర్లు ఇస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో ఉదయం ఒక పార్టీకి వెళ్లిన వ్యవసాయ కూలీలు సాయంత్రం మరో పార్టీకి వెళ్లి రోజుకు రూ.600 చొప్పున కూడా సంపాదించుకుంటున్నారు.

- నెల్లూరు రూరల్

ఓటు... భలే రేటు !

అదీ మందు

నియోజకవర్గంలో అసలు పోరు ఇప్పుడే ఆరంభమైంది. ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఎవరెవరు ఎన్నికల బరిలో ఉండేది తేలిపోయింది. ఆత్మకూరులో ప్రధానంగా టీడీపీ, వైసీపీల మధ్యే పోటీ నెలకొంది. అటు రామనారాయణరెడ్డి, ఇటు విక్రమ్‌రెడ్డి బలమైన వారు కావడంతో ఓటుకు భలే గిరాకీ ఏర్పడింది. దీంతో అభ్యర్థులు కూడా డబ్బు మూటలతో సిద్ధమవుతు న్నారు. ఈసారి ఇక్కడ ఎన్నికల ఖర్చు రూ.100 కోట్లకు పైమాటేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల కంటే ఈసారి డబ్బు పంపిణీ మూడు నుంచి నాలుగురెట్లు ఉంటుందని పార్టీ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. కాగా ఈసారి ఎన్నికల్లో కులంతో పాటు డబ్బుకు ప్రాధాన్యం పెరిగింది. ద్వితీయ శ్రేణి నేతలకు ప్రధానపార్టీల అభ్యర్థులు డబ్బుతో ఎర వేస్తున్నారు. దీంతో ఓ పార్టీ నుంచి మరో పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయి. నియోజకవర్గంలోని అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులకు డిమాండ్ ఏర్పడింది. వీరికి గాలం వేసేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ప్రచారానికి వచ్చే కార్మికులకు కూడా గిరాకీ పెరిగింది. ఒక్కొక్క చోట అభ్యర్థి వెంట వచ్చేవారికి రూ.300 నుంచి రూ.700లు వరకు ఇస్తున్నారు.

- ఆత్మకూరు

అంతా కలసిపోయారు !

టైమ్ టు టైమ్



గతంలో వారంతా రాజకీయ ప్రత్యర్థులు. ఎక్కడైనా ఎదురుపడితే కూడా ఒకరివైపు ఒకరు చూసుకునేవారు కాదు. తాజా రాజకీయ పరిణామాలు వారిని మార్చేశాయి. 1999, 2004, 2009లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, 2012 ఉపఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, 2014లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, పీ. చెంచల బాబు యాదవ్, 2019లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావులు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ తరఫున ఉదయగిరిలో పోటీ చేశారు. రాజకీయ ప్రత్యర్థులుగా కత్తులు దూసుకున్నారు. అయితే ప్రస్తుతం వారంతా ఒక్కటయ్యారు. ఉదయగిరి నియో జకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ విజయానికి పాటుపడుతున్నారు. ఈ క్రమంలో వారు కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డితో కలసి శనివారం రాత్రి నెల్లూరులోని ఓ హోటల్‌లో తాజా రాజకీయ పరిస్థితులు, కాకర్ల విజయానికి చేపట్టే చర్యలపై చర్చలు జరిపారు. ఆ ఫొటో కాస్త సోషల్ మీడియా వైరల్ కాగా, జిల్లాలో చర్చనీయాంశమైంది. అందుకే అంటారు రాజకీయా ల్లో ఎవరూ మిత్రులు కాదు.. శత్రువులు కాదని..!

- ఉదయగిరి రూరల్



అంకమ్మ దర్శనం ఆనవాయితీ

- నాయకుడు ఎవరైనా.. పార్టీ ఏదైనా..!

సెంటిమెంట్

పార్టీ ఏదైనా.. నాయకుడు ఎవరైనా కందుకూరులో గ్రామదేవత అంకమ్మను దర్శించుకోవాల్సిందే. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాకే ఏ కార్యక్రమమైనా ప్రారంభించాల్సిందే. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు కానీ నాయకులు కానీ ఈ సెంటిమెంట్‌ను బలంగా నమ్ముతారు. ఒకరిద్దరు నాయకులు ఈ ఆనవాయితీని పట్టించుకోనప్పుడు వారిని విజయం వరించలేదన్న నమ్మకం కూడా బలంగా ఉంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అంకమ్మ అన్న బలమైన విశ్వాసం ఈ ప్రాంత ప్రజల్లో ఉండటమే ఇందుకు కారణం. పాతతరం నేతలు దివి కొండయ్య చౌదరి, మానుగుంట ఆదినారాయణరెడ్డి, ఇతర నేతలు ఈ సాంప్రదాయాన్ని పాటించారు. ఆతర్వాత తరానికి చెందిన మానుగుంట మహీధరరెడ్డి, దివి శివరాంలు కూడా ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించారు. మొదట్లో ఈ సెంటిమెంట్‌ను అంతగా పట్టించుకోని మహీధరరెడ్డి ఆతర్వాత కాలంలో అమ్మవారి మహత్యాన్ని గుర్తించి, పాటించారు. ప్రస్తుత నేతలు ఇంటూరి నాగేశ్వరరావు, బుర్రా మధుసూదన్‌యాదవ్, ఇంటూరి రాజేష్ తదితరులు సైతం ఈ సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారు.

- కందుకూరు

వంతెన కష్టాలు

ఎప్పటికి తీరేనో!?

ఒక్కరొస్తే ఒట్టు

- నక్కలవాగు, ఉప్పుటేరులపై ప్రమాదకరంగా బ్రిడ్జీలు
- కొత్తవి నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం సీఎం జగన్ హామీ
- నిధులు మంజూరైనా ముందుకురాని కాంట్రాక్టర్లు
- చొరవ చూపని పాలకులు, అధికార యంత్రాంగం
- ముత్తుకూరు, వెంకటాచలం మండలాలకు శాపం

ఇది కొన్ని వేల కుటుంబాల సమస్య.. ఓ చోటేమో వర్షం కురిస్తే బ్రిడ్జి మునిగిపోతుంది. ఆ గ్రామానికి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పడవల్లో వెళ్లాల్సి ఉంటుంది. మరో చోటేమో ఎప్పుడో నిర్మించిన బ్రిడ్జి అది. ఎప్పుడు కూలిపోదామా అని ఎదురుచూస్తోంది. ముత్తుకూరు, వెంకటాచలం మండలాల్లోని ఈ రెండు చోట్లా కొత్త వంతె నలు నిర్మించేందుకు 2022లో జిల్లాకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నట్లు స్వయం గా ప్రకటించారు. ఏడాదన్నర గడిచినా కనీసం టెండర్లు కూడా పూర్తి చేయలేకపోయారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చిన్న బ్రిడ్జీని కూడా నిర్మించలేకపోయారని ఆ రెండు మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నెల్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరు మండలం పొట్టెంపాడు వద్ద నక్కల వాగుపై ఉన్న బ్రిడ్జిని దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి రెండు వైపులా గోడలు దెబ్బతిని ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి నెలకొంది. అందులోనూ ఇది చిన్న బ్రిడ్జి కావడంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. ముత్తుకూరు, బ్రహ్మదేవిల నుంచి పొట్టెంపాడు వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం. నక్కలవాగు పైనున్న బ్రిడ్జి మీదుగానే వెంకటాచలం మండలానికి కనెక్టివిటీ ఉంది. నక్కలవాగుపై బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు ఎప్పటి నుంచో కోరుతూ వస్తున్నారు. అలానే వెంకటాచలం మండలం తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుటేరు మీద ప్రస్తుతం చిన్న బ్రిడ్జి ఉంది. తిరుమలమ్మపాలెం వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం. వర్షం కురిస్తే ఉప్పుటేరు పొంగుతుంది. అప్పుడు బ్రిడ్జి కూడా మునిగిపో తుంది. ఆటు పోట్లు వచ్చినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమయంలో రాకపోకలకు పడవలే దిక్కు. ఇది ప్రమాదకరం కావడంతో కొత్త బ్రిడ్జి నిర్మించాలని తిరుమలమ్మపాలెం గ్రామ ప్రజలు కోరుతూ వస్తున్నారు. ఈ క్రమంలో 2022 అక్టోబరులో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృష్ణ పట్నం థర్మల్ ప్లాంట్ యూడో యూనిట్ ప్రారంభానికి జిల్లాకు విచ్చేశారు. ఆ సందర్భంగా నక్కల వాగు, ఉప్పు టేరులపై బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు సీఎం సభా వేదికపై ప్రకటించారు. నక్కల వాగుపై బ్రిడ్జికి రూ.10 కోట్లు, ఉప్పుటేరుపై బ్రిడ్జికి రూ.12 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆ వెంటనే ఈ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులకు అప్పగించారు. ఈ రెండు బ్రిడ్జిలకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తుండటంతో కొత్తగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ రెండు బ్రిడ్జీల విషయంలో కూడా ఇదే జరిగింది. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపిన ఆరు నెలలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు, నక్కల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో జీవోలు వెలువడ్డాయి. ఆగస్టు తర్వా త అధికారులు ఈ రెండు వంతెనలకు రెండు సార్లు టెండర్లు ఆహ్వానిం చారు. కానీ ఒక్కరంటే ఒక్క కాంట్రాక్టర్ కూడా బిడ్ దాఖ లు చేయ లేదు. స్వయంగా సీఎం హామీ ఇచ్చిన పనులు కూడా జరిగే పరిస్థితి లేకుండా పోయిందంటే వాస్తవాలను అర్థం చేసుకోవచ్చు. కాంట్రాక్టర్లను రప్పించి వెంకటాచలం, ముత్తుకూరు మండలాల ప్రజలకు అవసరమైన బ్రిడ్జిలను నిర్మించడంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. నిధులు ఇస్తున్నామని ప్రకటించి ప్రజ లను మభ్యపెట్టారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ముత్తుకూరు : ప్రమాదకరంగా నక్కలవాగుపై బ్రిడ్జి

మరోసారి టెండర్లు పిలుస్తాం!

నక్కలవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు, ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వాటికి అనుగుణంగా టెండర్లు పిలిచాం. కానీ ఒక్క కాంట్రాక్టర్ కూడా టెండర్ వేయలేదు. ఎన్నికల కోడ్ ముగిశాక మరోసారి టెండర్లు పిలుస్తాం.

- ఎం గంగాధర, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ



వెంకటాచలం : తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుటేరు పై బ్రిడ్జి